www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 313
మంగళవారం | 27-2-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 1.55 తదుపరి చవితి, నక్షత్రం: హస్త పూర్తి; వర్జ్యం: మ 1.59-3.47; దుర్ముహూర్తం: ఉ. 8.59-9.46, రా. 12.21-11.09; అమృతఘడియలు: రా.12.48-2.36; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 6.18
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





శ్రీకాకుళంలో 'రా.. కదలిరా' సభకు హాజరైన జనం, పార్టీల జెండాతో చంద్రబాబు

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేనదే గెలుపు. ఈ గెలుపును ఎవరూ ఆపలేరు. జనం ఉత్సాహం చూస్తుంటే జగన్ పని అయిపోయిందని తెలుస్తోంది.
- హుద్‌హుద్ తుఫాను, తితలీ తుఫాన్లను చూశాం. రాబోయేది రాజకీయ తుఫాను.. ఇందులో జగన్ కొట్టుకుపోయి బంగాళాఖాతంలో కలవడం ఖాయం. - చంద్రబాబు

మా పొత్తు సూపర్‌హిట్

చెడగొట్టేందుకు శతవిధాలా జగన్ యత్నాలు: బాబు

మా గెలుపును ఎవరూ ఆపలేరు

అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ

పథకాలు రద్దుచేసి వేల కోట్లు దోపిడీ

పేదల ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు

9 సార్లు కరెంటు చార్జీల పెంపు

పేదలపై రూ.65 వేల కోట్ల భారం

అయినా సిద్ధమని ప్రగల్భాలు

శ్రీకాకుళం 'రా కదలిరా' సభలో టీడీపీ అధినేత ఆగ్రహం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన కాంబినేషన్ సూపర్‌హిట్. వైసీపీకి భయం మొదలైంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. తమ మధ్య పొత్తు కుదరకుండా చెడగొట్టడానికి సీఎం జగన్ శతవిధాలుగా ప్రయత్నించాడని.. ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నాడని ధ్వజమెత్తారు. 'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించారు. పొత్తు తన కోసమో, పవన్ కల్యాణ్ కోసమో కాదని.. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసమేనని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టంచేశారు. 'మా పొత్తును ప్రజలు ఆమోదించారు. మాకూ అవగాహన ఉంది. మధ్యలో మీకేంటి బాధ? కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వైసీపీవి నీచ, చవట రాజకీయాలు. అందుకే ఆ పార్టీకి స్వస్తి పలకాలి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అందరం కృషిచేద్దాం' అని

మిగతా 2వ పేజీలో...

వసంతకు మైలవరం టికెట్!

దేవినేని ఉమాకు మరోచోట అవకాశం

గురజాలలో జంగా కృష్ణమూర్తికి చాన్స్

మరికొన్ని స్థానాల్లోనూ కీలక మార్పులు?

కొలిక్కిరాని దర్శి, గిద్దలూరు సీట్ల అంశం 2

టీడీపీలో చేరిన ఎమ్మెల్యే పార్థసారథి

భవకుమార్, తుమ్మల చంద్రశేఖర్ కూడా 11

అనర్హత వీరిపైనే...

టీడీపీ: వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరి, కరణం బలరాం, వల్లభనేని వంశీ

వైసీపీ: ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి



ఎట్టకేలకు అనర్హత

8 మంది ఎమ్మెల్యేలపై ఎన్నికల ముంగిట వేటు

టీడీపీ, వైసీపీల నుంచి చెరో నలుగురు

స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వెలువడనుండగా... ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై 'అనర్హత వేటు' పడింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ టీడీపీ టికెట్‌తో గెలిచిన నలుగురు, వైసీపీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన నలుగురిపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేశారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఈ ఉత్తర్వులు

మిగతా 12వ పేజీలో...

కుప్పానికి ఎన్నికల నీళ్లు!

బాబు కంటే ఎక్కువ చేశానని జగన్ గొప్పలు 11

బాబు 80 శాతం పూర్తిచేసి చేతికిస్తే.. మిగతా 20 శాతం

కుప్పం బ్రాంచ్ కెనాల్‌కే ఐదేళ్లు

అయినా, నీళ్లు, రిజర్వాయర్లంటూ కుప్పంలో ఎన్నికల స్టంట్

చెల్లినని కూడా చూడకుండా..!

జగన్, ఆయన సైన్యం దూషిస్తోంది: షర్మిల



అనంతపురం సభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, పీసీసీ చీఫ్ షర్మిల అభివాదం

నా గురించి, నా భర్త గురించి వ్యక్తిగతంగా నానా మాటలంటోంది

ఒకప్పుడు ఈ చెల్లే పాదయాత్ర చేసింది

'బైబై బాబు' అని గద్దె దించిందీ ఈ చెల్లే

కాంగ్రెస్‌లో చేరానని నన్ను తిట్టిపోస్తారా

వైఎస్ ఆశయాలు నెరవేర్చని జగన్ వారసుడా?

రాజశేఖరరెడ్డికి నేనే సిసలైన వారసురాలిని

మద్యం నిషేధిస్తానని ఆయనే అమ్ముతున్నాడు

రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలు దీనిని గమనించాలి

జగన్ పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి

నిప్పులు చెరిగిన పీసీసీ చీఫ్ షర్మిల

అనంతలో ఎన్నికల శంఖారావం

అనంతపురం ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): "సొంత చెల్లినని కూడా చూడకుండా జగన్, ఆయన డబ్బు పెట్టి కొన్న సైన్యం.. నన్ను, నా భర్తను, మా వాళ్లను వ్యక్తిగతంగా దూషిస్తున్నారు. నానా మాటలు అంటున్నారు" అని సీఎం జగన్ సోదరి, ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, రాజధాని గురించి పోరాడుతున్న నాపై సోషల్ మీడియాలో అనరాని మాటలు అంటున్నారు. డబ్బులతో

మిగతా 11వ పేజీలో...

పేద కుటుంబానికి నెలకు 5 వేలు!

ఏపీలో అధికారంలోకి రాగానే అమలు.. ఇది కాంగ్రెస్ గ్యారెంటీ: ఏఐసీసీ చీఫ్ 11

సీఎం జగన్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు.. అనంత కాంగ్రెస్ సభలో మండిపడ్డ ఖర్గే



చంద్రుడిపై నిద్రలేచిన స్లిమ్

జాబిల్లిపై కఠిన రాత్రిని తట్టుకుని నిలబడిన జపాన్ ల్యాండర్ 12

జూన్ నుంచి మూడోస్సారి..!

బీజేపీకి 370 లోక్‌సభ స్థానాలు ఖాయం

ఎన్డీయేకి 400 పైనే.. మోదీ ధీమా 12

2 వేల రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

జ్ఞానవాపిలో పూజలు కొనసాగించుకోవచ్చు: హైకోర్టు 12

రాజకీయాలకు విహారి బలి!



ఆంధ్రకు యువ క్రికెటర్ గుడ్‌బై

ఆంధ్ర క్రికెట్‌లో పెచ్చుమీరిన రాజకీయం.. ఏసీఏలో వైసీపీ నేతల జోక్యం

అధికార పార్టీ నేత కుమారుడి కోసం హనుమ విహారి కెప్టెన్సీ తొలగింపు 10

అవమాన భారంతో 'ఆంధ్ర'ను వీడిన విహారి.. ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఉండలేను

జన్మలో మళ్లీ ఆంధ్రకు ఆడనంటూ ప్రకటన.. ఆటగాళ్ల మద్దతు విహారికే



రమణదీక్షితులుపై వేటు

దేవస్థానం నుంచి తొలగిస్తున్నట్లు టీటీడీ ప్రకటన

ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం 2

జియర్లు, అర్చకులపై నిందారోపణలతో నిర్ణయం

కడప సుబ్బారెడ్డి ఈ భూమి నాదన్నాడు!



ఎవడ్రా నువ్వు.. తంతానన్నా: మంత్రి ధర్మాన

భూకబ్జాలకు ఇదే నిదర్శనం.. టీడీపీ నేతల విమర్శలు 11



ప్రముఖ గజల్ గాయకుడు

పంకజ్ ఉధాస్ కన్నుమూత

కొన్నాళ్లుగా అనారోగ్యం.. ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస 6



విశాఖలో ఫ్లోటింగ్ బ్రిడ్జి నుంచి విడిపోయిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్'

అలల కల.. చెల్లాచెదురు..!

24 గంటల్లోనే ముక్కలైన ఫ్లోటింగ్ బ్రిడ్జి

విశాఖ ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. పర్యాటక శాఖ అనుమతి లేకపోయినా ఏర్పాటు

ఆర్కే బీచ్‌లో లోతు ఎక్కువ, పైగా రాళ్లు.. ప్రమాదమని తెలిసీ నిపుణులు చెప్పారంటూ నిర్మాణం

పర్యాటకులకు అందుబాటులోకి రాకుండానే సముద్రంలో చెల్లాచెదురైన అలల వంతెన

వంతెనపై ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు 2

ఒక నిర్లక్ష్యం.. 3 టైరు పంక్చర్లు!

10 మంది ప్రాణాలు తీసిన రోడ్డు ప్రమాదాలు

34 మందికి గాయాలు..

కాకినాడ జిల్లాలో టైరు పంక్చరు వేస్తుండగా లారీ డ్రైవర్ల పైనుంచి దూసుకుపోయిన బస్సు

ముగ్గురు డ్రైవర్లతోపాటు స్థానికుడి మృతి

ఉరవకొండలో బొలెరో టైర్ పంక్చర్..

30 మందికి గాయాలు 3

కర్ణాటకలో వాహనం టైరు పేలి.. ముగ్గురు కర్నూలు జిల్లా రైతుల మృతి

అన్నమయ్య జిల్లా బండపల్లిలో లారీని ఢీకొన్న బైక్.. ముగ్గురి మృతి



మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్, పక్కన ఎల్‌వీ, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం!

- వేయకుంటే అది చోరీ అవడం ఖాయం
- తిరుపతి ఉప ఎన్నికే దీనికి నిదర్శనం: నిమ్మగడ్డ రమేష్‌కుమార్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 26: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమని, ఆ ఓటును సద్వినియోగం చేసుకోకపోతే, ఓట్లు చోరీకి గురికావడం ఖాయమని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్, సిటిజన్ ఫర్ డెమోక్రసీ(సీఎఫ్‌డీ) వ్యవస్థాపకుడు నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తెలిపారు. రెండేళ్ల క్రితం జరిగిన తిరుపతి ఉపఎన్నికలే దీనికి నిదర్శనమన్నారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు 'ఓటు వేద్దాం..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' పేరుతో విజయనగరం జిల్లా చింతవలసలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఉప ఎన్నికల్లో 35 వేల మంది పేర్లు ఓటర్ జాబితాలో ఉండి కూడా ఓటు వేయలేదని, దీంతో ఆ ప్రాంతంలో నివశించని వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆ 35 వేల ఓట్లను వేరే వారితో వేయించి, అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. ఓటు హక్కును మనం వినియోగించుకోకపోతే ఓట్లు చోరీ అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎక్కడైనా అక్రమాలు జరిగితే.. ఈ విజన్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

రమణ దీక్షితులపై టీటీడీ వేటు



తిరుమల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు, ప్రస్తుత గౌరవ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులపై వేటు పడింది. టీటీడీ, జీయర్ స్వాములు, అర్చకులు, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠంపై ఆరోపణలు చేసిన క్రమంలో రమణదీక్షితులను తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తొలగిస్తున్నట్టు టీటీడీ బోర్డు సోమవారం ప్రకటించింది. టీటీడీ పరిపాలన అంశాలు, అధికారులు, జీయర్ స్వాములు, అర్చకులపై రమణదీక్షితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నట్టుగా ఈ నెల 21న సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయింది. కైంకర్యాలు సక్రమంగా చేయడం లేదని, నైవేద్యాలు తగినంత పెట్టడం లేదని, నిధుల కోసం తవ్వకాలు చేపట్టడంతో పాటు ఆలయంలో నూతన స్తంభాలు తీసుకువచ్చారని, ఇంకా అధికారులు, అర్చకులు, జీయర్ స్వాములు, పోటు కార్మికులందరినీ తీవ్రస్థాయిలో కించపరుస్తూ మాట్లాడుతున్నట్టు అందులో ఉంది. అది విడుదలైన నిమిషాల వ్యవధిలోనే రమణదీక్షితులు 'ఎక్స్'లో స్పందించారు. 'అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వీడియోను చూసి షాక్ అయ్యాను. అది నా గొంతు కాదు. నాపై అసూయపడేవారు, నన్ను అప్రతిష్ఠపాల్జేయాలని ఈ చీప్ ట్రిక్ చేశారు' అంటూ వివరణ ఇచ్చారు. అయితే మరుసటిరోజు ఆలయ అర్చకులు మీడియా ముందుకు వచ్చి రమణదీక్షితులపై విరుచుకుపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాలు, గుర్తింపు కోసం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారంటూ మండిపడ్డారు. ఆలయంలో అన్నీ ఆగమోక్తంగానే జరుగుతున్నాయని వివరించారు. తమ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేసిన రమణదీక్షితులపై చర్యలు తీసుకోవాలంటూ రెండురోజుల తర్వాత టీటీడీ పెద్దజీయర్, చిన్నజీయర్ టీటీడీకి లేఖ సమర్పించారు. ఆయనపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అహోబిలం మఠం నిర్వాహకులు కూడా లేఖ రాశారు. బోర్డు సభ్యులు, పోటు కార్మికుల నుంచీ రమణదీక్షితులపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత రావడంతో సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ వీడియోపై చర్చించారు. నిందారోపణలు చేసిన ఆయన్ను వెంటనే టీటీడీ నుంచి తొలగించాలని తీర్మానం చేశారు. అయితే బోర్డు నిర్ణయంపై వంశపారంపర్య అర్చక కుటుంబానికి చెందిన రమణదీక్షితులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

మా పొత్తు సూపర్‌హిట్



(మొదటి పేజీ తరువాయి)

పిలుపిచ్చారు. జగన్‌ను ఉత్తరాంధ్ర ద్రోహిగా అభివర్ణించారు. జీవితంలో వాస్తవాలు చెప్పడని.. అబద్ధాలు చెప్పడంలో పీహెచ్‌డీ చేశాడని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో కుట్రలకు పాల్పడుతున్నాడని.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడని దుయ్యబట్టారు. సైకో పాలనతో రాష్ట్రం నిరుద్యోగంలో నంబర్ వన్ అయిందన్నారు. 'రాష్ట్రంలో ఏ ఒక్కరికీ భద్రత లేదు. చివరకు మీడియాకూ భద్రతలేదు. వారిపైనా దాడులు చేయిస్తున్నాడు. వారికి వ్యతిరేకంగా జీవో 243 తీసుకొచ్చాడు' అని ధ్వజమెత్తారు. సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, గుండ అప్పలసూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నాయకులు పాల్గొన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

కొత్త నాటకాలు..

జగన్ కొత్తనాటకాలకు తెరతీశాడు. పేదల మనిషంట! వేల కోట్లను దోచుకుని.. పేదల పథకాలను రద్దుచేసి పేదల ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు. నువ్వు ఏవిధంగా పేదల మనిషివి? ప్రజలను అంతం చేయాలని చూస్తున్న భస్మాసురుడివి. తొమ్మిది దఫాలు విద్యుత్ చార్జీలు పెంచావు. పేదలపై రూ.65 వేల కోట్ల భారం మోపావు. ఇందుకేనా సిద్ధమని ప్రగల్భాలు పలుకుతున్నావు. 24గంటలపాటు కరెంట్ ఇచ్చావా? రూ.20కోట్లతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనుక్కున్నావు. హెలికాప్టర్లో తిరుగుతూ.. పోలీసులు, పరదాలను అడ్డుపెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నావు. పేదలకు అన్నం పెడితే సహించలేక అన్నక్యాంటీన్లను తొలగించేశావ్. అప్పట్లో రూ.50ఉండే మద్యం క్వార్టర్.. రూ.200 చేసేశావు. నాసిరకం మద్యం విక్రయిస్తూ పేదల రక్తం తాగుతున్న నువ్వు పేదల ప్రతినిధివి ఎలాఅవుతావ్? మేం ఉచితం ఇసుకను ఇస్తే.. ఇప్పుడు మంత్రులు, మీ పార్టీ నాయకులు పంచుకుంటున్నారు. దొంగలని ఎవరిని అనాలి? చెత్తపైనా పన్నువేసి చెత్త ముఖ్యమంత్రి అనిపించుకున్నావు. ప్రతి కుటుంబంపై రూ.8లక్షల చొప్పున పరోక్షంగా భారం మోపావు. నీవాడే నాటకాల ముందర అప్పట్లో సురభి నాటకాలవారు కూడా పనికిరారు. ఉత్తరాంధ్రపై జగన్‌కు ఏవిధమైన ప్రేమా లేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని కొనసాగిస్తే గోదావరి, వంశధార నదుల అనుసంధానంతో నీటి ఎద్దడి ఉండేదికాదు. ఈ పథకం కోసం నేను రూ.2వేల కోట్లు కేటాయిస్తే.. జగన్ కేవలం రూ.5కోట్లు ఖర్చు చేశాడు. ఉత్తరాంధ్రలో ఒక్కో జిల్లాకు రూ.1.5కోట్లు మాత్రమే ఇచ్చాడు. తారకరామతీర్థసాగర్‌కు మేం రూ.284 కోట్లు కేటాయిస్తే... జగన్ రూ.54 కోట్లు ఖర్చు చేశాడు అంతే. తోటపల్లి ప్రాజెక్టు కోసం రూ.237 కోట్లు మేం విడుదల చేస్తే జగన్ కేవలం రూ.61 కోట్లు ఇచ్చాడు. వంశధార ఫేజ్ 2 కోసం మేం రూ.460 కోట్లు కేటాయిస్తే.. ఆయన విడుదల చేసింది జీరో. వంశధార-నాగావళి నదుల అనుసంధానం కోసం మేం రూ.145 కోట్లు కేటాయిస్తే.. ఈయన పైసా ఇవ్వలేదు. ఇటువంటి వ్యక్తులు ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తారా? టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తాం.

వైసీపీకి అభ్యర్థుల్లేరు..

వైసీపీ తరఫున పోటీకి అభ్యర్థులు కూడా లేరాయె! మొన్నటివరకు ఒక్కో లిస్టు రిలీజ్ చేసేసి సిద్ధం అన్నాడు. ఇప్పుడు మాట మార్చి ఆ లిస్టుల్లోని వారు కేవలం నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు అని, అభ్యర్థులు కారని చెబుతున్నారు. నేను అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ పారదర్శకంగా ఉన్నా. శ్రీకాకుళం జిల్లా టీడీపీకి కంచుకోట. మళ్లీ మమ్మల్ని ఆదరించేందుకు జిల్లా ప్రజ సిద్ధంగా ఉన్నారు. వైసీపీ సభలో నాది, పవన్ ఫొటోలతో కటౌట్లు పెట్టించి వాటిపై దాడులు చేయించారు. మానసిక రోగులే ఇలాంటి పనులు చేస్తారు. మా సభలో జగన్ బొమ్మ పెట్టించి కొట్టించలేమా? అది సభ్యత కాదు. జగన్‌రెడ్డీ.. మీరు చొక్కా మడతపెడితే మా తమ్ముళ్లు కుర్చీలు మడతపెడతారు. నీకు కుర్చీ లేకుండా చేస్తారు. మిడిసిపడితే బట్టలు విప్పించి తరిమి కొట్టే ధైర్యం మా తమ్ముళ్లకు ఉంది. ఆడబిడ్డలు వీర వనితలుగా పసుపు జెండా పట్టుకుని ఝాన్సీ లక్ష్మీబాయి, రాణీ రుద్రమదేవిలా తయారవ్వాలి. అప్పుడే రాష్ట్రాన్ని, పిల్లల భవిష్యత్‌ను కాపాడుకోగలం. జగన్‌రెడ్డి పంచభూతాలు, రాష్ట్రాన్ని మింగేసిన అక్రమార్కుడు. ఈ కలియుగ భస్మాసురుడిని వదిలించుకోవడానికి మా ఆడబిడ్డలు సిద్ధంగా ఉన్నారు. సిగ్గు లేకుండా మీరే స్టార్ క్యాంపెయినర్లంటూ వలంటీర్లను బతిమాలుకుంటున్నాడు.

ఆ సుబ్బారెడ్డిని అరెస్టు చేసి ఉంటే

ఎవడో సుబ్బారెడ్డి అనేవాడు కడప నుంచి వచ్చి ఇక్కడి భూములను కొట్టేస్తాడని.. నేను కొట్టలేకపోతున్నానని రెవెన్యూ మంత్రి అధర్మాన బాధపడుతున్నాడు. ఆ సుబ్బారెడ్డిని అరెస్టు చేసి శ్రీకాకుళం జైలులో పెట్టి ఉంటే శభాష్ అనేవాడిని. కానీ అలా చేయడు ఈ అధర్మాన. బందిపోటు దొంగలు జగన్ రెడ్డి గ్యాంగ్. ఎక్కడ భూములుంటే.. ఎక్కడ గనులుంటే అక్కడ వాళ్లు వాలిపోతారు. వాళ్లను చూస్తే స్పీకర్, మంత్రులు వణికిపోతున్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తానన్న జగన్.. గంజాయికి, నేరాలకు రాజధానిగా మార్చేశాడు. ఇక్కడున్న భూములు, వ్యాపారాలు, ఖనిజ సంపద మీద తప్ప ఉత్తరాంధ్రపై ఆయనకు ప్రేమే లేదు. విశాఖలో రూ.40 వేల కోట్ల భూములను కొట్టేశారు. రివర్స్ పాలనతో నిరుద్యోగం పెరిగిపోయింది. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే భోగాపురం విమానాశ్రయం, భావనపాడు పోర్టు పూర్తయ్యేవి. భావనపాడుకు రెండోసారి శంకుస్థాపన చేసి మూలపాడు అని పేరు మార్చాడు. విశాఖ నుంచి లులూ వంటి కంపెనీలు, మెట్రో పారిపోయాయి. రైల్వే జోన్‌కు భూములు ఇవ్వలేదు. నేను శంకుస్థాపన చేసిన ట్రైబల్ యూనివర్శిటీని పూర్తి చేయలేకపోయారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయారు.

శ్రీకాకుళాన్ని దోచేస్తున్న వైసీపీ ఎమ్మెల్యేలు

మంత్రి ధర్మాన ప్రసాదరావు.. శ్రీకాకుళాన్ని ప్రసాదంలా ఆరగిస్తున్నాడు. విశాఖ భూకుంభకోణంలో ఆయన సూత్రధారని అప్పుడే సిట్ స్పష్టంగాచెప్పింది. ఇప్పుడు ఇసుక ర్యాంప్ వ్యవహారాలను కొడుకు చేతిలో పెట్టి ఆర్జిస్తున్నాడు. సావిత్రిపురంలో 67 ఎకరాల్లో భారీ లే అవుట్లు వేశాడు. అందులో 23 ఎకరాలు ప్రభుత్వ భూములే. సెంటు పట్టాల్లో కూడా అవినీతికి పాల్పడ్డాడు. ప్రభుత్వ భూమిని బినామీ పేర్లమీద రాయించుకుని తిరిగి ఆ భూమినే ప్రభుత్వానికి అప్పగించి కోట్లు కాజేశాడు. అరాచకానికి కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. అచ్చెన్నాయుడిని ఓడిస్తానని పగటి కలలు కంటున్నాడు. ప్రజల ఖర్మకొద్దీ తమ్మినేని సీతారాం ఆమదాలవలసలో గెలిచి స్పీకర్ అయ్యాడు. ఈయనకు సిగ్గు లేదు. అక్రమార్జన కోసం జనంపైకి కొడుకును, భార్యను వదిలాడు. మంత్రి అప్పలరాజు తప్పులరాజు. మరోసారి గెలిస్తే పలాసలో కొండలే ఉండవు. పాతపట్నం నియోజకవర్గానికి పట్టిన అశాంతి అక్కడి ఎమ్మెల్యే రెడ్డి శాంతి. వసూళ్ల బాధ్యతలు పీఏలకు అప్పగించేశారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్.. జగన్‌కు భజన దాసు. నియోజకవర్గాన్ని కుటుంబానికి పంచాడు. ప్రైవేటు కాలేజీని బలవంతంగా ఖాళీ చేయించి కబ్జాచేశాడు. తోటాడలో స్టోన్ క్రషర్ పేరుతో 10 ఎకరాల భూమిని కొట్టేశాడు.

లోకం తీరు



స్కిల్ కేసులో బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

- ఆయన కుటుంబ సభ్యులు అధికారులను బెదిరిస్తున్నారు: రోహత్గీ
- రికార్డులో లేని విషయాలు వినం.. ఇవి చాలా పెద్ద ఆరోపణలు: జస్టిస్ త్రివేది
- విచారణ మూడు వారాలకు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసు సోమవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో దర్యాప్తు అధికారులను చంద్రబాబు కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. రికార్డుల్లో లేని విషయాలను తాము వినబోమని జస్టిస్ త్రివేది అన్నారు. చాలా పెద్ద ఆరోపణలు చేస్తున్నారని, కేసులో దర్యాప్తు అధికారులు ఎవరైనా తమను చంద్రబాబు కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నట్లు 164 స్టేట్‌మెంట్ ఇస్తే అప్పుడు ఆలోచిస్తామని తెలిపారు. ఇదే సమయంలో.. హైకోర్టు రికార్డులో లేని విషయాలను రోహత్గీ కొత్తగా ప్రస్తావిస్తున్నారని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే.. తాము అదనపు పిటిషన్ దాఖలు చేశామని రోహత్గీ ధర్మాసనానికి తెలియజేశారు. ఆ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు తమకు కొంత సమయం కావాలని సిద్ధార్థ లూథ్రా, మరో సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు. అఫిడవిట్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది.



చేతిలో గడ్డపారతో వీరంగం వేస్తున్న వెంకటయ్య

మాజీ మంత్రి సోమిరెడ్డిపై హత్యాయత్నం

- దాడికి యత్నించిన వైసీపీ సానుభూతిపరుడు
- అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు, తోపులాట
- 11 మంది టీడీపీ కార్యకర్తలపై 'రివర్స్' కేసు..!

నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కట్టువపల్లిలో సోమవారం సాయంత్రం వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య గడ్డపారతో సోమిరెడ్డిపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వెంకటయ్యను అడ్డుకున్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం కట్టువపల్లిలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమిరెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రే స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య ఫ్లెక్సీలను చించి చెరువులో పడేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సోమవారం ఉదయం మరోమారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా మళ్లీ వాటినీ చించేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో సోమిరెడ్డి కట్టువపల్లికి చేరుకోగా మద్యం మత్తులో ఉన్న వెంకటయ్య వీరంగం సృష్టించాడు. అసలు మా గ్రామానికి టీడీపీ వాళ్లు ఎందుకొస్తున్నారు..? అంటూ కేకలు వేశాడు. బాణాసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తను కొట్టాడు. సోమిరెడ్డి గుడిలో పూజలు నిర్వహించి బయటకు వస్తుండగా వెంకటయ్య గడ్డపారను తిప్పుతూ వీరంగం సృష్టించాడు. సోమిరెడ్డిపైకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని వెంకటయ్యకు దేహశుద్ధి చేశారు. సోమిరెడ్డి జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు. అయితే ఈ కార్యక్రమం ముగిశాక వైసీపీ నాయకులు వెంకటయ్య చేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 11 మంది టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు(సెక్షన్ 307) నమోదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం దీనిని బయటకు చెప్పడం లేదు. వెంకటయ్యపై పలు కేసులు ఉన్నట్లు తెలిసింది. కాగా టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారన్న విషయం తెలుసుకున్న సోమిరెడ్డితో పాటు భారీగా టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి మనుబోలు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. వెంకటయ్యపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు ముక్కలాట బ్యాచ్ పనులు: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోవడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సోమవారం ఎక్స్ వేదికగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'అబ్బాయ్ ప్రారంభించిన బస్ బే గాలికి ఎగిరిపోయింది. బాబాయ్ రిబ్బన్ కట్ చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలలకు కొట్టుకుపోయింది. మూడు ముక్కలాట బ్యాచ్ పనులన్నీ ఇంతే!' అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

వసంతకు మైలవరం టికెట్!

- దేవినేని ఉమాకు మరోచోట అవకాశం
- పరిశీలిస్తున్న టీడీపీ అధినాయకత్వం
- మరికొన్ని స్థానాల్లోనూ కీలక మార్పులు?

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఎన్టీఆర్ జిల్లా మైలవరం టీడీపీ టికెట్ ఖరారైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇన్‌చార్జిగా ఉన్న నేపథ్యంలో ఈ స్థానం ఎవరికి దక్కుతుందోనని ఆ పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సర్వేలను బేరీజు వేసుకొన్న టీడీపీ నాయకత్వం వసంత వైపు మొగ్గు చూపినట్లు చెబుతున్నారు. నియోజకవర్గంలో పని చేసుకోవచ్చని అధిష్ఠానం తనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వసంత సోమవారం ఆ నియోజకవర్గ నేతలకు తెలిపారు. ఆదివారం సాయంత్రం చంద్రబాబును దేవినేని ఉమ కలిసి మాట్లాడిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకొంది. దేవినేనికి మరో చోట అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది. పెనమలూరులో ముస్లిం మైనారిటీలు గణనీయ సంఖ్యలో ఉన్నారన్న అంచనాతో మైనారిటీ నేత ఎంఎస్ బేగ్ పేరును పరిశీలనలోకి తీసుకొన్నారు. దేవినేని... బేగ్‌ల్లో ఒకరికి ఇక్కడ అవకాశం రావచ్చని తెలుస్తోంది.

నర్సరావుపేట నుంచి యరపతినేని?

పల్నాడు జిల్లా గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరుతో నర్సారావుపేట అసెంబ్లీ స్థానంలో టీడీపీ సోమవారం ఫోన్ సర్వే నిర్వహించింది. వైసీపీ నుంచి టీడీపీలోకి రాబోతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్ పేరుతో గురజాలలో సర్వే నిర్వహించారు. యరపతినేనిని నర్సరావుపేటకు మార్చి జంగాను గురజాలలో నిలిపితే ఇద్దరికీ విజయావకాశాలు బాగుంటాయని కొందరు నేతలు ప్రతిపాదించారు. దీంతో ఈ ప్రతిపాదనపై పార్టీ అధినాయకత్వం సర్వే చేయిస్తోంది. ప్రకాశం జిల్లాలో దర్శి, గిద్దలూరు సీట్లకు సంబంధించి పొత్తు వ్యవహారం కొలిక్కి రాలేదు.

చంద్రబాబుకు బీకే వినతిపత్రం

అనంతపురం నేత బీకే పార్థసారథి సోమవారం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. పెనుకొండలో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. అదే జిల్లాకు చెందిన మాజీమంత్రి నిమ్మల కిష్టప్ప తనకు పుట్టపర్తి టికెట్ ఇవ్వాలని కోరారు.

1 మైనారిటీ నేత ఎండీ నజీర్ విశాఖ ఉత్తరం సీటు కోసం చంద్రబాబును అభ్యర్థించారు. అన్నమయ్య జిల్లా టీడీపీ నేతలు విశ్వనాథ నాయుడు, చెంగల్రాయుడు, తిరుపతి నగర నేత కోడూరి బాలసుబ్రహ్మణ్యం కలసికట్టుగా చంద్రబాబును కలిశారు. విశ్వనాథ నాయుడు సూచించిన అభ్యర్థికి కోడూరు టికెట్ ఇవ్వాలని కోరారు.

1 రాజమహేంద్రవరం, ఏలూరు ఎంపీ సీట్లలో ఒక చోట పోటీ చేయడానికి ఆసక్తితో ఉన్నానని మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు తెలిపారు.

రెండ్రోజుల్లో టీడీపీలో చేరతా: వసంత



నందిగామ, ఫిబ్రవరి 26: అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన సీఎం జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని, ఈ రాష్ట్రానికి చంద్రబాబు పాలన ఎంతో అవసరమని మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెండు రోజుల్లో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తాను టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. మూడు రాజధానుల విషయంలో అభ్యంతరం చెప్పానని, కానీ సంఖ్యా బలం ఉండటంతో ఏమీ చేయలేక పోయానని అన్నారు. చంద్రబాబును, ఆయన కుటుంబాన్ని దూషించిన వారికే వైసీపీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. తనకు సీటు ఇస్తామని చెప్పిన జగన్... చంద్రబాబు కుటుంబాన్ని దూషించాలని ఒత్తిడి చేశారని, కానీ తన నైజం అది కాదన్నారు. జగన్‌కు లోకేశ్‌కు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. దేవినేని ఉమాతో తనకు వ్యక్తిగత విభేదాలు లేవని, గతంలో ఇద్దరం వేర్వేరు దారుల్లో ఉన్నామని, ఇప్పుడు ఒకే దారిలో నడవాల్సి ఉన్నందున టీడీపీ పెద్దల సమక్షంలో ఆయన్ను కలుస్తానని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్ కోసం అందరూ కలసికట్టుగా పని చేస్తామని పేర్కొన్నారు.



కెరటాల తాకిడికి ముక్కలైన బ్రిడ్జి

అలల కల.. చెల్లాచెదురు..!

- 24 గంటల్లోనే విశాఖ ఆర్కే బీచ్‌లో ముక్కలైన ఫ్లోటింగ్ బ్రిడ్జి

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభించిన 24 గంటలకే రెండు ముక్కలైంది. పర్యాటకులకు అందుబాటులోకి రాకముందే సముద్రంలో చెల్లాచెదురైంది. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద ఈ ప్రాజెక్టును చేపట్టింది. కోటి రూపాయల అంచనాతో పనులు ప్రారంభించిన సదరు సంస్థ రూ.1.6 కోట్లు ఖర్చు అయ్యిందని తాజాగా ప్రకటించింది. దీన్ని వైసీపీ నాయకులు ఆదివారం ఉదయం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... పర్యాటక అభివృద్ధి కోసమే దీన్ని ఏర్పాటుచేశామని, ఇది తప్పకుండా ప్రజాదరణ పొందుతుందని చెప్పారు. సోమవారం నుంచి పర్యాటకులను కూడా అనుమతిస్తామని కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున ప్రకటించారు. అయితే పర్యాటకులను అనుమతించక ముందే సోమవారం ఆ వంతెన 'టి జంక్షన్ వ్యూ పాయింట్' దూరంగా కొట్టుకుపోయింది. ఆ సమయంలో దానిపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆది నుంచీ అనుమానాలే..!

ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని మొదట తెన్నేటి పార్కు వద్ద ఏర్పాటుచేయాలని పనులు చేపట్టారు. ఆ ప్రాంతం అటవీ శాఖది కావడంతో వారు భూమి ఇవ్వడానికి నిరాకరించారు. అనుమతులు లేకుండా ఎలా ఇస్తామని వ్యతిరేకించారు. దాంతో రాత్రికి రాత్రి ఆ ప్లాస్టిక్ బ్లాకులను వ్యాన్లలోకి ఎత్తి ఆర్కే బీచ్‌కు తరలించారు. అక్కడ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటుచేయాలని పనులు ప్రారంభించారు. అయితే ఆ ప్రాంతంలో సముద్రం బాగా లోతుగా ఉంటుంది. రాళ్లు కూడా ఎక్కువ. అలలు బలంగా తీరాన్ని తాకుతాయి. తరచూ తీరం కోతకు గురవుతుంది. అనేకసార్లు కురుసుర సబ్‌మెరైన్ ప్రహరీ కూడా కోతకు గురై కూలిపోయింది. ఆ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగాయని, అక్కడ ఎవరూ ఈతకు దిగకూడదని మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటుచేసింది. ఇన్ని ప్రతికూలతలున్న చోట పర్యాటక ప్రాజెక్టు పెట్టడం సరికాదంటూ 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 7న 'అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి సురక్షితమేనా..?' శీర్షికతో కథనం ప్రచురించింది. అయితే అధికారులు లోపాలను సరిదిద్దుకోకుండా ఎక్కడో ఓ చోట ప్రాజెక్టును ప్రారంభించేయాలనే ఆత్రుతతో వారి చర్యలను సమర్థించుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన విభాగం ఉత్తర దిశలో ఏర్పాటు చేయాల్సిందిగా సూచించిందని, అందుకే అక్కడ పెడుతున్నామని వివరణ ఇచ్చుకున్నారు. ఈ వంతెన ఏర్పాటుకు వీఎంఆర్‌డీఏ అధికారులు పర్యాటక శాఖ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదు.

ఎగిరి పడుతున్న వంతెన

అలల వంతెనను వైసీపీ నాయకులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. అప్పుడే బలమైన అలలు తీరాన్ని తాకాయి. ఆ ధాటికి వంతెన పైపైకి ఎగిరి పడింది. దాని తీరే అంత అనుకున్నారు కానీ ప్రమాదకరమని, అంత పైకి లేవకూడదని గుర్తించలేదు. ప్రమాదం జరిగితే కాపాడేందుకు గజ ఈతగాళ్లను కూడా ముందు జాగ్రత్తగా ఏర్పాటుచేశారు. అయితే అలల ఉధృతిని తట్టుకోలేక 'టి' ఆకారంలోని వంతెన విడిపోయి దూరంగా కొట్టుకుపోయింది. ఇంత ప్రమాదకరమైన దానిపైకి పర్యాటకులను అనుమతిస్తే వారి ప్రాణాలతో చెలగాటమాడినట్టు కాదా..? అని నగర ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పౌర్ణమి కారణంగా అలలు పెద్దఎత్తున వస్తున్నాయని, సాధారణ రోజుల్లో అలా ఉండదని కొందరు అధికారులు వాదిస్తున్నారు. కాగా, అలల వంతెన విడిపోలేదని, కొట్టుకుపోలేదని.. మాక్ డ్రిల్‌లో భాగంగా సిబ్బందే దాన్ని దూరంగా తీసుకువెళ్లి లంగరు వేశారని వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దక్షిణ కోస్తా, సీమల్లో 9 సీట్లు!

- కృష్ణా, గుంటూరు, ప్రకాశంలో జనసేనకు రెండేసి.. రాయలసీమలో 3 స్థానాలు
- కృష్ణాలో విజయవాడ వెస్ట్, అవనిగడ్డ
- గుంటూరు పశ్చిమ లేదా తూర్పు
- ప్రకాశంలో దర్శి ఖరారు.. రెండోది గిద్దలూరు లేదా చీరాల
- చిత్తూరులో తిరుపతి, మదనపల్లె, శ్రీకాళహస్తిల్లో రెండు దక్కే చాన్స్
- ధర్మవరం కోసం పవన్ గట్టి యత్నాలు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీతో పొత్తులో భాగంగా జనసేన పోటీ చేసే స్థానాలపై గట్టి కసరత్తే నడుస్తోంది. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో దాదాపు 15 స్థానాల నుంచి ఆ పార్టీ పోటీ చేయనుండగా.. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తొమ్మిది స్థానాల్లో మాత్రమే బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో రెండు స్థానాలు జనసేనకు దక్కే అవకాశముంది. విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ కావాలని ఆ పార్టీ కోరుతోంది. విజయవాడ పశ్చిమ, గతంలో ప్రజారాజ్యం గెలిచిన విషయాన్ని జనసేన నేతలు గుర్తుచేస్తున్నారు. ఇక్కడ ముస్లిం సామాజిక వర్గం అధికంగా ఉంటుంది. ఆ వర్గానికి చెందిన వ్యక్తిని పోటీకి దించితే గెలుపు అవకాశం ఎక్కువని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇక అవనిగడ్డలో కాపు సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నాయి. అక్కడైతే గెలుపు అవకాశాలు అధికంగా ఉంటాయని జనసేన నాయకులు భావిస్తున్నారు. కానీ అక్కడ టీడీపీ తరఫున బలమైన అభ్యర్థిగా మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ ఉన్నారు. గుంటూరు జిల్లా విషయానికి వస్తే తెనాలి నుంచి పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ బరిలోకి దిగుతున్నారు. గుంటూరు ఈస్ట్, వెస్ట్ సీట్లలో ఒకటి ఇవ్వాలని జనసేన కోరుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో మూడు స్థానాలపై దృష్టి పెట్టింది. కనీసం రెండైనా ఇవ్వాలని అడుగుతోంది. దర్శి సీటు దాదాపు జనసేనకు ఖరారు అయింది. అక్కడనుంచి గరికపాటి వెంకట్‌ను బరిలోకి దించేం దుకు సిద్ధమైంది. ఇప్పటికే ఆయన క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. రెండో సీటుగా గిద్దలూరు లేదా చీరాల అడుగుతోంది. గిద్దలూరులో కాపు ఓటింగ్ శాతం ఎక్కువే అయినా.. ఈ సీటు తీసుకుంటే మాత్రం ముస్లిం అభ్యర్థికి కేటాయించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చీరాల దక్కితే మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములును అభ్యర్థిగా ఖరారుచేసే అవకాశాలున్నా యి. జనసేన రాయలసీమలో ఆరు స్థానాలపై దృష్టి పెట్టింది. ఇందులో మూడు దక్కే వీలుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో తిరుపతి, మదనపల్లె, శ్రీకాళహస్తి సీట్లను జనసేన కోరుతోంది. ఇందులో రెండైనా దక్కుతాయని భావిస్తోంది. తిరుపతి దాదాపు ఖరారైనట్లేనని అంటున్నారు. ఇక్కడ అభ్యర్థిత్వం కోసం కిరణ్ రాయల్, హరిప్రసాద్‌తో పాటు మరికొంత మంది పోటీ పడుతున్నారు. అనంతపురం జిలా ధర్మవరం సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. జనసేన రాయలసీమ ఇన్‌చార్జి చిలకం మధుసూదన్‌రెడ్డి తొలి నుంచీ ఈ నియోజకవర్గంపై దృష్టిపెట్టారు. సీమలో ఆ పార్టీకి రెడ్డి సామాజికవర్గం నుంచి ఉన్న బలమైన నేత ఈయనే. అందుకే పవన్ గట్టిగా పట్టుబడుతున్నారు. ఇదే సమయంలో బీజేపీ కూడా పొత్తులో ఆ సీటు కోరే అవకాశం ఉంది. అనంతపురం టౌన్ సీటు జనసేనకు ఇవ్వడం దాదాపు ఖాయమైందని అంటున్నారు. పుట్టపర్తి సీటు కూడా అడుగుతున్నట్లు తెలిసింది, కడప జిల్లాలో రాజంపేట లేదా బద్వేల్ నుంచి ఆ పార్టీ బరిలోకి దిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.


అనుచరులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

చంద్రబాబుకు రామబంటును

- 'పశ్చిమ' టికెట్ ఆశిస్తున్నా.. డిమాండ్ చేయను.. అభ్యర్థనే: బుద్దా వెంకన్న
- అనుచరులతో ఆత్మీయ సమావేశం

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 26: చంద్రబాబు తనకు దైవసమానమని, ఆయన పాదాలను రక్తంతో కడగడానికైనా తాను సిద్ధమని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అనుచరుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం గవర్నరుపేటలోని బసవపున్నయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబును టికెట్ కోసం అభ్యర్థించాలే కానీ, డిమాండ్ చేయకూడదని తన అనుచరులకు సూచించారు. చంద్రబాబుకు తాను రామబంటునన్నారు. కేశినేని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీలా తాను నీచ రాజకీయాలు చేయనని చెప్పారు. చంద్రబాబు కటౌట్ కాళ్లకు రక్తాభిషేకం చేశానని, తన కష్టాన్ని గుర్తించి టికెట్ ఇవ్వాలని కోరారు. చంద్రబాబును సీఎం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. తాను విజయవాడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటే తనపైనే కేశినేని నాని ఫిర్యాదు చేశాడని, వైసీపీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు రాజీపడి కోవర్టుగా ఉన్నాడని ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గంలో కేశినేని నాని ఆట కట్టిస్తానన్నారు. తనను మెచ్చుకుంటూ చంద్రబాబు ఇచ్చిన ప్రశంసలు అపూర్వమని, అదే తనకు వెయ్యికోట్ల ఆస్తి అని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

దేవుడు అన్యాయాన్ని ఓడిస్తాడు



- బ్రదర్ అనిల్ ఆసక్తికర వ్యాఖ్యలు

సత్యవేడు, ఫిబ్రవరి 26: దేవుడు న్యాయమే చేస్తాడు.. అన్యాయాన్ని ఓడిస్తాడని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భర్త, క్రైస్తవ మత బోధకుడు బ్రదర్ అనిల్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సత్యవేడులోని ఓ కళ్యాణ మండపంలో సోమవారం క్రైస్తవ సువార్త ప్రకటన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను మీడియా పలకరించింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మీ స్పందన ఏమిటని ప్రశ్నించింది. దానికి అనిల్.. తాను ఇక్కడికి క్రైస్తవ మత బోధ చేసేందుకు మాత్రమే వచ్చానంటూనే.. "దేవుడు ఉన్నాడు. దేవుడు న్యాయమే చేస్తాడు. అన్యాయాన్ని మాత్రం ఓడగొడతాడు" అని వ్యాఖ్యానించారు. షర్మిల అరెస్టుపై వివరణ కోరేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా.. తానేమీ మాట్లాడనంటూ కారెక్కి వెళ్లిపోయారు.

నేడు బీజేపీ ఎన్నికల శంఖారావం

- బూత్ స్థాయి సభ్యులతో ఏలూరులో భారీ సభ
- హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఏలూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బూత్ స్థాయి కమిటీలతో బీజేపీ అగ్రనాయకత్వం మంగళవారం భేటీ కానుంది. ఎన్నికల సమయత్తంలో భాగంగా ఏలూరులో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు రాష్ట్రస్థాయి ముఖ్య నేతలు హాజరవుతారు. ప్రత్యేకించి వచ్చే ఎన్నికల్లో పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు ఏ రూపంలో వ్యవహరించాలో దిశ నిర్దేశం చేయడమే ఈ సభ లక్ష్యం. ఏలూరు పార్లమెంట్‌తో సహా నరసాపురం, అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం నియోజకవర్గాల నుంచి బూత్ కమిటీ సభ్యులు హాజరవుతారు. ఏలూరు నగరంలోని ఇండోర్ స్టేడియంలో సాయంత్రం జరిగే ఈ సభకు మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ ఎంపీలు సుజనా చౌదరి, సీఎం రమేశ్ హాజరు కానున్నారు.

వైసీపీ కార్యకర్తల్లా పోలీసులు: బీజేవైఎం వంశీ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా పని చేస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ ఆరోపించారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలతో 'సవాల్' అంటూ ఫ్లెక్సీ వేసినా జగన్ ప్రభుత్వం భరించలేక పోతోందని మండిపడ్డారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో వంశీ మాట్లాడారు. 'పోలీసుల్ని అడ్డుపెట్టుకుని వైసీపీ మాపై దాడులకు పాల్పడితే పారిపోయేందుకు సిద్ధంగా లేము. నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించిన ఎయిమ్స్‌కు వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇచ్చినట్లు నిరూపించినా మేం లక్ష ఇచ్చేందుకు సిద్ధం. మేం పెట్టిన ఫ్లెక్సీలో ఏమైనా తప్పుంటే నిరూపించాలి. పోలవరం నిధులపైనా త్వరలో ఫ్లెక్సీలు పెడతాం. రాష్ట్ర ప్రజలు చెల్లించిన పన్నులు, ఆస్తుల్ని తాకట్టు పెట్టి తెస్తున్న డబ్బులు పంచుతూ జగన్‌రెడ్డి పేరు పెట్టుకోవడం సిగ్గుచేటు' అని వంశీ అన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జిలో అవినీతి: లంకా దినకర్

వైసీపీ నేతల అవినీతి వల్లే విశాఖపట్నం బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోయిందని బీజేపీ నాయకుడు లంకా దినకర్ ఆరోపించారు. అంత చిన్న నిర్మాణం సరిగా చేయలేని జగన్ రెడ్డికి రాజధాని నిర్మించే సత్తా ఉందంటే ప్రజలు నమ్ముతారా అని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొట్టుకు పోతుందనడానికి ఫ్లోటింగ్ బ్రిడ్జి ఘటన ముందస్తు సంకేతమని దినకర్ అభివర్ణించారు.

మతోన్మాద పార్టీని ఓడించడానికే కాంగ్రెస్‌తో పొత్తు

- మోదీ మూడోసారి పీఎం అయితే ప్రజాస్వామ్యం ఉండదు
- రాష్ట్రానికి దద్దమ్మ సీఎం జగన్ అవసరమా..?: రామకృష్ణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 26: మతోన్మాద బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తామన్నారు. అనంతపురం వచ్చిన ఆయన సోమవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'మోదీ ఫెయిల్యూర్ ప్రధాని. ఉద్యోగాలు ఇవ్వలేదు, ధరలు తగ్గించలేదు, రైతుల ఆదాయం రెట్టింపు చేసిన దాఖలాల్లేవు. రైతు సమస్యలు పరిష్కరించడం అటుంచితే... ఢిల్లీలో ఏకంగా ఇటీవల కాల్పులు జరిపి ఒక యువ రైతును బలి తీసుకున్నారు. రైతులను ఢిల్లీకి రానివ్వకుండా అణచి వేస్తున్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు. సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తున్నారు. 2024లో మళ్లీ ప్రధానిగా మోదీ పదవి చేపడితే... దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ఉండవు. రాజ్యాంగాన్ని సైతం మూలన పెట్టేస్తారు. సీఎం జగన్ ప్రధానికి దాసోహం అయ్యాడు. ఆయనో చేతకాని దద్దమ్మ. 2019లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇవ్వండనీ, ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్.. ఈ ఐదేళ్లలో ఏనాడైనా మాట్లాడాడా..! జగన్‌కు ఒక్కసారి సీఎంగా చాన్స్ ఇచ్చిందుకు నాశనం చేశాడు. రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడు. ఏపీ ప్రజలు ఆలోచించాలి' అని రామకృష్ణ సూచించారు.

బీజేపీ, వైసీపీలకు పాలించే అర్హత లేదు: సీపీఎం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీకి అధికారంలో ఉండే అర్హత లేదని సీపీఎం పేర్కొంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించింది. బడ్జెట్‌లో వైద్య రంగానికి కనీసం 18 శాతం నిధులు కేటాయించలేదంటే వైద్యంపై పాలక పార్టీలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని పేర్కొంది. ఎన్నికల ముందు జనాన్ని ప్రలోభ పెట్టేందుకే ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా ఎయిమ్స్‌ను ప్రారంభించారు. ఇదివరకే ప్రారంభించిన ఎయిమ్స్‌ను తిరిగి ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించింది. ఢిల్లీ రైతు ఉద్యమం నేపథ్యంలో అన్నదాతల కోసం పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది.

వారంరోజుల్లోగా ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

- యానాం మాజీమంత్రి కృష్ణారావు అల్టిమేటం జారీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26: మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వారంరోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఫిషర్‌మెన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యానాం మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం జారీ చేశారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్ హాల్‌లో సోమవారం ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ నెల 17న మాజీ ఎమ్మెల్యే కొండబాబును విమర్శిస్తూ మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు. అప్పటినుంచి మత్స్యకారులు పలు విధాలుగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ద్వారంపూడి వైఖరిలో మార్పు రాలేదన్నారు.

ఒక నిర్లక్ష్యం.. 3 టైరు పంక్చర్లు!

- 10 మంది ప్రాణాలు తీసిన రోడ్డు ప్రమాదాలు
- 34 మందికి గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వాహనాల టైర్లు పంక్చర్లు కావడం.. డ్రైవర్ల నిర్లక్ష్యం పది నిండు ప్రాణాలను బలిగొన్నాయి. మరో 34 మందిని ఆస్పత్రి పాల్జేశాయి. రాష్ట్రంలో సోమవారం 4 ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కాకినాడ జిల్లాలో పంక్చర్లు వేసుకుంటున్న లారీ డ్రైవర్ల పైనుంచి ఆర్టీసీ బస్సు దూసుకుపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటక రాష్ట్రంలో బొలేరో వాహనం టైరు పేలిపోయి అదుపుతప్పడంతో కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు రైతులు చనిపోయారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో బొలెరో వాహనం టైర్ పంక్చరై బోల్తా పడటంతో 30 మంది కూలీలు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా బండపల్లిలో లారీని బైక్ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు.

లారీకి పంక్చర్ వేస్తుండగా...

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని 16వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఒడిసా నుంచి బాపట్ల వెళ్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో.. స్థానిక పాదాలమ్మ గుడి వద్ద రెండు లారీలను రోడ్డు పక్కన ఆపేసి.. డ్రైవర్లు పంచర్లు వేస్తున్నారు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో టైర్ పంక్చర్ పనులు చేసుకుంటున్న ముగ్గురు డ్రైవర్ల పైనుంచి దూసుకువెళ్లింది. అదే సమయంలో పాదాలమ్మ గుడి సేవకుడు బహిర్భూమికి వెళ్తుండగా అతడిని కూడా బస్సు ఢీకొట్టింది. సంఘటనా స్థలం వద్దే నలుగురూ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన తర్వాత డ్రైవర్ బస్సును ఆపకుండా రాజమహేంద్రవరం వెళ్లిపోయాడు. చనిపోయిన ముగ్గురు డ్రైవర్లు బాపట్ల జిల్లా బల్లికురవు మండలం నక్కబొక్కలపాడులోని రామాంజనేయపురానికి చెందిన దాసరి కిశోర్(50), దాసరి ప్రసాద్(40), బండి నాగయ్య(26) కాగా, మరొకరు పాదాలమ్మ గుడి సేవకుడు దిమిలి లోవరాజు(29). సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు కారణమైన రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోకు చెందిన పిల్లా శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

టైరు పేలి..

అనంతపురం జిల్లా ఉరవకొండలోని గుంతకల్లు రోడ్డులో కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పంక్చరై బోల్తా పడింది. అందులోని 30 మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వజ్రకరూరుకి చెందిన 45 మంది కూలీలు పాల్తూరులో మిరప పంట కోత పనులకు ఈ వాహనంలో బయలుదేరారు. వాహనం ఉరవకొండ సమీపానికి రాగానే టైర్ పంక్చరై, అదుపు తప్పి, పల్టీకొట్టింది. డ్రైవర్ వన్నూరు స్వామితోపాటు 30 మందికి గాయాలయ్యాయి. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.


అన్నమయ్య జిల్లా బండపల్లి వద్ద ప్రమాదస్థలంలో కృష్ణబాబు మృతదేహం

జ్వరంతో ఉన్న పాపను ఆస్పత్రికి తీసుకెళ్తూ..

జ్వరంతో ఉన్న పాపను ఆస్పత్రికి తీసుకెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో ఆమెతోపాటు ముగ్గురు చనిపోయిన ఘటన అన్నమయ్య జిల్లా రామాపురం మండలం బండపల్లి పంచాయతీలో జరిగింది. రామాపురం మండలం సరస్వతిపల్లెకు చెందిన డేగల లక్ష్మీభవాని(25) జ్వరంతో ఉన్న తన కుమార్తె వినీత(5)ను తీసుకుని.. తన బావ కుమారుడైన కృష్ణబాబు(21) బైక్‌పై రాయచోటి బయలుదేరారు. బండపల్లె పంచాయతీలో వీరి ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా కుడివైపు నుంచి ఎడమపక్కకు రావడంతో బైక్ వేగంగా వెళ్లి లారీ వెనుక వైపున ఢీకొంది. బైక్ లారీ లోపలికి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారు ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు.

మిర్చి పంట అమ్మేందుకు వెళుతూ..

కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు రైతులు దుర్మరణం పాలయ్యారు. కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలంలోని నాగలాపురం, సింగరాజనహళ్లి గ్రామాలకు చెందిన పది మంది రైతులు మిరప పంటను విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రంలోని దావణగేరికి బయల్దేరారు. రైతులు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం టైరు పంక్చర్ కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైతులు బోయ యంకన్న(48), మస్తాన్(48), ఆటో ఈరన్న (35)లు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు దావణగేరి ప్రభుత్వాసుపత్రికి తరలించిన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లవద్ద బ్రీత్ ఎనలైజర్ పెట్టండి

- మద్యం తాగినోళ్లు ఓటు వేయకుండా చూడండి
- జనవాహిని పార్టీ కార్యదర్శి హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌ల వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు సోమవారం హైకోర్టును అభ్యర్థించారు. ఈ పిల్‌ను విజయవాడకు చెందిన జనవాహిని పార్టీ కార్యదర్శి ఎం శివరామ సుందర్ దాఖ లు చేశారు. ఆయన తరపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ.. 'ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16ని అనుసరించి మద్యం సేవించినవారు ఓటు హక్కును వినియోగించుకోకుండా నిరోధించాలి. అందుకోసం పోలింగ్ బూత్‌ల వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలి' అని కోరారు. ఈ దశలో ధర్మాసనం కలగజేసుకుంటూ మద్యం సేవించినవారు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16 పరిధిలోకి ఎలా వస్తారని ప్రశ్నించింది. 18 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తున్నారని గుర్తు చేసింది. 18 నుంచి 21 ఏళ్ల మధ్యవారికి మద్యం అమ్మకంపై నిషేధం ఉందని, ఈ నేపథ్యంలో పిటిషనర్ అభ్యర్థన ఎలా సమర్థనీయమని ప్రశ్నించింది. న్యాయవాది బదులిస్తూ.. "ఒక పరిధిదాటి మద్యం సేవించినవారు 'అన్ సౌండ్ మైండ్' నిర్వచనం పరిధిలోకి వస్తారు. మోటార్ వెహికల్ చట్టంలో మద్యం సేవించి వాహనం నడపడంపై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో మద్యం సేవించినవారికి రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అర్హత ఉండదు" అని వివరించారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం పిల్‌పై బుధవారం విచారణ జరుపుతామని పేర్కొంది. అయితే పోలింగ్ బూత్‌ల వద్ద బ్రీత్ ఎనలైజర్ల ఏర్పాటుకి, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16 ఎలా వర్తిస్తుందనే విషయంపై తమను సంతృప్తి పరచాలని స్పష్టం చేసింది.

సాధారణ డీఎస్సీలో 'షెడ్యూల్డ్' టీచర్ పోస్టులా?

- సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్
- ఆ పోస్టుల భర్తీపై బైలాస్, రూల్స్ మా ముందుంచండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ రేపటికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గిరిజన యువతతో భర్తీ చేయాల్సిన షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని టీచర్ పోస్టులను సాధారణ డీఎస్సీలో చేర్చి నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి బైలాస్‌తో పాటు రిక్రూట్‌మెంట్ రూల్స్‌ను కోర్టు ముందు ఉంచాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఆదేశాలిచ్చారు. గిరిజన యువతతో భర్తీ చేయాల్సిన 517 టీచర్ పోస్టులను జనరల్ కేటగిరీలో చేర్చి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి.విజయ్‌కుమార్‌తో పాటు మరో 9మంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో టీచర్ పోస్టులను సాధారణ డీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి వీల్లేదన్నారు. పోస్టుల భర్తీ కోసం స్వయంప్రతిపత్తి కలిగిన సొసైటీ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా బైలాస్ రూపొందించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. టీచర్ పోస్టుల భర్తీ అధికారం ఐటీడీఏ పీవోకి మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజన గురుకులాలు, ఇతర పాఠశాలలోని టీచర్ పోస్టులను చేర్చిందన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వందలాది గిరిజన అభ్యర్థులు నష్టపోతారన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వం భర్తీ చేస్తున్న టీచర్ పోస్టులు జోనల్ పోస్టులని అన్నారు. జిల్లా పోస్టులు మాత్రమే ఐటీడీఏ పీవో భర్తీ చేయగలరన్నారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి బైలాస్‌తో పాటు రిక్రూట్‌మెంట్ రూల్స్‌ను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

నేటి నుంచి 'టెట్'.. 120 కేంద్రాల్లో పరీక్ష

- 2.6 లక్షల మంది దరఖాస్తు.. ఏర్పాట్లు పూర్తి: విద్యాశాఖ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ రోజు నుంచి మార్చి 6 వరకు తొమ్మిది రోజుల పాటు టెట్ పరీక్షలు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2,67,559 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరి కోసం 120 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. మంగళవారం నుంచి మార్చి 1 వరకు పేపర్-1ఏ, 2 నుంచి 4, 6వ తేదీన పేపర్-2ఏ, 5న ఉదయం, మధ్యాహ్నం పేపర్-1బీ, 2బీ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల పరిశీలనకు 26 మంది సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి 300 మంది అభ్యర్థులకు ఒక అధికారిని నియమించామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఒడిశాల్లోనూ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు స్క్రైబ్‌ను ఇవ్వడంతో పాటు, 50 నిమిషాల అదనపు సమయం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లలో పొరపాట్లు ఉంటే పరీక్షా కేంద్రాల వద్ద సరి చేసుకోవచ్చునని తెలిపారు.

ఎడ్‌సెట్ తుదిదశ కౌన్సెలింగ్‌కు షెడ్యూలు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎడ్‌సెట్ తుది దశ కౌన్సెలింగ్‌ను ప్రారంభించినట్లు ఉన్నత విద్యామండలి సోమారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 2 నుంచి 5 వరకు ఆప్షన్ల ఎంపికకు గడువు ఉంటుందని పేర్కొంది. వచ్చే నెల 9న సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించింది. 11 నుంచి అభ్యర్థులు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది.

9వేల మంది టీటీడీ సిబ్బందికి జీతాల పెంపు

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- అందరూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, కార్పొరేషన్ ఉద్యోగులే



తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ విభాగాల్లో అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, హైలీ స్కిల్డ్ కేటగిరీల్లో పనిచేస్తున్న కార్పొరేషన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 9వేల మందికి వేతనాలు పెంచేందుకు బోర్డు నిర్ణయం తీసుకుందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. నిర్ణయాలను ఈవో ధర్మారెడ్డితో కలిసి చైర్మన్ మీడియాకు వెల్లడించారు. అలిపిరి నడకమార్గంలోని గాలిగోపురం, ఏడో మైలు, మోకాళ్లమిట్ట వద్ద నిత్య సంకీర్తనార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే తాళ్లపాకలో కూడా నిత్య సంకీర్తనార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేశామన్నారు. అలాగే లడ్డూప్రసాదాల తయారీకి పోటులో అదనంగా మరో 15 మంది పోటు సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి, మంగళసూత్రాలు, లక్ష్మీకాసులు 4, 5, 10 గ్రాముల్లో ఏడు డిజైన్లలో తయారు చేసేందుకు.., రూ.4 కోట్లతో నాలుగు ప్రముఖ బంగారు ఆభరణాల తయారీ సంస్థలకు అనుమతి మంజూరుకు ఆమోదించినట్టు తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో రూ.3.89 కోట్లతో లైటింగ్ ఏర్పాటు, బాలబాలికల్లో ధార్మిక, నైతిక విలువలు పెంచడంలో భాగంగా సులభశైలిలో రూపొందించిన భగవద్గీతను తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో 98లక్షల కాపీలు ముద్రించేందుకు రూ.3.72కోట్లు మంజూరుకు, మరికొన్ని తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి చేసి... 100 తులాల బంగారం దోచుకెళ్లారు

- పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 26 : పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలో ఆరుగురు దుండగులు ఓ ఇంటిలోకి ప్రవేశించి.. భార్యాభర్తలపై దాడి చేసి వంద తులాల బంగారం.. రూ.50 వేల నగదును దోచుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు... సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే రైస్ మిల్లు యజమాని కిమిడి శ్రీరామ్మూర్తి, రత్నం దంపతులు నివసిస్తున్నారు. వారి ఇద్దరు కుమారులు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. డబ్బు, నగలు ఎక్కడ ఉన్నాయని దంపతులను అడిగి తాళ్లతో కట్టి హింసించారు. పిడిగుద్దులతో దాడి చేసి చేశారు. తాళాలు స్వాధీనం చేసుకుని సుమారు 100 తులాల బంగారం, రూ. 50 వేలు నగదును దోచుకెళ్లారు. ఇంటి బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు హార్డ్ డిస్కులను తొలగించి తీసుకువెళ్లారన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ముగింపులేని యుద్ధం!

తూర్పు ఉక్రెయిన్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన అవ్‌దివ్‌కా నగరం రష్యా సైన్యాల వశమైన తరుణంలో ఉభయ దేశాల మధ్య యుద్ధం మూడోఏడాదిలోకి ప్రవేశించింది. ఈ నగరాన్ని, సమీపంలోని కొన్ని ప్రాంతాలను రష్యా కైవసం చేసుకుంటున్న తీరు గమనించినప్పుడు యుద్ధం గతంలో కంటే ఈ ఏడాది మరింత తీవ్రంకాబోతున్నదన్న సంగతి అర్థమవుతుంది. అవ్‌దివ్‌కా కోసం జరిగిన పోరాటం గత రెండేళ్ళకాలంలోనే అత్యంత తీవ్రమైనది. గత ఏడాది మే నెలలో బహమూత్ స్వాధీనాన్ని అనేక కారణాలరీత్యా దీనితో సరిపోలుస్తున్నారు. సరిపడా ఆయుధాలు లేక ఉక్రెయిన్ ఈ నగరాన్ని వదులుకొని దాని సైన్యం పారిపోవాల్సివచ్చింది. మొత్తం సోవియట్–అఫ్ఘాన్ యుద్ధంలో పాతికవేలమంది సైనికులు మరణిస్తే, కేవలం ఈ నగరం కోసం రష్యా యాభైవేలమంది సైనికులను బలిపెట్టిందని పాశ్చాత్య మీడియా అంటోంది. ఈ నగరం కోసం మూడువందల యుద్ధట్యాంకులు, పదహారువేలమంది సైనికులను రష్యా కోల్పోయిందని రిపోర్టు చేసిన ఒక మిలటరీ బ్లాగర్ ఆ తరువాత ఎందుచేతనో ఆత్మహత్యచేసుకున్నాడు.

వచ్చే ఏడాది చివరికల్లా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కొలిక్కివస్తుందని కొందరు ఆశపడుతున్నారు. కానీ, విజేతలంటూ ఉండని ఎడతెరిపిలేని యుద్ధంగా ఇది మిగిలిపోవచ్చు. అవ్‌దివ్‌కా మాదిరిగా మరో నాలుగైదు కీలకమైన, బలమైన నగరాల స్వాధీనం దిశగా రష్యా ఇప్పుడు వ్యూహాలు రచిస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాలు ఉక్రెయిన్‌ను ఆర్థికంగానూ, ఆయుధపరంగానూ నిలబెట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. మొదటి ఏడాది మిగతా ప్రపంచం కాస్తోకూస్తో స్పందించింది కానీ, ఇప్పుడు ఈ యుద్ధాన్ని స్మరించడమే మానేసింది. ఉక్రెయిన్ ఎంత నాశనమైపోయినా పాశ్చాత్యదేశాలకు పోయిందేమీ లేదు. ఆయుధాలు అమ్ముకోవడానికి, రష్యామీద కక్ష తీర్చుకోవడానికి, పునర్నిర్మాణం పేరుతో రేపు అపార వనరులున్న ఉక్రెయిన్‌ను దోచుకోవడానికి ఈ యుద్ధం ఎంతకాలం సాగినా వాటికి మంచిదే.

రెండేళ్ళ యుద్ధంలో రెండు లక్షలమంది మరణించారు, పదిహేను లక్షలమంది శరణార్థులుగా తరలిపోయారు. డబ్బున్నదేశాలకు నొప్పితెలియలేదు కానీ, ఆహారధరలు పెరిగి, ఆర్థికవ్యవస్థలకు దెబ్బతగిలి వర్ధమానదేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రపంచవాణిజ్యం దెబ్బతిన్నది, ఇంధనధరలు పెరగడంతో ఆహారకొరత ఏర్పడింది. ఐక్యరాజ్యసమితి అధినేత ఎప్పటిలాగానే మరోమారు భద్రతామండలి సమావేశంలో పెద్దదేశాలకు ఏవో హితవులు చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధపర్యవసానాలను ప్రపంచమంతా అనుభవిస్తున్నదని, శాంతియుత పరిష్కారం దిశగా ప్రయత్నాలు ఆరంభించమని అన్నారు. ఆ చెవితో విని ఈ చెవితో వాటిని వదిలేసిన పాశ్చాత్యదేశాలు యుద్ధానికి రెండేళ్ళు ముగియడం, పుతిన్ వ్యతిరేకి అలెక్సీ నావెల్నీ జైలుహత్య సందర్భాలను కలిపి ఒకేమారు ఏకంగా ఆరువందల రకాల ఆంక్షలతో రష్యామీద కక్షతీర్చుకోవడానికి సిద్ధపడ్డాయి.

అమెరికా సాయం లేకపోతే ఉక్రెయిన్ కదనరంగంలో ఇంతకాలం నిలువగలిగేది కాదు. యుద్ధం ఆరంభమైన కొత్తలో రాజధాని కీవ్ మూడురోజుల్లోనే రష్యా చేతిలోకి వస్తుందని అంతా అనుకున్నారు. మొదట్లో రష్యా అతివేగంగా అనేక ప్రాంతాలను స్వాధీనంచేసుకున్నప్పటికీ, ఆ తరువాత ఉక్రెయిన్ ప్రతిఘటనతో కొన్నింటిని తిరిగికోల్పోవలసి వచ్చింది. వేలాదిమంది సైనికులను బలిపెడుతూ, ప్రత్యేక సైనిక నియామకాలు చేపడుతూ రష్యా ఈ యుద్ధాన్ని కొనసాగిస్తోంది. అసమ్మతిని అణచివేయడానికి, మరోమారు అధ్యక్షుడు కావడానికి పుతిన్‌కు ఈ యుద్ధం ఉపకరిస్తుంది. ముడిచమురు అమ్మకాలు రికార్డుస్థాయిలో ఉంటూ ఈ యుద్ధం రష్యాను ఆర్థికంగా మరింత బలోపేతం చేసింది కనుక దానిని ఎంతకాలమైనా కొనసాగించగలిగేంత బలంగా పుతిన్ ఉన్నారు. ఉక్రెయిన్‌కే తన భవిష్యత్తు అర్థంకావడం లేదు. తూర్పున ఉక్రెయిన్ దెబ్బతినడానికి తాము సకాలంలో సాయం చేయకపోవడమే కారణమని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అంగీకరిస్తూ, రిపబ్లికన్లనూ, కాంగ్రెస్‌ను తప్పుబడుతున్నారు. 'ఆయుధాల కృత్రిమ కొరత' అని ఆడిపోసుకుంటూ మరిన్ని ఆయుధాలకోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికాకు విజ్ఞప్తులు చేస్తున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించడానికి సిద్ధమే కానీ, మాకు మేముగా ఆ చొరవ తీసుకోబోమని భారత్ ప్రకటించిన నేపథ్యంలో, ఆ రకమైన ప్రతిపాదనలు, ప్రయత్నాలు కూడా ఎటునుంచీ లేనందున ఈ యుద్ధం మరికొన్ని ఏళ్ళపాటు ఇలా వార్షికోత్సవాలు జరుపుకుంటూనే ఉండవచ్చు.

గ్లోబల్ లీడర్స్‌లో అగ్రగామి

ప్రపంచంలో నరేంద్రమోదీకి మించిన జనాదరణ గల అంతర్జాతీయ నేత మరెవరూ లేరని అమెరికాకు చెందిన గ్లోబల్ డిసిషన్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ మార్నింగ్ కన్సల్ట్ మరోసారి ప్రకటించడం ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ విషయం. ప్రతి రెండు నెలలకూ సర్వే జరిపే ఈ సంస్థ నరేంద్రమోదీకి 78 శాతం ఆమోద యోగ్యత ఉన్నదని వెల్లడించింది. మోదీకి దరిదాపుల్లో మరే దేశ నేత కనపడకపోగా, మెక్సికో, అర్జెంటీనా అధ్యక్షుల జనాదరణ 65 శాతంలోపే ఉన్నది. మోదీకి జనాదరణ గల అంతర్జాతీయ నేతల్లో ప్రథమ స్థానం దక్కగా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 11వ స్థానంలోనూ, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో 17వ స్థానంలోనూ, బ్రిటన్ ప్రధాని రిషీ సునక్ 20వ స్థానంలోనూ ఉన్నారు. రెండు నెలల క్రితం ఈ ఏజెన్సీ సర్వే జరిపినప్పుడు కూడా మోదీ 76 శాతం ఆధిక్యతతో అగ్రస్థానం సాధించారు. ఏ ప్రాతిపదికన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ ఈ ఫలితాలు ప్రకటిస్తోంది? ఆధునిక దేశాల్లో నేతలు వివేకవంతంగా, వేగంగా, మెరుగైన విధంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రాతిపదికగా ఈ సంస్థ నేతల పనితీరును బేరీజు వేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి ఆధునిక కొలమానాలు, హై ఫ్రీక్వెన్సీ డాటాను జోడించి ఏ దేశ నాయకుడు మెరుగైన, వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని అక్కడి ప్రజలు భావిస్తున్నారో సమాచారం సేకరిస్తుంది.



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

దేశ అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం విషయంలో మోదీలా త్వరితగతిన వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నేత ఎవరూ లేరని చెప్పేందుకు గత ఆరునెలలుగా రూ. లక్షల కోట్ల మేరకు మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్న తీరే నిదర్శనం. సోమవారం ఒక్క రోజే ఆయన దేశంలో రూ. 41వేల కోట్ల విలువైన 2వేల రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అంతకు ఒక్క రోజు ముందు వైద్య, రహదారి, రైల్వే, ఇంధన, పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక రంగాలకు చెందిన రూ 48,100 కోట్ల మేరకు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేశారు. ఇందులో మంగళగిరిలో ఎయిమ్స్‌తో పాటు అయిదు ఎయిమ్స్‌లు ఉన్నాయి. విశాఖపట్టణంలో ఐఐఎం, తిరుపతిలో ఐఐటి, కర్నూల్‌లో ట్రిపుల్ ఐటీ కూడా మోదీ ప్రారంభించిన ఉన్నత విద్యాసంస్థల్లో ఉన్నాయి. అదే రోజు ద్వారకలో ఆయన రూ. 4150 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. దేశంలో అతి పొడవైన ద్వారకా సేతును ప్రారంభించడమే కాక, సముద్రంలో మునిగిపోయిన పురాతన ద్వారకా నగరిని సందర్శించేందుకు సముద్ర గర్భంలో మునిగి పూజలు జరపడం మోదీ సాహసానికి, భక్తి శ్రద్ధలకు నిదర్శనం. 73 సంవత్సరాల వయస్సులో ఆయన స్కూబా డైవింగ్ చేసి సముద్ర గర్భానికి చేరుకుని సుదీర్ఘ సమయం గడపడం చిన్న విషయం కాదు. 'నేను పురాతన ద్వారకా నగరిని సందర్శిస్తున్నప్పుడు నా కళ్ల ముందు 21వ శతాబ్దపు భవ్యభారతం కనపడింది. భారతదేశాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయాలనే నా సంకల్పం మరింత బలపడింది..' అని మోదీ అన్నారు. అలాంటి సంకల్పం ఉన్నందువల్లే ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా భారతీయులే కాదు, పలు దేశాధినేతలు మోదీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజనీతిజ్ఞత, దౌత్య ప్రజ్ఞ భారతీయతను ప్రపంచ వ్యాప్తంగా బలోపేతం చేశాయి. మన విశిష్ట అస్తిత్వాన్ని సమస్త దేశాలు గ్రహించక తప్పని పరిస్థితి కల్పించిన కారణంగానే ప్రపంచ నాయకులలో మోదీకి అగ్ర స్థానం లభిస్తోంది. అమెరికాకు చెందిన 'గ్లోబల్ డెసిషన్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ' ఇదే వాస్తవాన్ని మరోసారి ధ్రువీకరించింది.

మోదీ అడిగితే చాలు ప్రపంచంలో ఏ దేశాధినేతా కాదనలేడని చెప్పేందుకు అబూదాబీలో భారతీయుల కోసం మందిరం నిర్మించేందుకు ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ అల్ నహ్యాన్ అంగీకరించడం నిదర్శనం. 2010లో మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లినప్పుడు అక్కడి భారతీయులకు ఆలయం నిర్మించాలనుకుంటున్నట్లు అభ్యర్థించినప్పుడు అందుకు తమ అధ్యక్షుడు ఆమోద ముద్ర వేసేందుకు కేవలం అయిదు నిమిషాలు పట్టిందని ఆ దేశ దౌత్య సలహాదారు మహమ్మద్ గర్గాష్ ఇటీవల వెల్లడించారు. మోదీ అడగ్గానే ఒక భవ్య హిందూ మందిర నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యేందుకు ఈ నిర్ణయం దోహదం చేసిందని ఆయన చెప్పారు. అబుదాబీలో 27 ఎకరాల స్థలంలో స్వామి నారాయణ్ సంస్థ నిర్మించిన అక్షరధామ్ మందిరం మధ్య ప్రాచ్యంలోనే అతి పెద్ద మందిరం. అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభించిన నెల రోజుల్లోపే పది రోజుల క్రితం మోదీ ఈ మందిరాన్ని ప్రారంభించారు. మోదీ హయాంలో గతంలో ఎన్నడూ లేనంతగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కూ, భారత దేశానికీ మధ్య వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు బలపడ్డాయని, స్వేచ్ఛా వర్తక ఒప్పందంపై సంతకాలు జరిగాయని మహమ్మద్ గర్గాష్ చెప్పారు.

మార్నింగ్ కన్సల్ట్ వంటి అమెరికన్ సంస్థ మాత్రమే కాదు, చైనాలో ప్రభుత్వ నియంత్రణలో ఉన్న గ్లోబల్ టైమ్స్ కూడా తాజాగా మోదీ హయాంలో భారత్ ఆర్థిక వ్యూహాలు, దౌత్యపరమైన విజయాలను ప్రశంసించింది. 'భారత్ నేరేటివ్' అన్న శీర్షికతో ప్రచురించిన విశ్లేషణలో ప్రపంచంలో ఒక బలమైన శక్తిగా రూపొందే క్రమంలో మోదీ విదేశాంగ విధానాన్ని రూపొందించారని తెలిపింది. బలమైన ఆర్థిక విస్తరణ, పట్టణ పాలనలో భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ సంబంధాల్లో గుణాత్మకమైన మార్పు వల్ల మోదీ హయాంలో భారత్ అనేక విజయాలు సాధించిందని షాంఘైలోని ఫుడాన్ యూనివర్సిటీలో సౌత్ ఆసియన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ఝాంగ్ జియాడాంగ్ ఈ విశ్లేషణ చేశారు. రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణ సమయంలో సంయమనంగా వ్యవహరిస్తూనే అమెరికా, జపాన్, రష్యా వంటి గ్లోబల్ శక్తులతో బలమైన సంబంధాలు ఏర్పర్చుకోవడం మోదీ బహుముఖ వైఖరికి నిదర్శమని ఆయన అన్నారు.

ప్రపంచంలో భౌగోళిక రాజకీయాల సంక్లిష్టతలను మోదీ అర్థం చేసుకున్నట్లుగా మరే నేత అర్థం చేసుకోలేదు. ప్రపంచంలో అన్ని దేశాలు ఒకదానితో మరొకటికి సంబంధాలు ఏర్పర్చుకోవాల్సిన అవసరాన్ని మాత్రమే కాదు, ఒకదానిపై మరొకటి ఆధారపడక తప్పదని గ్రహించిన నేత మోదీ. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆయన ఒక ఆచరణీయ దృక్పథాన్ని అవలంబించారు. అందువల్ల అమెరికాతో పాటు అనేక అగ్రరాజ్యాలతో ఆయన లోతైన సంబంధాలు ఏర్పర్చుకోగలిగారు.

ప్రపంచ దేశాలు మాత్రమే కాదు, భారతీయుల్లో అత్యధిక శాతం మోదీ విదేశాంగ విధానాన్ని శ్లాఘిస్తున్నారని అబ్జర్వర్ రీసర్చ్ ఫౌండేషన్ తాజాగా నిర్వహించిన సర్వే తెలిపింది. అమెరికాతో పాటు గ్లోబల్ శక్తులతో మోదీ ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పిన తీరును 81 శాతం మంది ప్రశంసించారు. అమెరికా, రష్యా ఆస్ట్రేలియా, జపాన్‌తో సంబంధాలే రానున్న దశాబ్దంలో మనను బలోపేతంగా మారుస్తాయని వారు భావించారు. క్వాడ్‌లో చేరడం భారత ప్రయోజనాలకు ముఖ్యమని వారు అంగీకరించారు. జీ–20 దేశాల నిర్వహణ, ఆఫ్రికన్ యూనియన్‌ను భాగస్వామ్యం చేయడం, ఖతార్ మన దేశ నేవీ మాజీ అధికారులను బేషరతుగా విడుదల చేయడం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సంబంధాలు బలపడడం, బ్రిక్స్, షాంఘై కార్పొరేషన్‌లో బలమైన పాత్ర పోషించడం వంటి పరిణామాలను భారతీయ యువత గమనిస్తున్నారు. ప్రపంచంలో మోదీ ఏ దేశానికి వెళ్లినా వేల సంఖ్యలో భారతీయులు ఆయనను కలుసుకునేందుకు ముందుకు వస్తున్నారు. భారతీయతను ప్రపంచ వ్యాప్తంగా బలోపేతం చేసిన, మన అస్తిత్వాన్ని ప్రపంచం గ్రహించక తప్పని పరిస్థితి కల్పించిన మోదీ వంటి నేత మన దేశంలో ఎవరైనా ఉన్నారా?

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

జగన్‌ను సాగనంపడానికి జనం సిద్ధం!

ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయంగా పేర్కొనే ఎమర్జెన్సీ నాటి కాలంలో కూడా ఇంతటి దారుణ సంఘటనలు జరగలేదు. ప్రెస్ సెన్సార్‌షిప్ విధించి వార్తల్ని తొక్కి పెట్టారే తప్ప పత్రికా కార్యాలయాలపై దాడులు చేయలేదు. మీడియా ప్రతినిధుల్ని చావబాదలేదు. ఇపుడు జగన్మోహన్ రెడ్డి పాలనలోని ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీని మించిన ఉన్మాదాన్ని చూసి దేశం యావత్తూ విస్తుపోతూంది.

చాలాకాలంగా తెలుగుదేశం నేతలు రాష్ట్రంలో అమలు జరుగుతున్నది రాజారెడ్డి రాజ్యాంగమేగానీ అంబేద్కర్ రాజ్యాంగం కాదని ఆరోపిస్తున్నారు. ఎందుకంటే, ఒకప్పుడు రాజారెడ్డి రాజ్యాంగం కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనే అమలయ్యేది. కానీ, నేడు ఘనతకెక్కిన జగన్‌రెడ్డి పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతోంది. 'తండ్రిని మించిన కొడుకు' అనేది పాత సామెత. తాతను మించిన మనుమడు అని నేడు చెప్పుకోవాలేమో జరుగుతున్న ఘోరాల్ని చూసినపుడు.

జగన్‌రెడ్డి పాలనలోని లోపాల్ని ప్రశ్నించే వారెవరికీ మినహాయింపులు లేవు. వారు దళితులా, బీసీలా, మైనార్టీలా, మేధావులా, మీడియానా, ప్రతిపక్షనేతలా.. అన్న పట్టింపులు వైసీపీ ప్రభుత్వానికి లేవు. ప్రజాస్వామ్య విలువలు లేని వ్యక్తిని అధికారంలో కూర్చోబెడితే అన్ని వ్యవస్థలు విధ్వంసం అవుతాయని, అన్ని స్థాయిలలో వికృత సంస్కృతి విలయ తాండవం చేస్తుందని ఒకప్పటి అమెరికా అధ్యక్షుడైన ఉడ్రో విల్సన్ 'ఏ స్టడీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్' గ్రంథంలో పేర్కొన్నాడు. 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' ఉండే ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార యంత్రాంగం కుప్పకూలిపోయిందంటే అందుకు కారణం ప్రజాస్వామ్య నైతిక విలువల్లేని వారు అధికార పీఠంపై ఉండటమే. ఈ సత్యం గత ఐదేళ్ల ఆంధ్రప్రదేశ్ అనుభవాలను చూస్తే అర్థం అవుతుంది. చాలాకాలంగా, రాష్ట్ర పరిపాలన యావత్తూ ఒకరిద్దరి కనుసన్నల్లోనే సాగిపోతోంది. తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి చట్టబద్ధ పాలనకు చెల్లుచీటి రాసి ప్రశ్నించే గొంతుకల్ని నిర్దాక్షిణ్యంగా నొక్కేస్తున్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణకు కొత్తగా ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి మూడు నెలల అనుభవంలోనే పాలనలో పరిణతి ప్రదర్శిస్తూ గత ప్రభుత్వాలు తెచ్చిన ఉత్తమ విధానాలను, కార్యక్రమాలను కొనసాగిస్తామని పారిశ్రామికవేత్తలకు, ప్రజలకు భరోసా ఇస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే సహేతుకమైన కారణాలు లేకుండా గుడ్డి వ్యతిరేకతతో, నరనరాన జీర్ణించుకుపోయిన పెత్తందారీ మనస్తత్వంతో కూర్చొన్న కొమ్మనే నరికినట్లు ప్రజావేదికను కూల్చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ఆకలి తీర్చిన 'అన్న క్యాంటీన్'లను ఎత్తేశారు. పేదలకు పండుగ సమయాల్లో తెలుగుదేశం ప్రభుత్వం అందించిన సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫా వంటివి రద్దు చేశారు.

ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి చేసిన తీరని ద్రోహాల్లో మొదటిది రాష్ట్రం నుంచి పరిశ్రమల్ని తరిమేయడం. కోరిన ముడుపులు నిరాకరించారన్న కక్షతో లక్షలాదిమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అమర రాజా లిథియం అయాన్ బ్యాటరీస్, లులూ గ్రూప్, బీఆర్ షెట్టి కంపెనీలు, రిలయెన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్, కియా అనుబంధ పరిశ్రమలు, ట్రైటాన్ బ్యాటరీస్, ఒంగోలు ఏపీపీ పేపర్, జాకీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మొదలైన వాటిని రాష్ట్రం నుంచి నిష్క్రమించేలా చేశారు. ఇవన్నీ రావడానికి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేయగా, ఆ కంపెనీలు మొదలైతే ఎక్కడ చంద్రబాబునాయుడికి పేరొస్తుందోననే దుగ్ధతోనే జగన్‌రెడ్డి వాటిని పనిగట్టుకొని వెళ్లగొట్టించాడు. పగ, ప్రతీకారేచ్ఛతో ప్రజల్ని శిక్షించిన పాలకుల్ని గతంలో ఎన్నడైనా ఎవరైనా చూశారా?



విభజన హామీల గురించి కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేక, కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లులకు గంగిరెద్దులా తలూపి బలపర్చినపుడు రాష్ట్రంలో ఉన్నది చేతగాని ప్రభుత్వం అనీ, దానికి కేంద్రాన్ని ఏం అంశంలోనూ గట్టిగా నిలదీసే దమ్ములేదని విశదంగా అర్థమవుతుంది.
వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ఐదేళ్లల్లో ప్రగతి చూపిందల్లా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అరాచకాల్లోనే. అన్ని వ్యవస్థలకు పట్టిన చెదను వదిలించుకోవడానికి ప్రజల వద్దనున్న ఏకైక ఔషధం 'ఓటు'. దానితోనే మళ్లీ ప్రక్షాళన సాధ్యపడుతుంది.

పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణలో వివిధ దేశాలు, దేశంలోని రాష్ట్రాల మధ్య పోటీ ఏర్పడిన నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు ప్రతి ఏటా పెట్టుబడి సదస్సులను ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా లాంటి వెనుకబడిన రాష్ట్రాలు సైతం 'సమ్మిట్'లను నిర్వహిస్తూ రాష్ట్రాలకు పెట్టుబడులు తెచ్చుకొనేందుకు కృషి చేస్తుంటే, మన రాష్ట్రంలో నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకొంటూ కాలక్షేపం చేసినట్లు 'బటన్' నొక్కడంలోనే కాలం గడిపేస్తున్నారు. ఆ బటన్ నొక్కడం ద్వారా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో డబ్బు జమ అవుతున్నదో లేదో ఎవ్వరికీ తెలియదు. బటన్ నొక్కడం ద్వారా అందిస్తున్న డబ్బులో అధిక శాతం అప్పుల ద్వారా సేకరించినదే తప్ప, సంపద సృష్టి ద్వారా సముపార్జించినది కాదన్నది బహిరంగ రహస్యం.

పెట్టుబడులు రావాలంటే రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉండాలి. శాంతిభద్రతలు మెరుగ్గా ఉండాలి. అధికార యంత్రాంగం సహకరించేదిగా ఉండాలి. ఇవి లేని రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే! 2019 ఎన్నికల ముందు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగినపుడు దానికి 'నారాసుర' పాలనే కారణమని చెప్పి ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందారు. కానీ, అధికారంలోకి వచ్చాక వివేకా హత్య కేసులో సూత్రధారులు చట్టానికి చిక్కకుండా దర్యాప్తు సంస్థలకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. వివేకానంద రెడ్డి కుమార్తె సునీతమ్మ చేస్తున్న ఆరోపణలు గమనించిన తర్వాత ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు నేరస్థుల చేతుల్లో ఉన్నాయనే భావన కలిగితే అందుకు ప్రభుత్వమే నిందార్హం. తెలుగు భాషలో బోధన ఉండాలని నొక్కి చెప్పిన పాపానికి తమ పార్టీ పార్లమెంట్ సభ్యుడు రఘురామకృష్ణంరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన సంఘటన, కరోనా మాస్క్ కోరిన దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసిక రోగిగా చిత్రీకరించి హింస పెట్టి చనిపోయేలా చేయడం మొదలుకొని, చంద్రబాబునాయుడిపై ఎర్రగొండపాలెంలో చేసిన రాళ్ల దాడి; తెలుగుదేశం సీనియర్ నేతలైన అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమాలను అక్రమ కేసుల్లో జైళ్లకు పంపడం; సోషల్ మీడియా కార్యకర్త రంగనాయకమ్మ అనే వృద్ధ మహిళను అరెస్ట్ చేయడం వరకు విచ్చలవిడిగా చట్టాన్ని అతిక్రమించిన సంఘటనలు అడుగడుగునా కనపడతాయి. చివరకు అజాత శత్రువుగా అందరి ఆదరాభిమానాల్ని చూరగొనే సీనియర్ లీడర్ అశోక్ గజపతిరాజును సైతం వేధింపులకు గురిచేశారంటే ఈ పాలకులను ఏమనాలి?

మరోపక్క సొంత పార్టీ నేతలు మాఫియాగా మారి రాష్ట్ర వ్యాప్తంగా మైన్లు, ఇసుక, క్వారీల వంటివి కొల్లగొడుతుంటే వారిపై కేసులు ఉండవు. ఆ అక్రమాల్ని బయటపెట్టిన మీడియా ప్రతినిధులపై దౌర్జన్యాలు, దాష్టీకాలు పెరిగిపోయాయి. స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రతి బహిరంగ సభలో దుష్టచతుష్టయం అంటూ కొన్ని మీడియా సంస్థల యజమానులను దుర్భాలషలాడుతూ, చొక్కాలు మడత పెట్టమంటూ కేడర్‌ను రెచ్చగొట్టడాన్ని ఏమనాలి? రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉండాలని ఏ పాలకుడైనా కోరుకుంటాడు. కానీ, ఈ ముఖ్యమంత్రి ఉద్దేశం వేరు. అన్ని వర్గాలను భయభ్రాంతులకు గురిచేయాలి. తన నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించకూడదు. ప్రశ్నిస్తే వారి భరతం పట్టాల్సిందేనన్న లెక్కలో చివరకు న్యాయస్థానలను, న్యాయమూర్తులను వదలిపెట్టలేదు. న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా 'నేను అన్నిటికి అతీతుణ్ణి' అనే విధానంలో ముందుకు సాగడం ఈ ముఖ్యమంత్రి విషయంలోనే చూస్తున్నాం!

రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, ఇతర సాగునీటి ప్రాజెక్టులు పడకేసిన విధానం చూసినపుడు గుండెలు మండిపోతాయి. విభజన హామీల గురించి కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేక, కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లులకు గంగిరెద్దులా తలూపి బలపర్చినపుడు రాష్ట్రంలో ఉన్నది చేతగాని ప్రభుత్వం అనీ, దానికి కేంద్రాన్ని ఏం అంశంలోనూ గట్టిగా నిలదీసే దమ్ములేదని విశదంగా అర్థమవుతుంది.


అమరావతిని శిథిలం చేయడం వల్ల 2 లక్షల కోట్ల సంపద వృథా అయింది. ముఖ్యంగా, రాష్ట్ర ఖజానాకు జమ కావాల్సిన సొమ్ము ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల అధికార నేతలకు హస్తగతమవుతున్నది. మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి లభిస్తున్నది ఆదాయం 50శాతం అయితే మరో 50శాతం ప్రభుత్వ పెద్దల జేబుల్లోకి పోతోంది. ప్రభుత్వ కనుసన్నల్లో జరుగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తామనే సాకుతో 300శాతం మేర భూముల విలువను కృత్రిమంగా పెంచి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. ఈ క్రమంలో కలియుగదైవం వేంకటేశ్వరుడు కొలువై ఉన్న తిరుపతిని కూడా పాలక పార్టీ కబ్జాదారులు వదలకపోవడం కలవరపరుస్తోంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ఐదేళ్లల్లో ప్రగతి చూపిందల్లా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అరాచకాల్లోనే. అన్ని వ్యవస్థలకు పట్టిన చెదను వదిలించుకోవడానికి ప్రజల వద్దనున్న ఏకైక ఔషధం 'ఓటు'. దానితోనే మళ్లీ ప్రక్షాళన సాధ్యపడుతుంది. అందుకు ప్రజలు 'సిద్ధం'గా ఉండాలి.

● సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

బ్రౌన్ స్మృతులకు జీవంపోసిన 'జానమద్ది'

"సొంత లాభం కొంత మానుకు పొరుగువారికి తోడు పడవోయి" అన్న మహాకవి గురజాడ మాటను అక్షరాల పాటించి ఆచరించిన ఆదర్శమూర్తి– జానమద్ది హనుమచ్ఛాస్త్రి. పబ్లిసిటి కోరుకునే వాళ్ళే ఎక్కువవుతున్న రోజుల్లో కడపలో సి.పి బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించే బృహత్ కార్యక్రమాన్ని చేపట్టి, దాన్ని గురించే ఆలోచిస్తూ నిరంతరం శ్రమించిన అరుదైన వ్యక్తి ఆయన.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ మనదేశంలో పుట్టిన ఆంగ్లేయుడు. తెలుగు భాషాభివృద్ధి కోసం తెలుగుని ప్రేమించి, భాషను నేర్చుకుని, తెలుగు తియ్యందనాల కావ్య పరిమళాల్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. తెలుగుభాషా సాహిత్యాల సముద్ధరణకు జీవితాంతం కృషి చేసి అమూల్యమైన వ్రాత ప్రతులు, తాళపత్రాల సేకరణలో, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువుల్ని తయారుచేయటంలో, బ్రౌన్ చేసిన కృషి గురించి ఎంత రాసినా తక్కువే. వేమన పద్యాల్ని వ్యయప్రయాసల కోర్చి తెలుగు, ఇంగ్లీషుల్లో ముద్రించి, భారత–రామాయణ కావ్యాల్ని, ప్రబంధ సాహిత్యాన్ని ఇంకా అనేక శతకాల్ని వెలుగులోకి తెచ్చిన తెలుగు సూర్యుడు బ్రౌన్. తెలుగు వారి కోసం తెలుగును వెలుగులోకి తెచ్చిన అంతటి మహనీయుణ్ణి తెలుగుజాతి మరచిపోయే సందర్భంలో వారి స్మృతుల్ని పునరుజ్జీవింప చేసేందుకు ఒక గ్రంథాలయ ఉద్యమకారుడిగా హనుమచ్ఛాస్త్రి అవిశ్రాంతంగా కృషి సాగించారు.



జానమద్ది హనుమచ్ఛాస్త్రి సి.పి బ్రౌన్ గ్రంథాలయానికి అవసరమైన నిధుల కోసం ఎన్ని ఊర్లు తిరిగారో, ఎందరికి చేతులు జోడించారో గాని, కడపలో మాత్రం ఒక అద్భుత గ్రంథాలయం వెలసింది. చెదలు పట్టిన తాళపత్రాలతో కాలగర్భంలో కలిసిపోయే దశ నుంచి విలువైన పుస్తకాల భాండాగారంగా రూపుదిద్దుకొంది. డాక్టర్ సి. నారాయణరెడ్డి వీరిని బ్రౌన్ శాస్త్రిగా సంబోధించారు.

రాయలసీమలోని అనంతపురం జిల్లా రాయదుర్గంలో 1925 అక్టోబరు 20న జానకమ్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులకు హనుమచ్ఛాస్త్రి జన్మించారు. తన జీవిత కాలంలో బళ్ళారి, అనంతపురం, నెల్లూరు, గుంటూరులతో పాటు కడపలో సెకండరీ గ్రేడ్ టీచరుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి స్కూలు ఇన్‌స్పెక్టరుగా, లెక్చరర్‌గా, సర్వే అధికారిగా దాదాపు నలభై మూడు సంవత్సరాలు ఉద్యోగసేవలు అందించారు. స్కౌట్ మాస్టర్‌గా, జిల్లా క్లబ్ మాస్టర్‌గా, బళ్ళారి జిల్లాలో స్కౌట్ క్యాంపులు నిర్వహించారు. బళ్ళారి పరిసర ప్రాంతాల్లో వయోజన విద్యాకేంద్రాలు నిర్వహించారు.

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు వయోజన విద్యకు గౌరవ డైరెక్టర్‌గా పని చేస్తున్నప్పుడు ఆయన సహచరుడిగా ఉంటూ గాడిచర్ల వారి తెలుగు ఉపన్యాసాలను కన్నడంలోకి అనువదించారు. ఈయన 30కి పైగా పుస్తకాలు, 300 వ్యాసాలు రచించారు. హనుమచ్ఛాస్త్రి చేసిన రచనల్లో మాసీమ కవులు, నాట్య కళా ప్రపూర్ణ బళ్ళారి రాఘవ జీవితచరిత్ర, కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం, కడప సంస్కృతీ దర్శనీయస్థలాలు, దేవుని కడప శ్రీ వేంకటేశ్వర దేవాలయ చరిత్ర, మన దేవతా విశేషాలు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సుప్రసిద్ధుల జీవిత విశేషాలు, డా. బిఆర్ అంబేడ్కర్‌పై మోనోగ్రాఫ్, సి.పి బ్రౌన్ చరిత్ర, తదితర గ్రంథాలు ప్రసిద్ధి పొందాయి. అంతేగాకుండా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు, బాలసాహిత్యం కూడా రాశారు. గణపతి కావ్యాన్ని కన్నడ భాష నుంచి అనువాదం చేశారు. సాహితీ సాంస్కృతిక వికాసానికి జానమద్ది హనుమచ్ఛాస్త్రి గణనీయమైన సేవలు చేశారు.

సుమారు ఇరవై సంవత్సరాలపాటు వీరు వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసిన కాలం కడప జిల్లా రచయితల సంఘానికి స్వర్ణయుగం. దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి వంటి ఎందరో మహాకవులతో కడపలో నాలుగువందలకు పైగా సాహిత్య సమావేశాలను, తొమ్మిది వార్షికోత్సవాలను నిర్వహించటంలో జానమద్ది ప్రధాన భూమిక వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య సంఘ సంస్థల ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. వీరు రాసిన 'బళ్ళారి రాఘవ' అనే రచన 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యభాగమైంది. లోక్ అదాలత్ సభ్యుడిగా, కడప ఆకాశవాణి కేంద్రానికి సలహా సంఘం సభ్యుడిగా వ్యవహరించారు. కడప జిల్లా సాక్షరతా సంఘం ప్రచురించిన 'అక్షరరశ్మి' పత్రికకు సంపాదకత్వం వహించారు.

ఈ సేవలన్నీ ఒక ఎత్తు, సి.పి. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి జరిపిన కృషి ఒక ఎత్తు. అణా పైసా నుంచి అయిదు వేల రూపాయల విలువైన గ్రంథాల్ని సేకరించారు. గ్రంథాలయానికి అవసరమైన నిధుల కోసం ఎన్ని ఊర్లు తిరిగారో, ఎందరికి చేతులు జోడించారో.. గాని కడపలో మాత్రం ఒక అద్భుత గ్రంథాలయం వెలసింది. చెదలు పట్టిన తాళపత్రాలతో కాలగర్భంలో కలిసిపోయే దశ నుంచి విలువైన పుస్తకాల భాండాగారంగా రూపుదిద్దుకొంది. డాక్టర్ సి. నారాయణరెడ్డి వీరిని బ్రౌన్ శాస్త్రిగా సంబోధించారు. తెలుగు విశ్వ విద్యాలయం హనుమచ్ఛాస్త్రికి డాక్టరేట్ ప్రదానం చేసింది. లోక్‌నాయక్ పురస్కారంతో పాటు ఎన్నో సత్కారాలను, బిరుదులను అందుకున్నారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 2014 ఫిబ్రవరి 28న కన్ను మూశారు. 2016లో బ్రౌన్ శాస్త్రీయం పేరుతో స్మారక సంచిక వెలువడింది.

మెకంజీ కైఫీయత్తులతో పాటు అనేక గ్రంథాల ప్రచురించారు. వివిధ విశ్వవిద్యాలయాలకు పరిశోధకులు సమర్పించే సిద్ధాంత గ్రంథాల వందలాది రాతప్రతులను సేకరించి పరిశోధకుల కోసం భద్రపరిచారు. ప్రస్తుతం సిపి బ్రౌన్ గ్రంథాలయం కడప యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధ పరిశోధక కేంద్రంగా మారింది. రాయలసీమలోనే ఒక గొప్ప సాహిత్య సాంస్కృతిక కేంద్రమై వెలుగొందుతోంది. ఎందరో ప్రముఖులు గ్రంథాలయాన్ని సందర్శించి జానమద్ది హనుమచ్ఛాస్త్రి సేవలను కొనియాడుతూ ఉన్నారు.

■ తవ్వా ఓబుల్ రెడ్డి
కథారచయిత

(రేపు జానమద్ది హనుమచ్ఛాస్త్రి వర్ధంతి)

కంటి తుడుపు నోటిఫికేషన్లు సరే, మరి నియామకాలో?

'మాట తప్పం– మడమ తిప్పం' అనేది 2019 ఎన్నికలప్పుడు వైసీపీకి పేటెంట్ నినాదం. చంద్రబాబు నిరుద్యోగ యువతను అస్సలు పట్టించుకోలేదని ధ్వజమెత్తుతూ, తామొస్తే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 2.3లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేస్తానన్నారు. ప్రతి ఏటా జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఆ ఏడాది భర్తీ చేయనున్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల వివరాలను ముందే వెల్లడిస్తామని ప్రకటించారు. అలా ప్రకటించి ఐదేళ్ళు కావొస్తున్నా ఇప్పటికీ ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేకపోయారు.

ఇటీవల దేశంలోని పట్టభద్రుల్లో నిరుద్యోగంపై పీరియాడిక్ లేబర్ ఫోర్సు సర్వే పేరుతో కేంద్రం విడుదల చేసిన రిపోర్టు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని కళ్లముందు ఉంచింది. దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ఏపీలోనే పట్టభద్రుల నిరుద్యోగం అధికమని వెల్లడైంది. జాతీయ సగటు 13.4శాతం కాగా అన్ని రాష్ట్రాల కన్నా ఏపీ 24 శాతం అత్యధిక సగటుతో ముందున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా ఇటీవలే రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలల్లో తగిలిన ఎదురు దెబ్బల నేపథ్యం కారణంగా వైసీపీ ప్రభుత్వానికి తాజాగా జ్ఞానదంతం మొలిచింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పట్టభద్రుల ఎన్నికలను విశ్లేషిస్తూ నిరుద్యోగ వర్గాలను తాము పట్టించుకోకపోవడంతోనే ఇలా జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. సమాజాన్ని, రాజకీయాల్ని సరిగ్గా అర్థం చేసుకోవడంతో పాటు, పదిమందికి చెప్పగల సమర్థులు పట్టభద్రులనే విషయాన్ని తాజాగా గుర్తించిన ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు వారిని ఆ పని చేయకుండా నిలువరించేందుకు ఎత్తుగడలు వేస్తోన్నట్టు కనిపిస్తోంది. ఇంత కాలం ఉద్యోగాల భర్తీ ఊసెత్తని వైసీపీ సర్కారు ఉన్నట్టుండి ఉద్యోగాల భర్తీ పేరుతో జగన్నాటకమే మొదలెట్టింది. సరిగ్గా ఎన్నికలకు మూడు నెలలుండగా ఉద్యోగాల భర్తీకి వరుస నోటిఫికేషన్లు ఇస్తోంది. ఏపీపీఎస్సీ జారీ చేస్తోన్న చాలా నోటిఫికేషన్లలో సర్కారు చిత్తశుద్ధి ఎంతమాత్రమో బయటపడుతూనే ఉంది.

యూనివర్సిటీల్లో కొలువుల జాతర అంటూ అక్టోబరులో 30న భారీ నోటిఫికేషన్ జారీ అయింది. ఉన్నత విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేలా రాష్ట్రంలోని 18 యూనివర్సిటీల్లో ఒకేసారి 3,220 అధ్యాపక నియామకాలు చేపట్టనున్నట్టు అట్టహాసంగా ప్రకటించింది. నవంబరు 20లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చి 30వ తేదీకి స్క్రీనింగ్ పరీక్షలకు అర్హత సాధించిన వారి వివరాలు ప్రకటిస్తామని, డిసెంబరు 7 తర్వాత తుది జాబితా విడుదల చేసి పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు పూర్తి చేసి నియామక పత్రాలు ఇవ్వడమే నన్నట్టు హంగామా చేసింది. కానీ సుమారు 48 వేల మంది నుంచి దరఖాస్తులను స్వీకరించడం తప్ప ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ నోటిఫికేషన్ నిండా లోపాలే. గతంలోని నోటిఫికేషన్‌పై సుప్రీం కోర్టులో కేసు ఉందని, దానిపై వచ్చే తీర్పు ఆధారంగానే నియామకాలు ఉంటాయని ఆ నోటిఫికేషన్లోనే పేర్కొనడంతోనే ఆదిలోనే హంసపాదు అన్నట్టయింది. రోస్టరు పాయింట్లకు సంబంధించి అనేక లొసుగులు వెలుగు చూశాయి. మహిళా రిజర్వేషను కింద వారికి ఏ నెంబరు పోస్టులో స్పష్టం చేయలేదు. దివ్యాంగుల రోస్టరు పాయింట్లను పూర్తిగా విస్మరించింది. ఖాళీల సంఖ్యను తేల్చడానికి రేషనలైజేషన్ పేరుతో తీసుకున్న చర్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇష్టానుసారం డిపార్టుమెంట్లను కుదించడం, కలిపివేయడం, ఒక డిపార్టుమెంటును మరో డిపార్టుమెంటులో కలిపి, మరో వర్సిటీలో వేరు వేరుగానే కొనసాగించడం వంటి వైఫల్యాలు బహిర్గతమయ్యాయి. అత్యంత కీలకమైన ఈడబ్ల్యూఎస్ వివాదం దుమారాన్ని రేపింది. ఈడబ్ల్యూఎస్ కోటా విషయంలో నిబంధనలకు పాతరేసి సొంత నిర్ణయాలు తీసుకున్నట్టు తేలింది. ఇవన్నీ న్యాయస్థానం ముందు తమకు సవాలు కానున్నాయనే విషయం తెలిసి నోటిఫికేషన్ జారీ చేయడంలోనే ఉద్యోగాలను భర్తీ చేయాలనే చిత్తశుద్ధి లేదన్న సంగతి వెల్లడి అవుతున్నది. ఈ అంశాల ఆధారంగా కొందరు అభ్యర్థులు హైకోర్టులో కోర్టుల్లో కేసులు వేశారు. కోర్టు పరిధిలోకి చేరిన ఈ అంశం ఎప్పటికి తేలుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.



ఇదిలా ఉండగానే ఆరు వేలకు పైచిలుకు పోస్టుల భర్తీ అంటూ డీఎస్సీ ప్రకటన వెలువడింది. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం విడుదల చేసిన టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య అతికొద్ది రోజుల వ్యవధి మాత్రమే ఉండటంపై అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ రెండు పరీక్షల మధ్య తగినంత సమయం కోసం హైకోర్టులో పిటిషన్లు పడ్డాయి. ఇదే నోటిఫికేషన్‌లో ఎస్జీటీ టీచర్ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను కూడా అనుమతించడం సుప్రీం కోర్టు నిబంధనలకు వ్యతిరేకం అనే మరో అంశమూ కోర్టుకు చేరింది. దీంతో పది లక్షల మంది డీఎడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారనే వాదన ఉంది. ఈ విషయంలో సుప్రీం తీర్పు స్పష్టంగా ఉన్నా బీఎడ్ అభ్యర్థులను ఎలా అనుమతించారని ప్రశ్నిస్తూ సుప్రీంతీర్పు మీకు వర్తించదా అని ప్రభుత్వాన్ని హైకోర్టు వ్యాఖ్యానించిదానిపై స్టే విధించి 8 వారాలకి వాయిదా వేసింది.

ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ద్వారానో, నిరుద్యోగులపై ఎదురుదాడి చేయడం ద్వారానో ఫలితం ఉండదని గ్రహించిన ప్రభుత్వం వారిలోని ఆగ్రహజ్వాలలను కొంతైనా చల్లార్చాలని భావించి ఉద్యోగాల జాతర పేరుతో నోటిఫికేషన్లు వెలువరిస్తోందనేది సుస్పష్టం. ఇప్పటికే జరిగిన డ్యామేజ్‌ను ఈ కంటి తుడుపు నోటిఫికేషన్లు ఎంత వరకూ కంట్రోల్ చేస్తాయో వేచి చూద్దాం.

○ సీ.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి





కృష్ణయాదవ్‌కు పార్టీ కండువా కప్పుతున్న టీడీపీ అధినేత (ఇన్‌సెట్‌లో) భవకుమార్‌ను ఆహ్వానిస్తున్న లోకేశ్

మచిలీపట్నం నియోజకవర్గంలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన బీసీ నాయకులు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి లోకేశ్ సమక్షంలో మంగళగిరి కేంద్ర కార్యాలయంలో సోమవారం పార్టీలో చేరారు. బందరు నుంచి వెయ్యిమంది వాహనాలతో ర్యాలీగా వెళ్లి చంద్రబాబును కలిశారు. పెనమలూరు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరికి అనుచరులుగా ఉన్న వీరంతా టీడీపీలో చేరడంతో.. యాదవ సామాజికవర్గంలోని అధికశాతం కార్యకర్తలు, నాయకులు వైసీపీని ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది.

బందరు వైసీపీకి బీసీల ఝలక్

చంద్రబాబు సమక్షంలో బీసీ నాయకులు టీడీపీలో చేరిక

- వెయ్యి మందితో మచిలీపట్నం నుంచి మంగళగిరి టీడీపీ కార్యాలయానికి ర్యాలీ
- వారితోపాటే కొలుసు పార్థసారథి, ఎంపీ బాలశౌరి అనుచరులు పయనం
- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, పలు గ్రామాల బీసీలు మూకుమ్మడిగా టీడీపీలోకి...

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్, బందరులోని 40వ డివిజన్ కార్పొరేటర్ నాలి శారద భర్త మాధవ, బందరుకోటకు చెందిన మాజీ కౌన్సిలర్ బొర్రా చిన్న, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలోని, బందరుకోట, నెలకుర్రుగొల్లపాలెం, రుద్రవరంగొల్లపాలెం, మంగినపూడి, పెదపట్నం, తాళ్లపాలెం, పెదయాదర గ్రామాలకు చెందిన యాదవ సామాజిక పెద్దలు, యువకులు మొత్తం వెయ్యిమందికిపైగా భారీ ఊరేగింపుతో మచిలీపట్నం నుంచి మంగళగిరికి తరలివెళ్లారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో పాటు రొండి కృష్ణయాదవ్, నాలి మాధవ, బొర్రా చిన్నా తదితరులకు చంద్రబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడంతో మచిలీపట్నంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

వేధింపుల కారణంగానే..

మచిలీపట్నం నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు 20 వేల మందికిపైగా ఉన్నారు. ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఈ సామాజికవర్గం ఓటర్ల ప్రభావం ఉంటుంది. కొంతకాలంగా యాదవ సామాజిక వర్గంలోని వైసీపీ నాయకులు రొండి కృష్ణయాదవ్, నాలి మాధవ తదితరులను ఎమ్మెల్యే పేర్ని నాని దూరం పెడుతూ వచ్చారు. దీంతో వీరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అనుచరులుగా ఉంటూ వైసీపీలోనే కొనసాగుతూ వచ్చారు. దీంతో రొండి కృష్ణయాదవ్‌పై స్థలం విషయంలో వేరే వ్యక్తులతో స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు పెట్టించారు. ఎంపీ అనుచరుడిగా ఉంటున్నాడని అసూయతో నాలి మాధవను వివిధ రూపాల్లో వేధించారు. దీంతో యాదవ సామాజికవర్గానికి చెందిన పెద్దలంతా ఇటీవల కాలంలో సమావేశం ఏర్పాటు చేసుకుని వైసీపీని వీడాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలిసి యాదవ సామాజికవర్గంలోని పెద్దలతో పార్టీ మారవద్దని ఎమ్మెల్యే పేర్ని నాని రాజీయత్నం చేసినా వారు పార్టీ మారి తీరుతామని చెప్పేశారు. నాలి మాధవ ఇటీవల వైసీపీకి రాజీనామా కూడా చేశారు. నియోజకవర్గం యాదవ సామాజికవర్గంలోని పెద్దలంతా వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. చంద్రబాబును కలిసిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి, మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, బచ్చుల బోసుబాబు ఉన్నారు.



మంగళగిరికి బీసీ నేతల కార్ల ర్యాలీ

ఓటు బ్యాంకుకు బ్రేక్ పడినట్టే..

యాదవ సామాజికవర్గం నాయకుల్లో అధిక శాతం మంది మచిలీపట్నంలో ఇప్పటివరకు వైసీపీకి అనుకూలంగానే ఉన్నారు. 2019లో, అంతకుముందు జరిగిన ఎన్నికల్లో పేర్ని నాని గెలుపుకోసం పనిచేశారు. ఆయన మంత్రి పదవి చేపట్టాక యాదవ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలను అంతగా పట్టించుకోలేదు. వీరి మాటకు విలువ ఇవ్వకపోవడంతో ఈ సామాజికవర్గం నాయకులు ఎంపీ బాలశౌరి పక్షాన చేరి ఆయనకు దగ్గరయ్యారు. ఇటీవల ఎంపీ బాలశౌరిని తమ ప్రాంతానికి భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లి సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ నివాసంలో గతంలో పేర్ని నాని ఎక్కువ సమయం కేటాయించి పార్టీ గెలుపుకోసం వ్యూహరచన చేసేవారు. అంతటి స్నేహం ఉన్నప్పటికీ ఎంపీ బాలశౌరికి అనుకూలంగా ఉంటున్నాడనే కారణంతో రొండి కృష్ణపై కేసు పెట్టించారు. ఎంపీ బాలశౌరి వైసీపీని వీడి జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తుండటంతో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని బీసీ సామాజికవర్గంలోని యాదవుల ఓటుబ్యాంకు టీడీపీ వైపు మరలుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

టీడీపీలోకి పార్థసారథి

బొప్పన భవకుమార్, తుమ్మల చంద్రశేఖర్ కూడా..

» 2న సైకిలెక్కనున్న వసంత కృష్ణప్రసాద్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకొన్నారు. విజయవాడ నగరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి భారీఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లిన నాయకులు ఉండవల్లి చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. పార్థసారథితోపాటు జిల్లాకు చెందిన కొల్లు రవీంద్ర, బోడె ప్రసాద్, కేశినేని చిన్ని తదితర నేతలు తరలి వచ్చారు. మరోవైపు మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మార్చి 2న టీడీపీలో చేరనున్నారు. దేవినేని ఉమాతో తనకు వ్యక్తిగతంగా విభేదాలు లేవని ఆయనతో కలిసి నడిచేందుకు తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు.





గుణదల రైల్వేస్టేషన్‌లో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు

రాయనపాడు, గుణదల రైల్వేస్టేషన్లకు ఆధునిక శోభ

బందరు, గుడివాడ శాటిలైట్ స్టేషన్లకు కూడా..

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో నాలుగు స్టేషన్ల రీ డెవలప్‌మెంట్
- రూ.100 కోట్ల వ్యయంతో అభివృద్ధికి శ్రీకారం
- స్టేషన్ల రీ డెవలప్‌మెంట్ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రాయనపాడు, గుణదల, మచిలీపట్నం, గుడివాడ రైల్వేస్టేషన్లు కొత్త శోభను సంతరించుకోనున్నాయి. ఈ రైల్వేస్టేషన్లు రీ డెవలప్‌మెంట్‌కు ఎంపికయ్యాయి. ఇప్పటికే రాయనపాడు స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా ఎంపిక చేశారు. ఇదే వరుసలో గుణదల స్టేషన్‌ను కూడా శాటిలైట్‌గా ప్రకటించారు. ఈ రెండు శాటిలైట్ స్టేషన్లు కూడా రీ డెవలప్‌మెంట్ జాబితాలో చేరాయి. సోమవారం ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన రీ డెవలప్‌మెంట్ స్టేషన్లలో ఈ రెండు శాటిలైట్ స్టేషన్లు ఉన్నాయి.



రాయనపాడు రైల్వేస్టేషన్ నమూనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రీ డెవలప్ మెంట్‌లో భాగంగా రాయనపాడు, గుణదల రైల్వేస్టేషన్లను అత్యున్నతంగా ఆధునికీకరించబోతున్నారు. వీటికి సంబంధించిన డిజైన్లను రైల్వే అధికారులు సోమవారం విడుదల చేశారు. రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌ను రూ.12.13 కోట్ల వ్యయంతో రీ డెవలప్‌మెంట్‌కు శ్రీకారం చుట్టారు. ప్లాట్‌ఫాంలకు అనుసంధానంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. అదనపు ప్లాట్‌ఫాంలు కూడా కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫాంల ఉపరితలాలను ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. స్త్రీ, పురుషులతో పాటు దివ్యాంగులను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రీమియం మాడ్యులర్ టాయ్‌లెట్లను నిర్మించనున్నారు. అత్యాధునికమైన వెయిటింగ్ హాళ్లను ఏర్పాటు చేయటంతో పాటు సర్క్యులేటింగ్ ఏరియాను విస్తరించటం, కొత్తగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేయటం, స్టేషన్‌లో విరుమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేయటం వంటి వాటితోపాటు స్టేషన్ పరిసరాలు అందంగా, ఆధునికంగా కనిపించేలా అనేక ఏర్పాట్లు చేయనున్నారు.

● మచిలీపట్నం, గుడివాడ స్టేషన్లు అదరహో..

జిల్లా కేంద్రం మచిలీపట్నం స్టేషన్, గుడివాడ రైల్వేస్టేషన్లను కళ్లు మిరుమిట్లు గొలిపేలా రైల్వే శాఖ రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా అభివృద్ధి చేయబోతోంది. మచిలీపట్నం రైల్వేస్టేషన్‌ను సచివాలయ బ్లాక్ తరహాలో నిర్మించేలా డిజైన్‌ను సిద్ధం చేశారు. దీనిని రూ.27.37 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. నూతన స్టేషన్ నిర్మాణంతో పాటు అదనపు ప్లాట్‌ఫాంలు, టాయ్‌లెట్లు, వెయిటింగ్ హాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ), రెండు లిఫ్టులు, ల్యాండ్ స్కేపింగ్, మెరుగైన లైటింగ్, సర్క్యులేటింగ్ ఏరియా డెవలప్‌మెంట్ వంటివి చేపట్టనున్నారు. ఇక గుడివాడ రైల్వేస్టేషన్ విషయానికి వస్తే చైనావాల్ తరహాలో స్టేషన్ భవనాన్ని డిజైన్ చేశారు. గుడివాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ కోసం రైల్వేశాఖ రూ.27.37 కోట్లు ఖర్చు చేయనుంది. గుడివాడ రైల్వేస్టేషన్‌లో భాగంగా అదనపు ప్లాట్‌ఫాంలు, మూడు ఎక్స్‌కవేటర్లు, ఒక ఎఫ్‌వోబీ, స్టేషన్ లైటింగ్ వంటి పనులు చేపట్టనున్నారు.

● గుణదల స్టేషన్‌కు రూ.24.37 కోట్లు

నగరంలో రెండో శాటిలైట్ స్టేషన్ అయిన గుణదల స్టేషన్ విషయానికి వస్తే రూ.24.37 కోట్ల వ్యయంతో రీ డెవలప్‌మెంట్ చేయనున్నారు. దీనికి సంబంధించిన డిజైన్‌కు కూడా రైల్వే అధికారులు విడుదల చేశారు. ఈ డిజైన్ నగరంలోని అంబేడ్కర్ స్మృతివనం తరహాలో ఉంటుంది. గ్లాస్ స్ట్రక్చర్ ఎక్కువగా కనిపిస్తుంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా అదనపు ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేస్తారు. ప్లాట్‌ఫాంలను ఆధునికంగా తీర్చిదిద్దుతారు. రాయనపాడు శాటిలైట్‌స్టేషన్ తరహాలోనే టాయ్‌లెట్లు, వెయిటింగ్ హాళ్లు, సర్క్యులేటింగ్ ఏరియా, రెండు లిఫ్టులు వేస్తారు. వీటితో పాటు 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ)ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. స్టేషన్ లైటింగ్‌ను ఆధునీకరిస్తారు.

భలే.. కొలుసుకున్నారు!

ఒకే కారులో పక్కపక్కనే బోడె ప్రసాద్, పార్థసారథి



వారిద్దరూ నిన్నటిదాకా ప్రత్యర్థులు. పెనమలూరులో ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకున్నారు. ఎన్నికల్లో కలబడ్డారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరన్న నానుడిలా ఆ ఇద్దరూ కలిశారు. కొలుసు పార్థసారథి మంగళగిరిలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరేందుకు వెళుతుండగా బోడె ప్రసాద్, కొలుసు పార్థసారథి ఒకే కారులో ప్రత్యక్షమవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోడె స్వయంగా కారు డ్రైవ్ చేస్తుండగా పార్థసారథి ఆయన పక్కనే ఆశీనులయ్యారు.



● అన్నదాతకు అండగా..

రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పాత బస్టాండ్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. నడవలేని స్థితిలో ఉండి కూడా వీల్‌చైర్‌లో ర్యాలీలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

అవనిగడ్డ వైసీపీలో అయోమయం



నియోజకవర్గంవైపు తొంగిచూడని సమన్వయకర్త

» అభ్యర్థి ఎవరో తెలియక శ్రేణుల్లో నిస్తేజం » కొత్త నేత కోసం అధిష్ఠానం వెతుకులాటలో ఉన్నట్టు ప్రచారం

అవనిగడ్డ, ఫిబ్రవరి 26 : అవనిగడ్డ నియోజకవర్గానికి సమన్వయకర్తగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుని నెలరోజులు దాటుతున్నా ఆయన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడకపోవటంతో ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును మచిలీపట్నం పార్లమెంట్ నుంచి పోటీ చేయించాలని ఆలోచనతో వైసీపీ అధిష్ఠానం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. అవనిగడ్డ నుంచి దివంగత మాజీమంత్రి సింహాద్రి సత్యనారాయణరావు కుమారుడు, కేన్సర్ వైద్యనిపుణుడు చంద్రశేఖర్‌రావును నియమిస్తూ గతనెలలో నిర్ణయం తీసుకుంది. అనంతరం వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని కలిసిన డాక్టర్ చంద్రశేఖర్ తాను ఈ వయస్సులో పోటీ చేయలేనని, తనకు బదులుగా తన కుమారుడు, న్యాయవాది రామ్‌చరణ్‌ను సమన్వయకర్తగా నియమించాలని కోరారు. దీనికి జగన్మోహన్‌రెడ్డి సూత్రప్రాయంగా అంగీకరించటంతో రామ్‌చరణ్ వైసీపీ సమన్వయకర్తగా ఉంటారని, ఆయనను కూడా ఆదరించాలని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. కొద్దిరోజుల్లోనే అవనిగడ్డ నుంచి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభిస్తామని చెప్పిన చంద్రశేఖర్ మళ్లీ ఆవైపు చూడకపోవటంతో ఏం జరిగిందో అర్థంకాక కార్యకర్తలు అయోమయంలో పడ్డారు.

స్థానిక నాయకత్వం తీరుతో వెనక్కి తగ్గారా?

స్థానిక నేతలను కలిశాక పార్టీ కార్యకలాపాలు సాగించాలనే భావనతో జనవరి చివరి వారంలో చంద్రశేఖర్ అవనిగడ్డకు వచ్చారు. స్థానిక నేతలెవరూ కనీసం ఫోన్‌కు కూడా స్పందించలేదు. దీంతో సహాయ నిరాకరణ చేస్తున్నారన్న ఆవేదనతో డాక్టర్ చంద్రశేఖర్ తన కుమారుడిని అవనిగడ్డలో నుంచి బరిలోకి దింపాలన్న ఆలోచనను విరమించుకున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు?

అవనిగడ్డ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ చంద్రశేఖర్ వెనక్కి తగ్గటంతో ఆ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున ఎవరు ఎమ్మెల్యే అభ్యర్థి అవుతారన్న విషయమై స్పష్టత లేక కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఉన్న సింహాద్రి రమేష్‌బాబే మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని ద్వితీయ శ్రేణి నేతలు ప్రచారం సాగిస్తున్నారు. దీనికితోడు 10 రోజుల క్రితం ఓ వివాహ కార్యక్రమానికి జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించేందుకు వెళ్లిన సింహాద్రి రమేష్‌బాబు వెళ్లగా, మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేయమని సీఎం సూచించినట్టు కూడా పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

కొత్త నేత కోసం వెతుకులాట?

మంచి పట్టున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత ఒక్కసారి కూడా నియోజకవర్గంలోని క్యాడర్‌ను కలవకపోవటంతో వైసీపీ అధిష్ఠానం మరో కొత్త వ్యక్తిని రంగంలోకి దింపాలన్న భావనలో ఉన్నట్టు చర్చ ఊపందుకుంది. ద్వితీయ శ్రేణి నేతలను గానీ, కొత్త నేతలను గానీ రంగంలోకి దింపితే వారిపై వ్యతిరేకత రాకుండా ఉంటుందన్న ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది.

గన్నవరంలో గరళంపై ఆర్‌డబ్ల్యూఎస్ సీరియస్

కోనాయి చెరువు రిజర్వాయర్‌ను పరిశీలించిన డీఈ

» గండిని తక్షణం పూడ్చాలని ఆదేశాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : రక్షిత మంచినీటి కోనాయి చెరువు రిజర్వాయర్‌కు గండికొట్టి.. తొండంగట్టు చెరువు నుంచి కాలుష్య నీటిని పంపింగ్ చేస్తున్న గన్నవరం గ్రామ పంచాయతీ అధికారులపై గ్రామీణ నీటిసరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గన్నవరంలో గరళం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం రావటంతో మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కదిలారు. పంచాయతీ సెక్రటరీ అనీల్ కుమార్ ఆదేశాలతో గండికొట్టిన కోనాయి చెరువును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుధాకర్ పరిశీలించారు. కోనాయి చెరువుతో పాటు కలుషిత కాసారంగా ఉన్న తొండంగట్టు చెరువును కూడా పరిశీలించారు. గండిని వెంటనే పూడ్చాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టు పంప్‌హౌస్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. క్లోరిన్ గ్యాస్ అయిపోయిందని, దానికి బదులు బ్లీచింగ్ వాడుతున్నారని డీఈ గుర్తించారు. క్లోరిన్ గ్యాస్‌ను తెప్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. తొండంగట్టు నుంచి వచ్చే నీటిని అడ్డుకుని, గండి పూడ్చాలని ఆదేశించారు. పంప్‌హౌస్‌లో వైర్లు చిందరవందరగా ఉన్నాయని, వాటిని సరిచేయించాలని కార్యదర్శి అనీల్ కుమార్‌కు చెప్పారు. రిపేరులో ఉన్న మోటార్లకు కూడా తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించినట్టు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

నాసిరకం మద్యం పోవాలన్నా.. మహిళల మాంగల్యం నిలవాలన్నా..

జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలి

- పార్టీ శ్రేణులు, ప్రజలకు నెట్టెం రఘురాం పిలుపు



విద్యాధరపురం, ఫిబ్రవరి 26 : నాసిరకం మద్యం పోవాలంటే.. మహిళల మాంగల్యాలు నిలవాలంటే జగన్ పోవాలి, చంద్రబాబు రావాలని.. ఇందుకోసం ప్రతి టీడీపీ కార్యకర్త ఎన్నికల్లో అలుపెరగకుండా శ్రమించాలని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి పాలనలో మద్యం రేట్లను మూడు రెట్లు పెంచి నాసిరకం మద్యంతో లక్ష కోట్ల ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు మళ్లించాడని ఆరోపించారు. ఈ మద్యం తాగిన 35 లక్షల మంది ఆరోగ్యాలు పాడైపోయాయన్నారు. 30వేల మంది ప్రాణాలు కోల్పోగా వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత నిర్వీర్యమవుతున్నదన్నారు. అత్యాచారాలు, నేరాలు పెరిగి పోయాయన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల బెల్టుషాపులు, మొబైల్ షాపులతో మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల కనుసన్నల్లోనే జరుగుతున్నదన్నారు. నాసిరకం మద్యం పోవాలన్నా.. మహిళల మాంగల్యాలు నిలవాలన్నా.. జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలని, ఇందుకోసం కార్యకర్తలు అలుపెరగకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు.

మద్య నిషేధ వాగ్దానం అటకెక్కించిన వైసీపీ : కొలికపూడి



తిరువూరు: సంపూర్ణ మద్యనిషేధం చేస్తానని గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విక్రయాలను ఒక ఉద్యమంలా చెపట్టాడని టీడీపీ తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మూడురెట్లు ధరలు పెంచి మద్యంపై వచ్చే ఆదాయం తాకట్టు పెట్టి సుమారు రూ.40 వేల కోట్లు అప్పుతెచ్చాడని ఆరోపించారు. రాబోయే 25 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పాడుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ చెల్లింపులు ఉంటే మద్యం షాపుల్లో నగదు మాత్రమే అనుమతించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి వందల కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిస్తున్నారన్నారు. జగన్‌తో పాటు మంత్రులు రోజా, విడుదల రజనిలు మళ్లీ మద్యం నిషేదం తరువాతే ఓట్లు అడుగుతామని చెప్పి ఏముఖంతో ప్రజల ముందుకు వస్తారని ప్రశ్నించారు. మద్యం విధానంపై బహిరంగ చర్చకు రావాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. టీడీపీ, జనసేన నాయకులు జయసింహా, మినుగు శ్రీనివాసరావు ఉయ్యూరు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యూత్ అధ్యక్షుడు

గంపలగూడెం : తిరువూరు నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షుడు ఎంవీ కృష్ణ సోమవారం కొణిజర్లలో జరిగిన టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు కొణిజర్ల వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గుంటుపల్లి విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నంబూరి శ్రీనివాసరావు, నంబూరి నరేష్, జర్రిపోతుల నాగరాజులు టీడీపీలో చేశారు.



కౌన్సిలర్ నకిరికంటి వెంకట్‌ను పరామర్శిస్తున్న దళిత నేతలు

దళితులపై కవ్వింపులా!

- ఉదయభాను హుందాగా వ్యవహరించాలి
- టీడీపీ దళిత నేతల హితవు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26 : పార్టీ నేర్పిన సంస్కారం, నియోజకవర్గ నేతల సంయమనం వల్లనే ఆదివారం ఎంత రెచ్చగొట్టినా వైసీపీ నేతలు, కార్యకర్తలు బతికిపోయారని జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నేతలు హితవు పలికారు. ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటున్నానని చెప్పుకునే ఎమ్మెల్యే టీడీపీ ర్యాలీకి కారు అడ్డుపెట్టడం సమంజసమా..! కార్యకర్తలు పార్టీ జెండాతో అటంకాలు సృష్టిస్తుంటే నియంత్రించలేరా.. అని ప్రశ్నించారు. సోమవారం వార్డు కౌన్సిలర్ నకిరికంటి వెంకట్ ఇంటి వద్ద రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రతినిధులు సమావేశమై ఆదివారం జరిగిన ఘటనపై మాట్లాడారు. ర్యాలీకి అడ్డుగా కారు పెట్టారని, పార్టీ కార్యకర్తలు జెండాలతో దాడికి వస్తుంటే కనీసం నియంత్రించే హుందాతనం ఎమ్మెల్యేకు లేకపోవటం దౌర్భాగ్యమన్నారు. అకారణంగా బూదవాడకు చెందిన కార్యకర్త గుగ్లోతు రాంబాబు తల పగలగొట్టడం, అడ్డుకున్న కౌన్సిలర్ వెంకట్‌పై కర్రలతో దాడి చేయటం, ర్యాలీలోకి రావటం తప్పు కాదా అని ప్రశ్నించారు. తమ పార్టీ సంస్కారాన్ని, ఓర్పును అసమర్థంగా భావిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. దళితులంతా వైసీపీ ప్రభుత్వ మోసాలపై ఆగ్రహంతో టీడీపీ ర్యాలీకి వస్తే తట్టుకోలేకనే అటంకాలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పునరావృతమైతే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యను భారీ మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. దళితనేతలు అన్నెపాగ దుర్గామహేశ్వరరావు, ఇనపనూర్తి రాజు, కర్ల జోజి, నటుకుల రవి, యంద్రాతి వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆనంద్, మార్కపుడి వంశీ, ఆదిమళ్ల రమేష్, గడ్డిపర్తి ప్రసాద్, వేముల రాజు, మల్లెల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని గుర్తించి బైండోవర్ చేస్తాం : సీఐ జానకిరాం

తెలుగుదేశం పార్టీ దళితుల ర్యాలీపై వైసీపీ మూకదాడి ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని జగ్గయ్యపేట సీఐ జానకీరాం చెప్పారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, సంఘటనపై ఇరు పార్టీల నుంచి ఫిర్యాదులు రాలేదని, భవిష్యత్‌లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వీడియో దృశ్యాలను పరిశీలించి దాడులకు పాల్పడిన వారిని గుర్తించి సుమోటోగా బైండోవర్ చేస్తామని చెప్పారు. పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలువురు ప్రముఖులను కలిసిన వసంత



డాక్టర్ హనిమిరెడ్డి నివాసం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత

మైలవరం, ఫిబ్రవరి 26 : త్వరలో టీడీపీలో చేరనున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం మైలవరం జమిందార్ ఎస్వీ సుధాకరరావును, ఎన్నారై డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తన ఆలోచనలను వారితో పంచుకోగా వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వసంత మైలవరం వచ్చారని తెలుసుకున్న పలు పార్టీల నాయకులు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు. త్వరలో టీడీపీలో చేరుతున్నానని, అధిష్ఠానం నిర్ణయం మేరకు తన పోటీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మైలవరం ముఖ్య నాయకులను కలుస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఇళ్ల పట్టాలపై చర్చకు సిద్ధమా

- వైసీపీ నాయకులకు టీడీపీ నేతల సవాల్



విలేకర్ల సమావేశంలో ఇళ్ల పట్టాలు చూపుతున్న టీడీపీ నేతలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్యే పేర్ని నాని తన అనుయాయులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలు దొంగ పట్టాలని నిరూపించేందుకు బహిరంగ చర్చకు కోనేరుసెంటర్‌లో సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు దిలీప్, సయ్యద్ ఖాజా సవాల్ విసిరారు. సోమవారం మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దిలీప్ మాట్లాడారు. చిలకలపూడి ఎన్టీఆర్ నగర్, నేషనల్ కళాశాల వద్ద, నాగులేరుకు గోసాల మధ్య ఉన్న భూములకు స్ట్రీట్ ఫీల్డ్‌లో ఇచ్చిన పట్టాలు దొంగ పట్టాలు కావా అని ప్రశ్నించారు. పట్టాలపై ఎక్కడా తహసీల్దార్ రాజముద్ర లేదన్నారు. చిలకలపూడిలో పేదల ఇళ్లను రాత్రికి రాత్రికి తొలగించిన వైసీపీ నాయకుల నిజస్వరూపం అందరికీ తెలుసన్నారు. ప్రజలు తమ పట్టాలు తహసీల్దార్ కార్యాలయం రిజిస్టర్‌లో ఉన్నాయో లేవో సరి చూసుకోవాలన్నారు. అక్కడ ఇళ్లు వేసుకుంటే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ముందు వైసీపీ నాయకులు దొంగ పట్టాలు ఇస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా స్ట్రీట్ ఫీల్డ్‌లో చిలకలపూడి హైస్కూల్ భవన నిర్మాణంపై కోర్టు అక్షింతలు వేసిన సంగతిని దిలీప్ గుర్తుచేశారు. సయ్యద్‌ఖాజా మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ నిధులు వ్యయం చేయకుండా వైసీపీ పాలకులు అడ్డు పడుతున్నారన్నారు. అజీం తదితరులు పాల్గొన్నారు.



రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ప్రసంగిస్తున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ

రైతులపై మారణకాండ ఆపాలి

- దేశానికి నష్టం చేసే ఒప్పందాల నుంచి ప్రభుత్వం వైదొలగాలి : వడ్డే
- డబ్ల్యూటీవో ఒప్పందానికి వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల ర్యాలీ

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 : ప్రపంచ వాణిజ్య సంస్థతో దేశానికి నష్టం చేసే ఒప్పందాలను మోదీ ప్రభుత్వం అంగీరించొద్దని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పాత బస్టాండ్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లెనిన్‌సెంటర్‌లో జరిగిన సభలో వడ్డే మాట్లాడుతూ, ప్రపంచ వాణిజ్యసంస్థతో కేంద్రం చేసుకునే ఒప్పందాలు ప్రజానీకానికి, రైతులకు, కార్మికులకు నష్టం చేస్తాయని హెచ్చరించారు. డబ్ల్యూటీవోతో చేసుకునే ఒప్పందాల కారణంగా వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు నష్టం కలగుజేస్తుందన్నారు. గతంలో గాట్ ఒప్పందం దుష్ప్రభావాలను దేశ ప్రజలు చవిచూశారని పేర్కొన్నారు. బహుళజాతి సంస్థలు, స్వదేశీ కార్పొరేట్లకు మేలు చేసే అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల దేశీయ ఉత్పత్తులు దెబ్బతినడం, స్వదేశీ పరిశ్రమలు మూతపడే ప్రమాదముందన్నారు. రైతు సంఘం నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ, ప్రపంచంలో అనేక దేశాలు ఇటువంటి ఒప్పందాలను చేసుకుని నష్టపోవడం గురించి ప్రస్తావించారు. ఆయా దేశాలలో ఈ విధానాల పట్ల నిరసనలు వ్యక్తమౌతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు దడాల సుబ్బారావు, హరినాథ్, కార్మిక సంఘాల నేతలు ఎస్ హెచ్ శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.సాంబశివరావు, అంజనేయులు, కె.దుర్గారావు, ఈవీ నారాయణ, కె.రామకృష్ణ, కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో రైతుల ర్యాలీ

చల్లపల్లి : ఢిల్లీలో రైతులపై మోదీ ప్రభుత్వం మారణకాండను ఆపాలని జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావులు అన్నారు. ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చల్లపల్లిలో రైతులు ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ, మోదీ ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరితే ఒక రైతును ప్రభుత్వం చంపేసిందన్నారు. టియర్ గ్యాస్ ప్రభావంతో రైతులకు కళ్లు, చెవులు దెబ్బతిన్నాయన్నారు. రైతులపై మారణకాండ సాగిస్తున్న మోదీకి ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండే హక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ చల్లపల్లి పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శులు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, బండి ఆదిశేషు, సీఐటీయూ జిల్లా నేత శీలం నారాయణరావు, మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, సీపీఐ నేత మల్లుపెద్ది బోసు, రైతుసంఘం నేతలు వేమూరి రమేష్‌బాబు, మేడంకి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



పిలిచి నిర్బంధం

- మంత్రి జోగి సభ నుంచి టీడీపీ కౌన్సిలర్లను ఈడ్చుకెళ్లిన పోలీసులు
- సమావేశం ముగిసేవరకూ స్టేషన్‌లో నిర్బంధం



కౌన్సిలర్ పంద్రాజు సుధారాణిని ఈడ్చుకు వెళుతున్న పోలీసులు, టీడీపీ నేత జగరోతు నాగరాజును తీసుకు వెళుతున్న కంకిపాడు సీఐ శ్రీనివాస్

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 : కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరులో టిడ్కోఇళ్ల లబ్ధిదారుల సమీక్ష సమావేశం నుంచి టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులను పోలీసులు ఈడ్చుకువెళ్లి జీపుల్లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నగర పంచాయతీ పరిధిలో జెమినీస్కూల్ సమీపాన టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో సోమవారం గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనర్ ఆహ్వానం మేర నగర పంచాయతీకి చెందిన అధికార పార్టీ వారితో పాటు టీడీపీ కౌన్సిలర్లు పంద్రాజు సుధారాణి, పరిమి సలోమి సంతోషి, పలియాల శ్రీనివాసరావు, బూరెల రమణలు హాజరయ్యారు. వీరితోపాటు పలువురు టీడీపీ నాయకులు సమావేశానికి వెళ్లారు. సమావేశం ప్రారంభం కాక ముందే టీడీపీ కౌన్సిలర్లు, నాయకులపై పోలీసులు జులుంప్రదర్శించి వారిని సమావేశం నుంచి బయటకు ఈడ్చుకు వెళ్లి పోలీసు జీపులు, వాహనాల్లో ఎక్కించి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కమిషనర్ ఆహ్వానం మేర వచ్చామని, ఏమితప్పు చేశామని మమల్ని బయటకు తీసుకువెళుతున్నారని టీడీపీ కౌన్సిలర్లు పోలీసులను ప్రశ్నించి ప్రతిఘటించినప్పటికి పట్టించుకోకుండా లాక్కువెళ్లి వాహనాలు ఎక్కించారు. సమావేశంలో అలజడి సృష్టిస్తారన్న నెపంతో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు జంపాన గుర్నాధరావు, జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కూనపరెడ్డి వాసు, చిరంజీవి, పరిమి భాస్కర్, జగరోతు నాగరాజు, నరేశ్, తదితరులను స్టేషన్‌కు తీసుకువెళ్లి సమావేశం ముగిసేవరకు నిర్బంధించారు.

మండలికి టిక్కెట్ కేటాయించాలి

- నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు



మోపిదేవి, ఫిబ్రవరి 26 : అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండలి బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ కేటాయించేలా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పరిశీలన చేయాలని టీడీపీ నేతల విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. సోమవారం ఉదయం మోపిదేవిలోని డాక్టర్ మండవ సాయి ప్రాంగణంలో నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా ఆరు మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గంలోని ఆరు మండలాలు కంచుకోటగా నిలిచాయన్నారు. రెండేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ అధిష్ఠానం పోటీకి దూరం అంటూ ప్రకటించినా నియోజకవర్గంలోని రెండు మండలాలు ఎంపీపీ, జడ్పీటీసీలు భారీ మెజార్టీతో విజయం సాధించాయన్నారు. అవినీతి మరకలు లేకుండా ప్రజామద్దతుతో పరిపాలన చేసిన మండలి బుద్ధప్రసాద్‌కు మొదటి జాబితాలో పేరు ప్రకటించకపోవటంతో ద్వితీయ శ్రేణి నేతలు తీవ్ర మనోవేదనకు గురి కావాల్సి వచ్చిందన్నారు. కాపు సామాజిక వర్గం ప్రాతిపదికన తీసుకున్నప్పటికీ జిల్లాలో అగ్రనేతగా మండలి బుద్ధప్రసాద్‌కు పేరుందన్నారు. తెలుగుదేశం-జనసేన పొత్తులో భాగంగా టీడీపీ సీటు వదులుకోవాల్సి వస్తే జనసేన తరఫున బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ ఇచ్చే ఆలోచన చేసినా సంపూర్ణ మద్దతు తెలియజేస్తామంటూ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఏక వాక్య తీర్మానాన్ని చేసి ఆమోదించారు. నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయాన్ని అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మోపిదేవి టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చల్లపల్లి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, ఘంటసాల మండలాల అధ్యక్షులు మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, మెండు లక్ష్మణరావు, బండే శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, పార్టీ సీనియర్ నాయకులు మండవ బాలవర్ధిరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



మోపిదేవిలో స్టేషన్ భవనం ప్రారంభిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఎస్పీ అస్మీ

మోడల్ స్టేషన్‌తో మరింత మెరుగైన సేవలు

- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్

మోపిదేవి, ఫిబ్రవరి 26 : మోడల్ పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీ అశోక్ కుమార్ తెలిపారు. రూ.1.50 కోట్లతో మోపిదేవిలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబుతో కలిసి డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ నయిమ్ అస్మీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతీ సచివాలయానికి మహిళా సంరక్షణ కార్యదర్శిని ఏర్పాటు చేసి గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మోపిదేవి స్టేషన్‌కు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వెలువడేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు త్రినాథ్, నాగప్రసాద్, సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎస్‌ఐలు సత్యనారాయణ, చిన్నబాబు, శిరీష, సుబ్రహ్మణ్యం, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలి : ఉమా

- పుల్లారావు మృతి పార్టీకి తీరని లోటు



పుల్లారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఉమా

మైలవరం, ఫిబ్రవరి 26 : చంద్రగూడెం టీడీపీ నేత పుల్లారావు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పార్టీ శ్రేణులు భావోద్వేగాలకు గురికావద్దన్నారు. బ్లూ మీడియా, సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలను నమ్మవద్దన్నారు. మైలవరం సీటు దేవినేని ఉమామహేశ్వరరావుకు ఇవ్వడం లేదని, ఇతరులు పోటీ చేస్తారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలతో తీవ్ర మనస్తాపం చెందిన పుల్లారావు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం దేవినేని ఉమా పార్టీశ్రేణులతో కలిసి పుల్లారావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పుల్లారావు కుమారుడు అమెరికాలో ఉండటంతో కుటుంబసభ్యుల కోరిక మేరకు పుల్లారావు మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మంగళవారం పుల్లారావు అంత్యక్రియల్లో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఉమా పిలుపునిచ్చారు.

ఉమాకు సీటు లేదని.. కార్యకర్త మృతి

ఇబ్రహీంపట్నం : మైలవరం సీటు ఉమాకు ఇవ్వడం లేదని తీవ్ర మనస్తాపంతో కొండపల్లి మున్సిపాలిటీ 24వ డివిజన్ తూర్పు భీమరాజుగుట్ట నివాసి క్రియాశీలక కార్యకర్త నూతక్కి సురేష్ (40) ఆదివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు, పిల్లాడు ఉన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్ : దేశ వ్యాప్తంగా మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. స్పందన హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయితో కలిసి జేసీ మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 1,39,180 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 4 లక్షల 71 వేల 392 ఇళ్ల వద్దకు 2060 మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, 949 మంది ఐసీడీఎస్ సిబ్బంది, 1381 మంది ఆశా వర్కర్లు, 58 మంది ఇతరులు సేవలందిస్తారన్నారు. విజయవంతం అయ్యేందుకు కృషి చేసి పోలియో వ్యాధిని పారదోలాలన్నారు.

28 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల మూసివేత

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 : ఎన్టీఆర్ జిల్లాలో 2023-24 పంట కాలానికి సంబంధించి ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాలను ఈ నెల 28వ తేదీ నుంచి మూసివేయడం జరుగుతుందని, ఇంకా ఎవరైనా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటే వెంటనే వారి పరిధిలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ 2023-24 పంటకాలానికి సంబంధించి జిల్లాలో 2,74,627 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని.. ఇందులో ప్రభుత్వం 1,38,000 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.1,03,535,880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు జేసీ ఆ ప్రకటనలో వెల్లడించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆలయ కమిటీ సమావేశంలో ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మోపిదేవి, ఫిబ్రవరి 26 : మండలంలోని పెదప్రోలులో గ్రామదేవత అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సమావేశంలో ఘర్షణ జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. త్వరలో జరగనున్న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ కమిటీ, గ్రామస్థులతో సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతుండగా, గ్రామస్థులకు కమిటీ సభ్యులకు మధ్య వాగ్వాదం నెలకొంది. అదికాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసి యన్నం శ్రీనివాసరావు, యన్నం చంటిలపై గౌరం హర్షవర్దన్, గౌరం శివప్రసాద్‌లు కుర్చీలతో దాడి చేశారు. శ్రీనివాసరావు, చంటిలకు తీవ్ర గాయాలు కావటంతో 108లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఘర్షణ నేపథ్యంలో కొద్ది రోజుల్లో జరిగే వార్షిక జాతర మహోత్సవంపై గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది.



ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న సద్గురు శ్రీమధుసూదన సాయి

సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో

ఉచితంగా ఐసీయూ సేవలు

- సద్గురు మధుసూదనసాయి

కూచిపూడి, ఫిబ్రవరి 26 : కృష్ణాజిల్లా కూచిపూడిలో రవి ప్రకాశ్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో స్త్రీల ప్రసూతి విభాగం, నియోనేటల్ (ఐసీయూ) సేవలు పూర్తి ఉచితంగా అందజేస్తారని సద్గురు మధుసూదనసాయి (బెంగళూరు) పేర్కొన్నారు. వైద్యాలయంలో సద్గురు శ్రీ మధుసూదనసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ సహకారంతో ఏర్పాటైన సాయిఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఐసీయూ విభాగాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, వైద్యం కోసం వచ్చిన రోగికి చిరునవ్వుతో పలకరించి కుశల ప్రశ్నలు వేస్తే కొంత రోగం నయమవుతుందన్నారు. ఆ తర్వాత వైద్యసేవలు చేస్తే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రతీ ఒక్కరికీ ఆరోగ్యం, అక్షరం, భోజనం ముఖ్యమని తెలిపారు. వైద్యాలయం చైర్మన్ డాక్టర్ కూచిభొట్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, వైద్యాలయ నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం సూర్యారావుపేట సెక్షన్ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా మాచవరం బీఆర్‌టీఎస్ రోడ్డు, కేన్సర్ ఆసుపత్రి ఏరియా, ఏలూరు రోడ్డు, నార్ల వారి వీధి, కుటుంబరావు వీధి, బెల్లెమ్మ వీధి, కాటూరి వారి వీధి, దాసయ్య వీధి, పోతినేని వారి వీధి, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాల్వకట్ట ఏరియా, పడవల రేవు, మాచవరం ఆంజనేయస్వామి గుడి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జనసేన-టీడీపీ కూటమి

అభ్యర్థుల ప్రకటనతో వైసీపీలో భయం

తాడేపల్లిగూడెం బహిరంగ సభను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే గద్దె

వన్‌టౌన్, ఫిబ్రవరి 26: జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థుల ప్రకటనతో వైసీపీలో భయం పట్టుకుందని, దీంతో రకారకాల కుట్రలు పన్నుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరగనున్న టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం తూర్పు సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు ప్రతి డివిజన్‌లోను జనసేన నాయకులతో సంప్రదించి వారి సూచనలు తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ సారి ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని, జగన్ దుష్ట ఎన్నికల వ్యూహాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ వారినే రెచ్చగొట్టి కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తారని ఎవరూ ఎక్కడా పరిధి దాటి మాట్లాడవద్దని సూచించారు. తాడేపల్లిగూడెం సభలకు ప్రతి డివిజన్ నుంచి పార్టీ శ్రేణులను సమీకరించి సభను జయప్రదం చేయాలని కోరారు. తనకు టిక్కెట్టు ప్రకటించిన చంద్రబాబు-పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సుఖావాసి శ్రీనివాస్, చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీనివాస్, కార్పోరేటర్‌లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరి సాయిబాబు, సొంగా సంజయ్ శర్మ, గాబ్రియేల్, రత్నం, రమేష్, నాగమణి, మాదాల చిన్నితల్లి పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి: పోతిన

తాడేపల్లిగూడెంలో జరగనున్న టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ కోరారు. సోమవారం కొత్తపేటలోని మా ఇల్లు ఫంక్షన్ హాలులో పశ్చిమ ముఖ్య నేతలు, వీరమహిళలు, జనసైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ రానున్న ఎన్నికల్లో 24 అసెంబ్లీ సీట్లు, 3 పార్లమెంట్ సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, దానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మనకోసం పనిచేసే నాయకుడు పవన్‌కల్యాణ్ అని గుర్తుంచుకోవాలన్నారు.

మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దాం

ఆటో కార్మికులకు ఎమ్మెల్యే గద్దె సూచన

పటమట, ఫిబ్రవరి 26 : రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని అందుకు అనుగుణంగా టీఎన్‌టీయూసీ అనుబంధ సంఘంలోని ఆటో కార్మికులు కృషి చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ తూర్పు కార్యాలయంలో నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన రాయవరపు అశోక్ ఎమ్మెల్యే గద్దెను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే ఆటో కార్మికులు సంతోషంగా జీవించారని అటువంటి మంచి పరిపాలన తెచ్చుకునేందుకు ఆటో కార్మికులు కూడా కృషి చేయాలని అన్నారు. టీఎన్‌టీయూసీ నాయకులు మొకర అంజిబాబు, కలగంటి వెంకట కిషోర్, మేరుగు రాజు, కలగంటి మల్లిబాబు, కాట్రగుంట నాగరాజు పాల్గొన్నారు.



ఇస్త్రీ పెట్టెలను అందజేస్తున్న గద్దె రామ్మోహన్

హ్యాట్రిక్ విజయం సాధించనున్న గద్దె

-చెన్నుపాటి గాంధీ

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ సారి కూడా తూర్పు నుంచి గెలుపొంది ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ సాధించనున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ అన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లో టీడీపీ తూర్పు కార్యాలయంలో రామలింగేశ్వరనగర్‌కు చెందిన దివ్యాంగుడు ఏసురాజుకు రూ.35వేలు విలువచేసే కృత్రిమ కాలును గద్దె తన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే గద్దెను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందని అన్నారు.

25 కుటుంబాలకు ఇస్త్రీ పెట్టెలు అందజేత

పింఛను, జనతా వస్త్రాలు, పేదలకు బియ్యం పంపిణీ, ఇళ్ల కేటాయింపు, వృత్తి పరికరాల అందజేత ఇటువంటి ఏ సంక్షేమ పథకాన్నైనా మొదట రూపొందించి అమలు చేసింది టీడీపీయేనని గద్దె రామ్మోహన్ చెప్పారు. సోమవారం ఉదయం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గద్దె సొంత నిధులతో కొనుగోలు చేసిన 25 ఇస్త్రీ పెట్టెలను 25 రజక కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు-పవన్ కల్యాణ్‌ల కూటమిలో ఏర్పడే ప్రభుత్వంలో ఒక్కొక్క రజక సంఘానికి రూ.2లక్షల రుణం ఇచ్చేలా చూస్తామని అన్నారు.

కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, శాయన సత్యనారాయణ, రత్నం రమేష్, అబ్దుల్ ఖాలీక్, గద్దె ప్రసాద్, మాదాల చిన్నతల్లి, భాగం సాయిప్రసాద్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వల్లే సమర్థపాలన సాధ్యం

కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

భారతీనగర్, ఫిబ్రవరి 26: ఆంధ్రరాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా ఉంచాలంటే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమని కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. తూర్పు పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలోని జామాక్ హౌసింగ్ సొసైటీ అపార్ట్‌మెంట్‌లో సోమవారం బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో గద్దె అనురాధ ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసమర్థ విధానాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ తదితరులు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమాక్ హౌసింగ్ సొసైటీ ఏర్పాటుతో పాటుగా ఇళ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కీలక పాత్ర పోషించారని అన్నారు. టీడీపీ-జనసేన అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత వైసీపీ నాయకులకు ఏమి చేయలేక చతికిలపడ్డారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు.

కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, గొల్లపూడి నాగేశ్వరరావు, చలసాని రోజా, కోడూరు ఆంజనేయవాసు, సలిమిశెట్టి రాజామణి, మార్త సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలి

● కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, ఫిబ్రవరి 26: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా మేయర్, కమిషనర్‌లకు అందజేశారు. మొత్తం 23 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ రోహిణి, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

అన్ని నియోజకవర్గాల్లో

టీడీపీ- జనసేన అభ్యర్థుల గెలుపునకు కృషి

● కృష్ణబలిజ, పూసల, దాసరి కుల సంఘాల ముఖ్యనేతలు



ముఖ్య నాయకులతో సమావేశమైన వీరంకి వెంకట గురుమూర్తి, సింహాద్రి కనకాచారి

విద్యాధరపురం, ఫిబ్రవరి 26: అన్ని నియోజకవర్గాలలో టీడీపీ- జనసేన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని కృష్ణబలిజ, పూసల, దాసరి కుల సంఘాల ముఖ్య నాయకులన్నారు. విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం కృష్ణబలిజ, పూసల, దాసరి కుల సంఘాల ముఖ్యనాయకులతో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సింహాద్రి కనకాచారిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కృష్ణ బలిజ సాధికారిక అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ పశ్చిమ, కృష్ణా జిల్లా మచిలీపట్నం, పామర్రు, గుడివాడ, ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గాలలో త్వరలో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ, సమస్యలను సమావేశాలలో చర్చించి పరిష్క రించేందుకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

ప్రతి నియో జకవర్గంలోనూ కమిటీలుగా ఏర్పడి ఎన్నికల్లో టీడీపీ- జన సేన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. కృష్ణబలిజ సంఘం అధ్యక్షుడు కోలా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాగబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పాత శివాలయంలో 6 నుంచి మహాశివరాత్రి కల్యాణోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఈవో లోకేశ్వరి తదితరులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 26: స్థానిక భ్రమరాంబా మల్లేశ్వరాలయం (పాత శివాలయం)లో మార్చి 6నుంచి 13 వరకు మహాశివరాత్రి కల్యాణోత్సవాలు జరగనున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సీ.లోకేశ్వరి తెలిపారు. సోమవారం ఆలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో మహాశివరాత్రి కల్యాణోత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాశివరాత్రి కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ సంప్రదాయాల మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న మహాశివరాత్రి పర్వదినాన విశేష అభిషేకాది అర్చన కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. 9న రథోత్సవం జరుగుతుందన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్ము మధు, సభ్యులు టి.చంద్రశేఖర్, నాగోతి గురురామప్రసాద్, రాంపిళ్ల వాసు, నాగోతి విజయనిర్మల, వెలది శాంతి, జూలూరి సౌజన్య శ్రీలక్ష్మి, ముఖ్య అర్చకుడు రాచకొండ సుమంత్‌శర్మలు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26: లేగదూడల పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు గణాభి వృద్ధి ఉపసంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. కొండపల్లిలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

లింగ నిర్ధారణ కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన లేగ దూడల యజమానులకు బహుమతులను అందించారు. కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజకుమారి, చుట్టుకుదురు వాసు, కాటూరి వెంకటేశ్వరరావు, కె.రాధాకృష్ణమూర్తి, కృష్ణమూర్తి, డాక్టర్ శైలుమాధురి, మోహన్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గంపలగూడెం, ఫిబ్రవరి 26: ఇసుక అనధికార రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుముల్లంక రెవెన్యూ పరిధిలోని కట్లేరు నుంచి ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తుండగా మేడూరు వద్ద స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీను తెలిపారు.



చంద్రబాబు సీఎం కావాలని అజ్మీర్‌లో ప్రార్థనలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటవ్వాలని, చంద్రబాబు సీఎం అవ్వాలని, మైలవరం నియోజకవర్గం నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు గెలవాలని అజ్మీర్ దర్గాలో ఇబ్రహీంపట్నానికి చెందిన ముస్లిం నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ప్రార్థలను చేశారు. ఈనెల 21న ప్రత్యేక చాదర్‌ను తీసుకొని ఇక్కడి నుంచి అజ్మీర్ ప్రయాణంచేశారు. అక్కడ చాదర్‌ను సమర్పించారు. మహబూబ్ సుభాని, జిలాని, కరిముల్లా, ఇబ్రహీం, షమీవుల్లా, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

నగరాభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు

● సీపీఎం నాయకులు డీవీ కృష్ణ, సీహెచ్ బాబూరావు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 26: కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రతిపక్షాలను, ప్రజలను అణిచి వేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ , రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. జనశంఖారావం యాత్ర సోమవారం దేవీనగర్ , రామకృష్ణాపురం, అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట, బసవ తారకనగర్‌లో జరిగింది.



స్థానికులతో మాట్లాడుతున్న బాబూరావు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పాలన సాగిస్తున్నాయన్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ బీజేపీ మోదీతో కుమ్మక్కయిందని ఆరోపించారు. నగర అభివృద్ధిని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. స్వార్థ రాజకీయాలు తప్ప నగర అభివృద్ధి ప్రజాప్రతినిధులకు పట్టలేదని, నగరాన్ని అన్ని విధాల దగా చేశారన్నారు. ఫ్లైఓవర్లు, అండర్‌బ్రిడ్జిలు వారి అసమర్థపాలనకు నిదర్శనంగా మిగిలాయన్నారు. నగరపాలక సంస్థకు వాగ్దానం చేసిన నిధులు ఇవ్వలేదని, దుర్గ గుడి అభివృద్ధికి హామీ ఇచ్చిన నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపారన్నారు. వచ్చే ఎన్నికల్లో నగరాన్ని అభివృద్ధి చేసిన సీపీఎంను సెంట్రల్‌లో గెలిపించాలన్నారు. శ్రీదేవి, సత్యబాబు, బి. రమణరావు, కే.దుర్గారావు, సరోజ, ప్రవీణ్, సీహెచ్ శ్రీనివాస్, ఝాన్సీ, పద్మ పాల్గొన్నారు.

లెనిన్ పార్క్‌లో లైటింగ్ ఏర్పాటు



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 26: దొంగతనాలను అరికట్టేందుకు త్రీ టౌన్ పోలీసుల చొరవతో స్థానిక వ్యాపారస్తుల మద్దతుతో గవర్నరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లెనిన్ పార్క్‌లో లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ లైటింగ్‌ను సోమవారం స్విచ్ఛాన్ చేశారు. త్రీ టౌన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పోలీసులు స్థానిక వ్యాపారవర్గాల వారు వీక్షించారు. లైటింగ్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మీ అబ్బాయికి సానుకూల సంకేతాలు లేవు

● మైలవరం కాకుండా వేరేచోట పోటీ చేసుకోండి

● వసంత నాగేశ్వరరావుకు చెప్పిన బొమ్మసాని

గొల్లపూడి, ఫిబ్రవరి 26: మీరు మొన్నటి వరకు వైసీపీలో ఉన్నారు. ఇప్పుడు టీడీపీలోకి వచ్చి మైలవరం నుంచి పోటీ చేస్తామంటే క్యాడర్ మిమ్మల్ని ఆదరించరు. పైగా మీ అబ్బాయికి నియోజకవర్గంలో సానుకూల సంకేతాలు లేవు. టీడీపీ క్యాడర్ చాలా గందరగోళంలో ఉంది. మైలవరం నుంచి కాకుండా ప్రత్యామ్నాయ నియోజకవర్గం చూసుకోండని సోమవారం గొల్లపూడిలో తనను కలిసిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తండ్రి మాజీమంత్రి వసంత నాగేశ్వరరావుకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మైలవరం తరఫున టీడీపీ సీటు ఆశిస్తున్న బొమ్మసాని సుబ్బారావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో బొమ్మసాని సుబ్బారావు మాట్లాడారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో ఘర్షణ వాతావరణం నేపథ్యంలో టీడీపీ క్యాడర్ మీకు సహకరించకపోవచ్చని చెప్పామన్నారు. ఎవరైనా మద్దతు కోరొచ్చన్నారు. నియోజకవర్గంపై బలమైన పట్టున్న తనకు సీటు ఇవ్వాలని, మరోసారి సీటు విషయంలో చంద్రబాబు పునరాలోచన చేయాలని ఆయన కోరారు.



బొమ్మసానిని కలిసిన వసంత నాగేశ్వరరావు

గిరిజనుల అభ్యున్నతికి కృషి: కొలికపూడి

ఎ.కొండూరు, ఫిబ్రవరి 26: గిరిజనులు అన్ని రంగల్లో అభివృద్ధి చెందడానికి టీడీపీ-జనసేన పార్టీలు ఉమ్మడిగా కృషి చేస్తా యని టీడీపీ తిరువూరు ఇన్‌చార్జి కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద తండా గ్రామంలో శ్రీనివాసరావు దంపతులు పర్యటించారు. ఎ.కొండూరు మండలంలో కిడ్నీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



పెద్దతండాలో పర్యటిస్తున్న కొలికపూడి దంపతులు

గిరిజన విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులయితే ప్రతి ఒక్కరికీ నగదు బహుమతి అందిస్తానని తెలిపారు. నిరుద్యోగుల పోటీ పరీక్షల కోసం తిరువూరులో ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. జగన్ అరాచక, అవినీతి పాలన నుంచి విముక్తి కోసం టీడీపీ-జనసేన కార్యకర్తలు కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. గిరిజన తండా మహిళలకు కొలికపూడి శ్రీనివాస్, భార్య మాధవికి ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, జనసేన తిరువూరు ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, రోజారాణి, భీమ్లానాయక్, పీక్లానాయక్, సర్పంచ్ లక్ష్మీరంగారావు, అమర్‌సింగ్, అబ్బు, శంకర్, కిషోర్, సురేష్, డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు మహిళలు, పిల్లలు అదృశ్యం

చిట్టినగర్, ఫిబ్రవరి 26: వేర్వేరు కేసుల్లో ఇద్దరు మహిళలతోపాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం వించిపేట చర్చి ప్రాంతంలో నిరీక్షణ్, భార్య ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. దంపతులు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్లగా పని చేస్తారు. ఈ నెల 22న మధ్యాహ్నం భర్త నిద్రపోతుండగా భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయిందని బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో కేసులో పాతరాజరాజేశ్వరిపేటలో జే.జహన్ కుటుంబంతో ఉంటాడు. ఇటీవల చీటి డబ్బుల విషయంలో భార్యాభర్తలకు గొడవ జరిగింది. 25న తెల్లవారుజామున 2 గంటలకు నిద్రలేచి చూడగా తన భార్య లలిత కనిపించలేదని చుట్టు పక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 27 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

అందగత్తెగా అలరించాలనుంది

రాశి సింగ్

'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివకందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. మున్ముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.

- అనుకోకుండా 'భూతద్ధం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను.
- కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్, పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. కథ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ముగింపు ఎలా ఉంటుందో ఎవరూ ఊహించలేరు. శ్రీ చరణ్ పాకాల సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు గర్వంగా ఉంది.
- శివ కందుకూరి గొప్ప వ్యక్తిత్వం ఉన్న హీరో. ఈ సినిమా కోసం చాలా ఓపిగ్గా కష్టపడ్డారు. కుటుంబ నేపథ్యాన్ని పక్కన పెట్టి అందరితో కలివిడిగా ఉన్నారు. పురుషోత్తంరాజ్ స్పష్టత ఉన్న దర్శకుడు. ఏ సన్నివేశం ఎలా తీయాలో, ఎవరి నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలో ఆయనకు అవగాహన ఉంది. సినిమాను ఓ అద్భుతంలా మలిచారు. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడలేదు కాబట్టే మంచి అవుట్‌పుట్ వచ్చింది.
- కథానాయికగా వైవిధ్యమైన పాత్రలు పోషించాలనేది నా కోరిక. మంచి ఎమోషనల్ లవ్‌స్టోరీ చేయాలనుంది. కథ నచ్చితే గ్లామర్ పాత్రల్లో కనిపించడానికి సిద్ధమే. ప్రస్తుతం సుహాస్‌తో 'ప్రసన్న వదనం' అనే చిత్రం చేస్తున్నాను.

కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు

నాగ్ అశ్విన్



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్‌హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. మున్ముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఇకమీదట ఇలాంటివి వద్దు

మోహన్‌బాబు



'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

గీతాంజలి వస్తోంది



అంజలి టైటిల్ పాత్రలో నటిస్తున్న హారర్ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. 2014లో వచ్చిన 'గీతాంజలి' చిత్రానికి ఇది సీక్వెల్. శివ తుర్లపాటి దర్శకుడు. కోన వెంకట్ కథను అందిస్తూ, నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'గీతాంజలి' ముగింపు నుంచి సీక్వెల్ ప్రారంభమవుతుంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నాం' అని కోన వెంకట్ చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేశ్, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్ రాహుల్ మాధవ్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు. సినిమాటోగ్రఫీ: సుజాత సిద్ధార్థ

హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం

శ్రీవిష్ణు



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్నార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

హాలీవుడ్ యాక్టర్ కెన్నెత్ మిచెల్ మృతి



ప్రముఖ హాలీవుడ్ నటుడు కెన్నెత్ మిచెల్ (49) కన్నుమూసిన వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2018లో లాటెరల్ స్క్లెరోసిస్ వ్యాధి బారినపడిన కెన్నెత్ చికిత్స పొందుతూ ఈ నెల 24న తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుసాన్ మే, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'కెప్టెన్ మార్వెల్', 'స్టార్‌ట్రెక్' సిరీస్‌లు నటుడిగా కెన్నెత్‌కు మంచి గుర్తింపు తెచ్చాయి.

గామి వింత గమ్యం



విష్వక్‌సేన్ అఘోరా పాత్రలో నటిస్తున్న చిత్రం 'గామి'. మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో దూకుడు పెంచింది. 'గమ్యాన్నే' అంటూ సాగే తొలి గీతాన్ని యూనిట్ ఇటీవలే విడుదల చేసింది. సనాపతి భరద్వాజ పాత్రుడు సాహిత్యం అందించారు. స్వీకర్ అగస్తి స్వరాలు సమకూర్చడంతో పాటు అనురాగ్ కులకర్ణితో కలసి ఆలపించారు. విద్యాధర్ కులకర్ణి దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. చాందినీ చౌదరి కథానాయిక. ఈ నెల 29న ట్రైలర్ విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విష్వక్‌సేన్, అఘోరాలు దేనినో తీక్షణంగా చూస్తూ కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది.


ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత

- కొన్నాళ్లుగా అనారోగ్యం
- ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస



"చిట్టి ఆయీ హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రూబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయీ హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాతి నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పంకజ్ ఉధాస్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. పద్మశ్రీ, ఇతర అవార్డులు వరించిన పంకజ్ ఉధాస్ శాస్త్రీయ సంగీతాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భారత సంగీతానికి ఆయన వెలుగుదివ్వెగా ప్రధాని అభివర్ణించారు. ఆయన మెలోడీలు తరాలు దాటిపోయాయన్నారు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూరించలేనిదని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా ప్రధాని పేర్కొన్నారు.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

కాన్సెప్ట్ మెప్పించింది



విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ ఆర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు. ఈ గీతానికి భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అజయ్ అరసాద స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చరణ్ మాధవనేని.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

నవ్య
కుటుంబ కదంబం

డాక్టర్

జెరియాట్రిక్



'వయసు పైబడుతోంది కదా!
మునుపటి ఓపిక ఉండదులే!
ఇదంతా సహజం' అని
సరిపెట్టుకుంటున్నారా?
కానీ మలి వయసుకు
చేరుకుంటున్నా, సత్తువ
సడలకుండా ఉండాలంటే
కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎనభైలో నలభైలా



వయసు పైబడేకొద్దీ పుట్టిన రోజు దగ్గర పడుతుంటే గుండెల్లో బేజారు మొదలవుతూ ఉంటుంది. యాభైకి చేరుకుంటే అర్థాయుష్షు అయిపోయిందే అని కొంత నిరాశకు లోనయ్యేవాళ్లూ ఉంటారు. నిజానికి ఒంట్లో తగ్గిపోయే హుషారు, చలాకీతనం, పెరిగిపోయే నిస్సత్తువ, నీరసాలు పైబడే వయసును అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి. 'అప్పట్లో నేను అలవోకగా పనులన్నీ చేసుకోగలిగేదాన్ని, సునాయాసంగా పనులన్నీ చక్కబెట్టేదాన్ని, చకచకా పరుగులెత్తేదాన్ని' అని పాత రోజుల గురించి గర్వంగా చెప్పుకోవడమే కాదు, అదే ఆరోగ్యాన్నీ, శరీర దారుఢ్యాన్నీ మున్ముందు కూడా కొనసాగించే వీలుంది. అయితే అందు కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలి. చేసే పనులు, తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ కనబరచాలి. మరీ ముఖ్యంగా మనసు వయసు పైబడనీయకూడదు.

క్రమం తప్పని వ్యాయామం

పైబడే వయసులో కండరాల నొప్పులు వేధిస్తున్నాయంటే, కండరాల పటుత్వం తగ్గిందని అర్థం. కీళ్ల నొప్పులు మొదలైనప్పుడు, రోజూ నడవడం మొదలు పెట్టండి అని వైద్యులు సూచిస్తూ ఉంటారు. కీళ్ల అరగడం మొదలైతే నడవడం వల్ల అవి ఇంకా వేగంగా అరిగిపోతాయి కదా? అని అయోమయానికి గురి కాకూడదు. నడక వల్ల కాళ్లలోని కండరాలు బలం పుంజుకుని ఊతాన్నిస్తాయి. దాంతో కీళ్ల మీద ఒత్తిడి తగ్గి అవి అరిగే వేగం నెమ్మదిస్తుంది. పైగా రోజు మొత్తంలో పది వేల అడుగులు నడిచే వ్యక్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. కాబట్టి కండరాల పటుత్వం కోసం నడక, ఈత, సైక్లింగ్... ఇలా నచ్చిన వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. ఏరోబిక్స్‌తో పాటు రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయవచ్చు. ఎముకల దృఢత్వం కోసం వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తూ ఉండాలి. బరువులు ఎత్తడం వల్ల కండరాలు బలం పుంజుకోవడంతో పాటు, శారీరక దారుఢ్యం కూడా పెరుగుతుంది.

సమతులాహారం

ఆదివారం వస్తే నాన్ వెజ్, మిగతా రోజులంతా వెజిటేరియన్ వంటకాలను వండుకోవడం మన ఆనవాయితీ. కానీ అన్ని రకాల పోషకాలూ సమపాళ్లలో అందాలంటే ఏ పదార్థాల్లో ఏ పోషకాలుంటాయో అవగాహన ఏర్పరుచుకుని రోజు మొత్తంలో సరిపడా పోషకాలన్నీ అందుతున్నాయో లేదో గమనించుకుంటూ ఉండాలి. నాన్ వెజ్ వండుకుని తింటే ప్రొటీన్ ఒక్కటే అందుతుంది. మరి మిగతా విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మపోషకాల మాటేమిటి? అలాగే కేవలం ఒక్క కూరగాయతో సరిపెట్టుకుంటే ప్రొటీన్ దక్కేదెలా? కాబట్టి వారాంతాల్లో నాన్‌వెజ్‌కు పరిమితమయ్యేవాళ్లు, కూరగాయలతో కలిపి నాన్ వెజ్ వండుకోవడం, లేదా అదనంగా వెజిటేరియన్ వంటకం చేసుకోవడం అవసరం. అలాగే కూరగాయలను పప్పుదినుసులతో కలిపి వండుకోవడం, గుడ్డుతో కలిపి వండుకోవడం లాంటివి కూడా చేయవచ్చు.



ప్రొటీన్ సరిపడా

సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనత తలెత్తకుండా ఉండడానికీ సరిపడా ప్రొటీన్ అవసరం. మాంసాహారం తినలేనివాళ్లు కంది, పెసరపప్పులను తినవచ్చు. చిక్కుళ్లు, బఠాణీ, మునగ, పుట్టగొడుగుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రతి రోజూ ఆహారంలో సరిపడా ఉండేలా మీల్ ప్లాన్ చేసుకోవాలి. అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి. ఉదయం తినే అల్పాహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, మొలకలు లాంటి వాటిని సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు.

ద్రవాలూ ముఖ్యమే!

ఒళ్లు నొప్పులకు శరీరంలో నీటి శాతం తగ్గడం ఒక కారణం. కండర నొప్పులు తరచూ వేధిస్తున్నా, కండరాలు పట్టేస్తున్నా శరీరంలో నీరు తగ్గిందని అర్థం చేసుకుని సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులు లేనివాళ్లు రోజుకు కనీసం 3 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ఇది వేసవి కాలం కాబట్టి పండ్ల రసాలూ, కొబ్బరినీళ్లు, పలుచని మజ్జిగ కూడా తీసుకోవచ్చు. సబ్జా నీళ్లు ఆరోగ్యకరం. శరీరాన్ని చల్లబరిచే నిమ్మరసం, క్యారట్, బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ ఉండాలి. శీతల పానీయాలు, చక్కెర కలిసి ఉండే పౌడర్ ఆధారిత పానీయాలు, సిరప్స్ దాహార్తిని తీర్చకపోగా, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.



సరిపడా విశ్రాంతి

కంటి నిండా నిద్ర, సరిపడా విశ్రాంతి కూడా అవసరమే! చలాకీగా, చురుగ్గా కదలడానికి సరిపడా ఓపిక శరీరానికి దక్కాలంటే, మధ్యాహ్నం వేళ ఒక అరగంట పాటు కునుకు తీస్తూ ఉండాలి. దాంతో కండరాలు శక్తిని పుంజుకుంటాయి. 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవడం వల్ల శరీర బడలిక వదిలి, కొత్త శక్తిని పుంజుకుంటుంది. కాబట్టి నిద్రకు భంగం కలిగించే అంశాలకు దూరంగా ఉంటూ, కంటి నిండా నిద్రపోవాలి.

ఎముకల పటుత్వం ఇలా సాధ్యం

పైబడే వయసులో ఎముకల పటుత్వం క్షీణించడం సహజం. అలా జరగకుండా నియంత్రించాలంటే పోషకాహారంతో పాటు కొన్ని అదనపు సప్లిమెంట్లు కూడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **క్యాల్షియం:** అరవై ఏళ్లు పైబడిన స్త్రీపురుషులు క్యాల్షియం సమృద్ధిగా దొరికే పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, డ్రై సీడ్స్, బాదం, పిస్తా తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియం దక్కే వీలు లేని సందర్భాల్లో వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడుకోవచ్చు.
- **విటమిన్ డి:** ఎముకల దృఢత్వానికి డి విటమిన్ అవసరం. ఆహారం ద్వారా దొరికే అవకాశం లేని డి విటమిన్‌ను పొందడం కోసం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు ఎండలో గడపడం అవసరం. సాధ్యపడని సందర్భాల్లో వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- **వ్యాయామాలు:** నడక, పరుగు, బరువులెత్తడం, సైక్లింగ్ శరీరం మీద బరువు పడేలా చేసే వ్యాయామాలన్నీ ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. నడి వయసులో తుంటి ఎముకలు తేలికగా విరిగిపోతూ ఉండడానికి కారణం ఎముకలు గుల్లబారడమే! ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే మరీ ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.
- **ఇవి వద్దు:** ఆల్కహాల్, చక్కెర, కాఫీలు ఎముకల సాంద్రతను తగ్గిస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం ఎముకలకు హానికరం. కాబట్టి ఈ అలవాటు ఉన్నవాళ్లు నడవయసుకు చేరుకున్న తర్వాత పూర్తిగా మానేయాలి.
- **ఆరోగ్య పరీక్షలు:** 55 ఏళ్లు దాటిన మహిళలు, 65 ఏళ్లు దాటిన పురుషులు ప్రతి మూడేళ్లకోసారి ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో ఎముకల సాంద్రతను అంచనా వేస్తూ, అప్రమత్తం అవుతూ ఉండాలి. ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో గుర్తించినప్పుడు వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. వ్యాయామాలు మొదలుపెట్టాలి.

జీవనశైలి వ్యాధులు రాకుండా....

45 ఏళ్లు దాటిన వాళ్లలో అధిక రక్తపోటు, మధుమేహాలు సర్వసాధారణమైపోతున్న కాలమిది. ఇలాంటి జీవనశైలి వ్యాధులు దాడి చేయకుండా ఉండాలంటే...

- వయసు పైబడేకొద్దీ కణాల్లో జరిగే ఆక్సిడేషన్ డ్యామేజీ వల్ల కేన్సర్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా దొరికే తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న పదార్థాలు, ప్యాకేజ్డ్ ఫుడ్, చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం మానేయాలి.
- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని వదలించుకోవాలి. ఇంటి పట్టున ఉండేవాళ్లు నచ్చిన ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవాలి. మెదడును చురుగ్గా ఉంచే ఇండోర్ గేమ్స్, శరీరాన్ని చురుగ్గా ఉంచే ఔట్‌డోర్ గేమ్స్ ఆడుతూ ఉండాలి.
- **వైద్య పరీక్షలు:** అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలున్నవాళ్లు క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. సంబంధిత వైద్య నిపుణులను కూడా సంప్రతిస్తూ ఉండాలి. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. గుండెజబ్బు, మధుమేహం ఉన్నవాళ్లు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షలతో ప్రారంభంలోనే సమస్యను గుర్తించే వీలుంటుంది.

డాక్టర్ వేద ప్రకాష్. జి
సీనియర్ కన్సల్టెంట్,
ఆర్థోపెడిక్ సర్జన్ అండ్
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



సైకాలజీ

ఇదీ ఓ కారణమే!

కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణమవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యనుబట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహరణకు....

- సోషల్ యాంగ్జయిటీ, ప్యానిక్ అటాక్స్, డిప్రెషన్: మానసికంగా కుంగిపోయినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.



- డిప్రెషన్, యాంగ్జయిటీ: పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసికి ఇబ్బందులు సమసిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్: సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి.

ఆయుర్వేదం

మెదడు చురుకుగా...

జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గడానికి కారణం పోషకాహార లోపం, మెదడులో తయారయ్యే రసాయనాలలో అసమతౌల్యమే ప్రధాన కారణాలని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మార్పులు సహజసిద్ధంగా శరీరంలో జనించవచ్చు, లేదా మందుల ప్రభావం వల్ల కూడా తలెత్తవచ్చు. కఫ దోషం వల్లే జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుందని ఆయుర్వేదం నమ్ముతోంది. ఈ దోషం ఫలితంగా మెదడు పనితీరు మందగించి, ఆలోచనల్లో అస్పష్టత చోటుచేసుకుంటుంది. కాబట్టి జ్ఞాపకశక్తి పెరగాలంటే వాత, కఫ దోషాలను సమతులం చేయాలి. వాత, కఫ దోషాల సమ్మేళనం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. పిత్త దోషం మెదడు చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఈ దోషాలన్నీ సమతులం కావాలంటే ఆహారవ్యవహారాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి.



- **ఆహారం:** దోష తత్వం ఆధారంగా ఆహారశైలిని అనుసరించాలని ఆయుర్వేదం సూచిస్తున్నా, మరీ ముఖ్యంగా జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ఆహారనియమాలు పాటించవలసి ఉంటుందని కూడా ఆయుర్వేదం సూచిస్తోంది. అవేంటంటే...
- సులువుగా అరిగే, ఒంట్లోని విషాలను హరించే ఆహారంతో శరీరంలో కఫ సంబంధ అవరోధాలు తొలగి, వాత మార్గాలు తెరుచుకుంటాయి. అలాగే ఇలాంటి ఆహారం పిత్త పనితీరును పెంచి, తత్ఫలితంగా జ్ఞాపకశక్తినీ, తెలివితేటలనూ పెంచుతుంది.
- కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, నెయ్యి, నారింజ, క్యారెట్లు, నట్స్‌లతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.
- జున్ను తినకూడదు. మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- జ్ఞాపకశక్తి, తెలివితేటలను పెంచే వాత, పిత్త, కఫ దోషాల మధ్య సమతులం సాధించాలంటే బెల్లం లేదా తేనెలకు దీర్ఘకాలం పాటు ఆహారంలో చోటు కల్పించాలి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

గుడ్ ఫుడ్

మెంతులు మేలు!

మెంతులను నిల్వ పచ్చళ్లలో తప్ప వంటకాలలో పెద్దగా ఉపయోగించం. కానీ పిల్లలకు పాలిచ్చే తల్లులకు మెంతులు మేలు చేస్తాయి. పాల ఉత్పత్తిని పెంచి, పసికందుకు పాల కొరత తీరుస్తాయి.

పిల్లలకు పాలిచ్చే తల్లుల ఆహారంలో మెంతులను చేర్చడం మన దేశ ఆనవాయితీ. ఉత్తర భారతదేశంలో మెంతి లడ్డు, దక్షిణాదిన పొడులు, ముద్దల రూపంలో వాడుతూ ఉంటారు. ఈ సంప్రదాయం వెనక సైన్స్ దాగి ఉంది. ప్రసవించిన మహిళలకు మెంతులు ఎంతో ఉపయోగకరం. వారిలో పాల ఉత్పత్తిని పెంచుతాయని జంతువులు, మనుషుల మీద జరిపిన పలు పరిశోధనల్లో రుజువైంది. 'గ్యాలెక్టగోగ్' అనే పాల ఉత్పత్తికి తోడ్పడే మూలిక లేదా ఔషధంగా మెంతులను వర్గీకరించారు. ఈ విత్తనాల్లో ఉండే 'డయాస్జెనిన్' పాల ఉత్పత్తి జరిగే మామరీ గ్రంథులలోని కణజాలం పెరుగుదలకు, తోడ్పడుతుంది. ఫలితంగా పాలు త్వరితంగా, ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇందుకోసం రోజుకు 10 విత్తనాలు తీసుకుంటే సరిపోతుంది.



రోజుకు ఒకటి లేదా రెండు మెంతి లడ్లను పాలిచ్చే తల్లులకు తినిపించవచ్చు. వీటికి బెల్లం, శొంఠి, డ్రై ఫ్రూట్స్, నెయ్యి జోడించాలి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మెంతి పొడికి, పసుపు, శొంఠి, బెల్లం, ఇతర మూలికలు చేర్చి ఉడికించి, హల్వా ఉండగా చేసి పరగడుపున తినిపించడం ఆనవాయితీ. ఒకవేళ బరువు పెరగకుండా మెంతుల మేలు అందుకోవాలనుకుంటే, మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవచ్చు. ప్రత్యామ్నాయంగా మెంతులను పొడి చేసి, తేనె లేదా గోరువెచ్చని నీళ్లతో కలిపి తీసుకోవచ్చు. అయితే గర్భిణులు మెంతులకు దూరంగా ఉండాలి. గ్యాలెక్టగోగ్ కోవకు చెందిన మెంతుల్లో యుటెరోటోనిక్ ఏజెంట్ ఉంటుంది. ఇది కండరాల సంకోచవ్యాకోచాలకు కారణమవుతుంది. కాబట్టి గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుంది.

కెగెల్ ఎక్సర్‌సైజెస్

నడుము దృఢంగా!

కొన్ని వ్యాయామాలు అంతర్గత జీవక్రియలు, వ్యవస్థల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దైనందిన జీవితానికి ఇబ్బంది పెట్టే స్వల్ప సమస్యలనూ పరిష్కరిస్తాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'కటి వ్యాయామాలు'!

కటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలు స్త్రీపురుషులు ఇద్దరికీ ఉపయోకరమే! కటి ప్రదేశంలోని కండరాలు బలపడే ఈ వ్యాయామాలు చేయడం వల్ల మూత్ర వ్యవస్థకు సంబంధించిన కొన్ని సమస్యలు దూరమవుతాయి. మరీ ముఖ్యంగా తుమ్మినా, దగ్గినా మూత్రం లీక్ అయిపోయే ఇబ్బంది తొలుగుతుంది. స్త్రీలలో ప్రసవానంతరం తలెత్తే ఈ రకం సమస్య కటి వ్యాయామాలతో అదుపులోకి వస్తుంది. ఈ వ్యాయామాలను అమెరికాకు చెందిన స్త్రీల వైద్యులు 'అర్నాల్డ్ కెగెల్' కనుగొన్నారు కాబట్టి వీటికి 'కెగెల్ ఎక్సర్‌సైజెస్' అనే పేరొచ్చింది.

కెగెల్ వ్యాయామాలు అంటే?

ఈ వ్యాయామాలనే 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు అని కూడా అంటారు. కటిలోని కండరాలను బిగదీసి, వదిలే ఈ వ్యాయామాలు రోజు మొత్తంలో ఎన్ని సార్లైనా చేయవచ్చు. సరైన ఫలితం దక్కడం కోసం కనీసం 3 నెలల పాటు వ్యాయామాలు చేయాలి. తేలికగా ఉండే ఈ వ్యాయామాలను రోజులో ఏ సమయంలోనైనా చేయవచ్చు. కూర్చున్నా, పడుకుని ఉన్నా కూడా ఈ వ్యాయామాలు చేయవచ్చు. తింటున్నప్పుడు, కుర్చీ మీద కూర్చుని పని చేసుకుంటూ, టివి చూస్తూ విరామంగా ఉన్నప్పుడు కూడా చేయవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు

- విసర్జక వ్యవస్థ అదుపులో ఉండేందుకు ఈ వ్యాయామాలను స్త్రీపురుషులు ఇద్దరూ చేయవచ్చు.
- శస్త్రచికిత్సల తదనంతరం కండరాలను బలోపేతం చేయడం కోసం ఈ వ్యాయామాలను అనుసరించాలి. ప్రోస్టేట్ సంబంధిత శస్త్రచికిత్సల తదనంతరం పురుషులు, పునరుత్పత్తి వ్యవస్థల సంబంధిత శస్త్రచికిత్సల అనంతరం స్త్రీలు ఈ వ్యాయామాలను చేయాలి.
- వృద్ధాప్యం మూలంగా బలహీనపడే కటి కండరాల బలోపేతానికి కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.
- ప్రసవం తదనంతరం మహిళలు ఈ వ్యాయామాలను క్రమం తప్పక చేస్తే పునరుత్పత్తి సంబంధిత అంతర్గత అవయవాలన్నీ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.
- మూత్రాశయం, దాని చుట్టుపక్కల కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. కాబట్టి చిన్న ఒత్తిడికే మూత్రం కారిపోయే పరిస్థితి ఉన్న స్త్రీపురుషులు ఈ వ్యాయామాలు ఎంచుకోవాలి.
- పొట్టలోని పేగులు పొత్తికడుపులోకి జారే సమస్య ఉన్నవారు కూడా ఈ వ్యాయామాలు చేయాలి.
- తెలియకుండా మలవిసర్జన జరిగిపోయే సమస్య ఉన్నవాళ్లకు కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.

ఇలా చేయాలి

ఈ వ్యాయామాలు చేసేటప్పుడు స్త్రీపురుషులు వేర్వేరు పద్ధతులు పాటించాలి.

- **సరైన కండరాలు:** మూత్రవిసర్జన చేయబోయి, ఆపుతున్నట్టు కండరాలను కదిలించడమే కెగెల్ ఎక్సర్‌సైజ్. మూత్రవిసర్జనతో సంబంధం ఉన్న కండరాలు బిగబట్టి, వదులు చేస్తూ ఉండాలి. అయితే సంబంధిత కండరాలేవో గ్రహించి, వాటిని మాత్రమే ఉపయోగించాలి. తర్వాత మూత్రవిసర్జన చేయడానికి వెళ్లినప్పుడు మూత్రవిసర్జనను మధ్యలో ఆపేయాలి. ఇలా చేస్తున్నప్పుడు ఏ కండరాలు మూత్రవిసర్జనను అదుపు చేస్తున్నాయో స్వయంగా గ్రహించగలుగుతారు. మహిళల్లో (యోని), మూత్రాశయం లోని కండరాలు బిగుసుకుని, పైకి లాగబడతాయి. ఈ కండరాలే మహిళలకు సంబంధించిన కటి కండరాలు. ఈ కండరాలే వ్యాయామం చేసే సమయంలోనూ బిగుసుకుంటూ ఉంటే వ్యాయామం సరిగా చేస్తున్నారని అర్థం. అలాగే తొడలు, పిరుదులు, పొత్తికడుపు కండరాలు ఈ వ్యాయామం చేసే సమయంలో విరామ స్థితిలో ఉండాలి.


వ్యాయామం ఇలా!

- మూత్రాశయం ఖాళీగా ఉంచాలి. పొట్టలో వాయువులు ఉండకూడదు.
- మీ సౌకర్యాన్ని బట్టి కూర్చుని లేదా పడుకుని వ్యాయామం చేయాలి.
- నెమ్మదిగా కటి కండరాలను బిగపట్టి, 10 అంకెలు లెక్కపెట్టి వదలాలి.
- వదిలిన తర్వాత మరో 12 అంకెలు లెక్కపెట్టి తిరిగి బిగపట్టాలి.
- వ్యాయామం చేస్తున్నంతసేపు, గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, శరీరాన్ని విశ్రాంత స్థితిలో ఉంచాలి. పొట్ట, తొడలు, ఛాతీ కండరాలు బిగదీయకూడదు. పొత్తికడుపు కండరాలు విశ్రాంతంగా ఉంచాలి.

ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా 4 నుంచి 6 వారాలపాటు చేయాలి. క్రమక్రమంగా కటికి సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. అయితే ఈ వ్యాయామాలను అవసరానికి మించి చేయడం వల్ల మల,మూత్రవిసర్జన సమయంలో కండరాల నొప్పులు మొదలవుతాయి.

గమనిక

- ఈ వ్యాయామాలను సరైన పద్ధతిలో చేయని మహిళలకు లైంగిక కలయిక సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.
- ఈ వ్యాయామాలను చేస్తూ, కొంతకాలం తర్వాత ఆపిన మహిళల్లో తిరిగి మూత్రం కారిపోయే సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ఎక్కువ కాలంపాటు ఈ వ్యాయామాలు చేయాలి.
- ఈ వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన చాలా కాలం తర్వాత మాత్రమే మూత్రం కారడం, మలవిసర్జన సమస్యలు అదుపులోకి వస్తాయి.




వైద్యులను కలవాలి

- ఈ వ్యాయామాలను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడం కోసం వైద్యులను కలవడం అవసరమే! వైద్యుల సూచనల మేరకు వ్యాయామాల మీద పట్టు సాధించి సాధన చేయడం ద్వారా కటి సంబంధ కండరాల బలహీనతతో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చు.

హెల్త్ వెల్త్

నోటి దుర్వాసన ఎందుకు?



నోటి దుర్వాసన కేవలం నోటి శుభ్రతా లోపం వల్లనే కాదు! మరెన్నో అంతర్గత రుగ్మతల ప్రధాన లక్షణం కూడా! ఉదర కేన్సర్ కూడా నోటి దుర్వాసన ద్వారానే బయల్పడుతుంది. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టి, చికిత్స తీసుకోవాలి.

- **చిగుళ్ల వ్యాధి:** పెరియోడాంటైటిస్, జింజివైటిస్ అనే ప్రధానమైన చిగుళ్ల వ్యాధుల్లో నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్యలు ఉన్నప్పుడు చిగుళ్లు వాచి, రక్తం, చీము కారుతూ ఉంటాయి. వ్యాధికారక బ్యాక్టీరియా చిగుళ్లలో తిష్ట వేయడమే ఇందుకు కారణం. ఈ లక్షణాలకు తోడు నోటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుంటే, చిగుళ్ల వ్యాధిగా భావించి దంత వైద్యులను సంప్రతించాలి.
- **ఎలర్జీలు:** గొంతులో దురద, ముక్కు దిబ్బెడ, కంటి నుంచి నీరు కారడం లాంటి ఎలర్జీలు ఉంటే వాటికి తోడు నోటి దుర్వాసన కూడా అనుభవంలోకి వస్తుంది. తెమడ చెడు సూక్ష్మక్రిములకు నెలవు. వాటి వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. అలాగే ఎలర్జీలు ఉన్నప్పుడు నోరు ఎండిపోతూ ఉంటుంది. దీని ఫలితంగా కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ దుర్వాసన వదలాలంటే తెమడ వదిలించుకుని, జలుబు, దగ్గులను మందులతో అదుపు చేసుకోవాలి.



క్రికెట్‌లో రాజకీయ పెత్తనం
ఆంధ్రకు ఆడలేను

ఏసీఏకు హనుమ విహారి గుడ్‌బై
ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్న క్రికెటర్

వాళ్లు చెప్పిన ఆటగాళ్లనే టోర్నీకి ఎంపిక చేయాలి.. వాళ్లు సూచించిన వారినే తుది జట్టులో ఆడించాలి.. లేదంటే పార్టీ నేతల నుంచి నేరుగా క్రికెట్ సంఘానికి ఫోన్లు రావడం.. వినకపోతే అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో ఒత్తిడి చేయించడం.. ఇదంతా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో కొన్నాళ్లుగా జరుగుతున్న వైసీపీ 'రాజకీయ'ం.

ఇప్పుడీ రాజకీయ క్రీడకు అంతర్జాతీయస్థాయి ఆటగాడిని బలి చేశారు. సర్వశక్తులూ ఒడ్డి తన సారథ్యంలో ఆంధ్ర జట్టుకు మరపురాని విజయాలందించిన టీమిండియా టెస్టు ఆటగాడు గాదె హనుమ విహారిని ఘోరంగా అవమానించారు. రాజకీయ పార్టీ నేత కుమారుడి కోసం అతడిని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి తమ వికృతమైన ఆటను ప్రదర్శించారు. ఇదంతా స్వయంగా విహారీనే వెల్లడించాడు. ఏపీ క్రికెట్‌లో నేతల జోక్యం ఎక్కువైందని మనస్తాపం వ్యక్తం చేసిన విహారి.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన చోట ఉండలేననీ, జన్మలో ఆంధ్రకు ఆడేది లేదని సంచలన ప్రకటన చేశాడు. క్రీడా సంఘాలకు రాజకీయ చీడపడితే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పేందుకు విహారి ఉదంతమే నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



హైదరాబాద్/విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో రాజకీయ పెత్తనం మరోసారి రచ్చకెక్కింది. రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు క్వార్టర్‌ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించిన హనుమ విహారి ఏసీఏలో జరుగుతున్న రాజకీయాలను బహిర్గతం చేశాడు. ఈ ఏడాది రంజీ సీజన్ మధ్యలోనే తాను ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో వెల్లడించాడు. రాజకీయ నేతల జోక్యంతోనే కెప్టెన్సీ నుంచి తప్పుకొన్నానని సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ పెట్టాడు. జట్టుకు సంబంధించిన విషయంలో ఓ రాజకీయ నేత కుమారుడైన ఆటగాడితో గొడవ జరిగినందుకు ఏసీఏ పెద్దలు తనపై వేటు వేశారని ఆరోపించాడు. ఇది తనను ఎంతో వేదనకు గురి చేసిందనీ, భవిష్యత్‌లో ఆంధ్ర జట్టుకు ఆడేదే లేదంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నాడు. 'ఈ రంజీ సీజన్‌లో జట్టు పరంగా మేమెంతో పోరాడాం. అయినా క్వార్టర్స్‌లో ఓడినందుకు బాధగా ఉంది. ఈ పోస్ట్ ద్వారా కొన్ని విషయాలను మీ ముందు పెడుతున్నా. రంజీల్లో బెంగాల్‌తో మ్యాచ్‌కు నేనే జట్టు కెప్టెన్‌గా ఉన్నా. ఆ సమయంలో జట్టులోని 17వ ఆటగాడిపై అరిచాను. దీంతో అతడు రాజకీయ నాయకుడైన తన తండ్రికి ఫిర్యాదు చేశాడు. నాపై చర్యలు తీసుకోవాలని ఆ రాజకీయ నేత ఏసీఏపై ఒత్తిడి చేశాడు. నా తప్పు లేకున్నా, కెప్టెన్‌గా వైదొలగమని సూచించారు. జట్టు కోసం ఎంతగానో పోరాడి, గాయం వేధిస్తున్నా బ్యాటింగ్ చేసి, ఆంధ్రను ఐదు సార్లు నాకౌట్ దశకు తీసుకెళ్లి నా అంకితభావాన్ని చాటుకున్నా. భారత జట్టు తరఫున 16 టెస్టులు ఆడా. అయినా నాకంటే అతడే వాళ్లకు ముఖ్యుడయ్యాడు. అసోసియేషన్ తీరుతో ఎంతో వేదనకు గురయ్యా. నా ఆత్మగౌరవం దెబ్బతినేలా అవమానించారు. అందుకే భవిష్యత్‌లో ఆంధ్రకు ఆడరాదని నిర్ణయం తీసుకున్నా' అని తన సుదీర్ఘమైన పోస్టులో విహారి ఆవేదన వ్యక్తం చేశాడు.

వైసీపీ నేత కుమారుడి వల్లే...

ఆంధ్ర రంజీ జట్టులో 17వ ఆటగాడిగా చేరిన చిత్తూరుకు చెందిన వైసీపీ నేత కే. నరసింహా చారి కుమారుడు పృథ్వీరాజ్ విషయంలో ఏర్పడిన స్వల్ప వివాదం విహారి జట్టు నుంచి వైదొలగడానికి కారణమైంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేటరైన నరసింహా చారి.. వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుడని సమాచారం. ఇక.. వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు హర్షిత్ రెడ్డి చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. వాస్తవానికి పృథ్వీని రంజీ జట్టుకు ఎంపిక చేయడంలోనూ రాజకీయ నేతల ప్రమేయముందన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, విహారి ఉదంతంపై ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో 'ఏసీఏలో మితిమీరుతున్న వైసీపీ పెత్తనం?' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. విశ్వసనీయ సమాచారం మేరకు.. గతనెల 5 నుంచి 8 వరకు విశాఖలో బెంగాల్‌తో జరిగిన రంజీ మ్యాచ్ సందర్భంగా ఈ వివాదం చోటు చేసుకుంది. టీ విరామ సమయంలో ఆ మ్యాచ్ కెప్టెన్ విహారి డ్రెస్సింగ్ రూమ్‌లో తోటి ఆటగాళ్లతో చర్చిస్తున్నాడు. నిబంధనల ప్రకారం జట్టులోని 15 మంది ఆటగాళ్లకు మాత్రమే డ్రెస్సి ంగ్ రూమ్‌లోకి ప్రవేశం ఉంటుంది. అయితే, 17వ ఆటగాడైన పృథ్వీ అక్కడ కనిపించడంతో మేనేజర్‌ను విహారి ప్రశ్నించాడు. ఈ విషయంలోనే విహారితో జరిగిన గొడవను అవమానంగా భావించిన పృథ్వీ.. తన తండ్రికి ఫోన్ చేశాడు. సదరు నేత చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం నుంచి ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డికి ఫోన్ చేయించి తన కుమారుడిని అవమానించిన విహారిపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశాడట. దీనిపై ఏసీఏ యాజమాన్యం కూడా తననే వివరణ అడగడంతో విహారి ఆవేదనకు గురయ్యాడు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడి ఎక్కువవడంతో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. తర్వాతి మ్యాచ్‌లకు జట్టు పగ్గాలను రికీ భుయ్‌కు అప్పగించారు.



పృథ్వీరాజ్

అంతా విజయసాయి కనుసన్నల్లోనే..

రాష్ట్రంలో క్రీడా సంఘాలను ఇప్పటికే తన గుప్పిట్లో ఉంచుకున్నాడన్న ఆరోపణలున్న వైసీపీ ముఖ్య నేత విజయసాయి రెడ్డి కనుసన్నల్లోనే ఏసీఏ నడుస్తోందని సమాచారం. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రా రెడ్డి విజయసాయికి సమీప బంధువు. లిక్కర్ స్కామ్‌లో అభియోగాలు ఎదుర్కొంటున్న శరత్‌చంద్రా రెడ్డి ఏసీఏ పదవికి అనర్హుడయ్యే అవకాశం ఉన్నందున తన సోదరుడు రోహిత్ రెడ్డిని ఉపాధ్యక్షునిగా నియమించుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. విజయసాయికి రోహిత్ రెడ్డి అల్లుడు కావడం గమనార్హం. ఇలా, ఏసీఏలో తన బంధుగణాన్ని ఏర్పరచుకున్న విజయసాయి ఆంధ్ర క్రికెట్ వ్యవహారాల్లోనూ తలదూర్చుతున్నాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిధులు అధికంగా ఉండే క్రీడా సంఘాలను ఎంచుకొని వాటిని వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. క్రీడల్లో వైసీపీ నేతల జోక్యంపై గత నవంబరులోనే 'క్రీడలపైనా కక్ష..!' అన్న పేరుతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే.

విహారికే ఆటగాళ్ల మద్దతు

ఈ వివాదంలో ఆంధ్ర జట్టు ఆటగాళ్లంతా హనుమ విహారికే మద్దతుగా నిలుస్తున్నారు. విహారినే కెప్టెన్‌గా కొనసాగించాలంటూ జట్టు సభ్యులంతా కలిసి సంతకాలు చేసిన లేఖను ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)కు అందించారు. సారథిగా విహారి ఉండడం జట్టుకు చాలా ముఖ్యమని ఆ లేఖలో ఆటగాళ్లు తెలిపారు. ఆటగాళ్లంతా విహారికే మద్దతిస్తున్నా, ఏసీఏ మాత్రం ఆ లేఖను పట్టించుకుంటున్నట్టు లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ విహారిని మళ్లీ జట్టులోకి తీసుకునే ప్రసక్తే లేదని ఏసీఏ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం.

ఇంతకుమించి ఏం పీకలేవు

విహారిపై పృథ్వీరాజ్ తీవ్ర వ్యాఖ్యలు

రాజకీయ నేత కుమారుడిపై అరిచినందుకే తనను కెప్టెన్సీ నుంచి తప్పించారంటూ విహారి చేసిన వ్యాఖ్యలపై సదరు నేత కుమారుడు, ఆటగాడు పృథ్వీరాజ్ స్పందించాడు. విహారి చెప్పిందంతా అబద్ధమని, అసభ్యకరంగా దూషించడాన్ని ఎవరూ అంగీకరించరనీ.. ఇంతకుమించి ఏం పీకలేవు అంటూ పృథ్వీరాజ్ తీవ్రవ్యాఖ్యలు చేశాడు. 'ఆరోజు ఏం జరిగిందో జట్టులోని ప్రతి ఒక్కరికీ తెలుసు. చాంపియన్ అని చెప్పుకునే నీవు ఇంతకుమించి ఏం పీకలేవు. కావాల్సిన విధంగా సింపథీ గేమ్స్ ఆడుకో' అని పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

ఆరోపణలు అవాస్తవం: ఏసీఏ

విహారి ఆరోపణలను ఏసీఏ ఖండించింది. బెంగాల్‌తో మ్యాచ్ సందర్భంగా అందరి ముందూ విహారి తనను వ్యక్తిగతంగా దూషించినట్టు సదరు ఆటగాడు తమకు ఫిర్యాదు చేశాడని ఏసీఏ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. జాతీయ జట్టుకు ఎంపికయ్యే అవకాశాలున్నందునే విహారిని కెప్టెన్సీ నుంచి తప్పించామని తెలిపింది.

ఏసీఏపై ఒత్తిడి తేలేదు

పృథ్వీరాజ్ తండ్రి నరసింహాచారి

తిరుపతి (ఆంధ్రజ్యోతి): విహారిని కెప్టెన్‌గా తొలగించాలంటూ ఏసీఏపై తాను ఎలాంటి ఒత్తిడీ తీసుకురాలేదని పృథ్వీరాజ్ తండ్రి, వైసీపీ కార్పొరేటర్ నరసింహాచారి అన్నారు. 'రంజీ జట్టుకు ఎంపికైనా కూడా రెండున్నర నెలలుగా నా కుమారుడిని ఆడించడంలేదు. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ పృథ్వీని మానసికంగా ఇబ్బంది పెట్టారు. విహారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు జట్టులో అస్సలు ఆడని నా కొడుకుపై అపవాదు వేయడం సరికాదు' అని నరసింహా చారి వివరించారు.

'బజ్‌బాల్'కు బీటలు

నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ విజయం
3-1తో సిరీస్ వశం ▪ గిల్, ధ్రువ్ అద్భుత పోరాటం



గిల్ (52 నాటౌట్) జురెల్ (39 నాటౌట్)



స్టోక్స్

రాంచీ: భారత్ దెబ్బకు.. ఇంగ్లండ్ 'బజ్‌బాల్' బీటలు వారింది. 84/0తో పటిష్ఠ దశ నుంచి 120/5తో కష్టాల్లోపడ్డప్పుడు.. కుర్రాళ్లు శుభ్‌మన్ గిల్ (52 నాటౌట్), ధ్రువ్ జురెల్ (39 నాటౌట్) మొక్కవోని పట్టుదలతో పోరాడారు. దీంతో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్ట్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకొంది. స్వదేశంలో టీమిండియాకిది వరుసగా 17వ సిరీస్ గెలుపు కావడం విశేషం. ఇంగ్లండ్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 40/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 192/5 స్కోరు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (55) అర్ధ శతకం సాధించగా.. జైస్వాల్ (37) పర్వాలేదనిపించాడు. బషీర్ 3 వికెట్లు తీశాడు. జురెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఐదవ, ఆఖరి టెస్ట్ వచ్చేనెల 7 నుంచి ధర్మశాలలో జరగనుంది.

ధాటిగా ఆరంభించి..: విజయానికి కావాల్సింది మరో 152 పరుగులే కావడంతో.. భారత గెలుపుపై ఎవరికీ ఎటువంటి అనుమానాల్లేవు. అందుకు తగ్గట్టుగా తొలి సెషన్‌ను రోహిత్, జైస్వాల్ ఆశావహంగానే ఆరంభించారు. అండర్సన్ బౌలింగ్‌లో హిట్‌మ్యాన్.. మిడాన్ మీదుగా చూడముచ్చటైన సిక్స్‌తో దాడికి దిగాడు. మరోవైపు జైస్వాల్.. బషీర్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లతో జోరు చూపాడు. దీంతో వీరి భాగస్వామ్యాన్ని విడదీయడానికి స్టోక్స్.. 18వ ఓవర్‌లో రూట్‌ను రంగంలోని దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టిన రూట్.. మూడో బంతికే జైస్వాల్‌ను అవుట్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రోహిత్‌ను హార్ట్‌లీ వెనక్కి పంపగా.. రజత్ పటీదార్ (0)ను బషీర్ డకౌట్ చేశాడు. కానీ, గిల్, జడేజా (33 బంతుల్లో 4) ఆచితూచి ఆడడంతో భారత్ 118/3తో లంచ్‌కు వెళ్లింది.

ఒడిదుడుకులకు లోనైనా..: రెండో సెషన్ ఆరంభంలో వెంటవెంటనే రెండు వికెట్లు చేజార్చుకొన్న టీమిండియా ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. కానీ, గిల్, జురెల్ ఆరో వికెట్‌కు 72 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. 39వ ఓవర్‌లో బషీర్ వేసిన ఫుల్‌టాస్ బంతిని జడేజా నేరుగా బెయిర్‌స్టో చేతుల్లోకి కొట్టాడు. ఆ తర్వాతి బంతికే సర్ఫరాజ్ (0)ను కూడా బషీర్ అవుట్ చేయడంతో.. టీమిండియా 120/5తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. ఈ దశలో గిల్, జురెల్.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ టీమ్‌ను లక్ష్యం దిశగా నడిపించారు. 31 బంతులు ఎదుర్కొన్న తర్వాత కానీ ధ్రువ్ తొలి బౌండ్రీ సాధించలేదు. మరోవైపు 119 బంతులాడి ఒక్క ఫోర్ కూడా కొట్టని గిల్.. గెలుపునకు 20 పరుగులు అవసరమైనప్పుడు బషీర్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లతో ఊపిరి పీల్చుకున్నాడు. ఆ తర్వాత జురెల్ ఫోర్, డబుల్‌తో జట్టుకు అద్వితీయమైన విజయాన్ని అందించాడు.

1

సొంతగడ్డపై వరుసగా అత్యధిక (17) టెస్ట్ సిరీస్‌లు నెగ్గిన జట్టుగా భారత్. 2013లో ఆస్ట్రేలియాపై విజయంతో టీమిండియా ఈ జైత్రయాత్రను ప్రారంభించింది. 1994-2000, 2004-2008 మధ్య ఆసీస్ వరుసగా పదేసి సిరీస్‌లు నెగ్గింది.

మెకల్లమ్, స్టోక్స్ హయాంలో 2022లో 'బజ్‌బాల్' ఆట తీరును ఎంచుకొన్న తర్వాత ఇంగ్లండ్ సిరీస్ కోల్పోవడం ఇదే తొలి సారి. అంతేకాకుండా వరుసగా మూడు టెస్ట్‌ల్లో ఓడడం కూడా ఇదే ప్రథమం.

స్కోరు బోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 307; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 145.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 55, జైస్వాల్ (సి) అండర్సన్ (బి) రూట్ 37, గిల్ (నాటౌట్) 52, రజత్ (సి) పోప్ (బి) బషీర్ 0, జడేజా (సి) బెయిర్‌స్టో (బి) బషీర్ 4, సర్ఫరాజ్ (సి) పోప్ (బి) బషీర్ 0, జురెల్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 61 ఓవర్లలో 192/5; వికెట్ల పతనం:** 1-84, 2-99, 3-100, 4-120, 5-120; **బౌలింగ్:** రూట్ 7-0-26-1, హార్ట్‌లీ 25-2-70-1, బషీర్ 26-4-79-3, అండర్సన్ 3-1-12-0.

దుమ్మురేపిన ఢిల్లీ

షఫాలీ, లానింగ్ హాఫ్ సెంచరీలు

దెబ్బతీసిన కాప్, రాధ.. యూపీ చిత్తు



మరిజన్నే కాప్ (3/5)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్.. డబ్ల్యూపీఎల్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. షఫాలీ వర్మ (64 నాటౌట్), మెగ్ లానింగ్ (51) అర్ధ శతకాలతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజన్నే కాప్ (3/5) విజృంభించడంతో.. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 119/9 స్కోరు చేసింది. శ్వేత షెహ్రావత్ (45) ఒంటరి పోరాటం చేసింది. రాధా యాదవ్ 4 వికెట్లు పడగొట్టింది. టాపార్డర్ బ్యాటర్లు బ్రిందా (0), తహిల మెక్‌గ్రాత్ (1), కెప్టెన్ అలిస్సా హీలీ (13)ను అవుట్ చేసిన కాప్.. యూపీని పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. ఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో 123/1 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు లానింగ్, షఫాలీ జట్టుకు ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. 12వ ఓవర్‌లో షఫాలీ అర్ధ శతకాన్ని పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. గెలుపునకు ఒక్క పరుగు కావాల్సి ఉండగా లానింగ్‌ను ఎకిల్‌స్టోన్ అవుట్ చేసినా.. జెమీమా (4 నాటౌట్) ఫోర్‌తో ముగించింది.

సంక్షిప్త స్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 119/9 (శ్వేత 45, గ్రేస్ హ్యారిస్ 17; రాధ 4/20, కాప్ 3/5); **ఢిల్లీ: 14.3 ఓవర్లలో 123/1** (షఫాలీ 64 నాటౌట్, లానింగ్ 51; ఎకిల్‌స్టోన్ 1/31).

ఉత్కంఠపోరులో ఆంధ్ర ఓటమి

ఇండోర్: ఉత్కంఠగా సాగిన రంజీ క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్ర 4 పరుగులతో మధ్యప్రదేశ్ చేతిలో ఓటమిపాలైంది. 169 పరుగుల ఛేదనలో ఆంధ్ర తడబడింది. ఓవర్‌నైట్ స్కోరు 95/4తో నాలుగోరోజు సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఏపీ జట్టులో విహారి (55) మినహా అంతా చేతులెత్తేశారు. దీంతో ఆంధ్ర 165 పరుగులకు కుప్పకూలింది. అనుభవ్ అగర్వాల్ 6 వికెట్లతో ఆంధ్ర జట్టు పతనాన్ని శాసించాడు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేసింది. మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 234, రెండో ఇన్నింగ్స్‌లో 107 రన్స్ సాధించింది. ఇక, బరోడాతో క్వార్టర్స్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 379 పరుగులతో ఆడుతున్న ముంబై ఆధిక్యం మొత్తమ్మీద 415కు చేరుకుంది. బరోడా రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కే దిగనుందున తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై సెమీస్ చేరడం దాదాపు ఖాయమే. విదర్భతో క్వార్టర్‌ఫైనల్లో గెలవాలంటే కర్ణాటక మరో 268 పరుగులు సాధించాల్సివుంది. 371 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక నాలుగోరోజు ఆట చివరికి వికెట్ నష్టానికి 103 పరుగులు చేసింది.

పీకేఎల్ సెమీస్‌కు స్టీలర్స్, పైరేట్స్

హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. సోమవారం ఇక్కడ జరిగిన ఎలిమినేటర్ 2 పోరులో స్టీలర్స్ 42-25తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఎలిమినేటర్ 1 మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37-35తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది.



రఘువంశీ నుంచి మైక్రో టర్బోజెట్ ఇంజన్

హైదరాబాద్: అంతరిక్షం, రక్షణ రంగానికి చెందిన హైదరాబాద్ కంపెనీ రఘువంశీ మెషీన్ టూల్స్ (ఆర్‌వీఎంటీ).. 'ఇంద్రా ఆర్‌వీ25: 240ఎన్' పేరుతో పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన మైక్రో టర్బోజెట్ ఇంజన్‌ను ఆవిష్కరించింది. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, రక్షణ శాఖ మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జీ సతీశ్ రెడ్డి సమక్షంలో దీన్ని సోమవారం విడుదల చేసింది. పూర్తిగా దేశీయంగా మైక్రో టర్బోజెట్ ఇంజన్ అభివృద్ధి చేసినందుకు గర్వంగా ఉందని.. ఏరోస్పేస్ ఆవిష్కరణలకు అంతర్జాతీయ హబ్‌గా ఎదిగేందుకు మనకున్న బుద్ధి కుశలత, కృతనిశ్చయానికిదే నిదర్శనమని ఆర్‌వీఎంటీ ఎండీ వంశీ వికాస్ అన్నారు.

ప్రావిడెన్స్‌లో మరో 2500 ఉద్యోగాలు

» హైదరాబాద్ కేంద్రం విస్తరణ

హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగానికి సేవలందించే ప్రావిడెన్స్ ఇండియా సోమవారం హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఆరోగ్య సంరక్షణ రంగం ముఖచిత్రాన్ని కృత్రిమ మేధ, కొత్త టెక్నాలజీలు పూర్తిగా మార్చివేస్తాయని ఆయన ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, దీని వల్ల ప్రజల ఆరోగ్య సమాచారం అంతా డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చి చికిత్సా విధానం సులభం అవుతుందని ఆయన తెలిపారు. వచ్చే రెండేళ్లలో నాలుగు కోట్ల మంది హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్టు చెప్పారు. రాయదుర్గంలో 9 అంతస్తుల భవనంలో ఏర్పాటు చేసిన ప్రావిడెన్స్ కొత్త సెంటర్ ప్రస్తుతం పని చేస్తున్న సెంటర్‌కు అదనంగా పని చేస్తుంది. ప్రస్తుతం తమ వద్ద 1400 మంది పని చేస్తుండగా వచ్చే రెండు, మూడు సంవత్సరాల కాలంలో వారి సంఖ్య 4000కి పెంచుకోవాలనుకుంటున్నట్టు కంపెనీ చీఫ్ గ్లోబల్ ఆఫీసర్, కంట్రీ హెడ్ మురళీకృష్ణ తెలిపారు. మరిన్ని ఆస్పత్రులతో భాగస్వామ్యాలు కుదుర్చుకోనున్నట్టు చెప్పారు.

బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్ భారీ పెట్టుబడి

హైదరాబాద్: గ్లోబల్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్ హైదరాబాద్‌లో అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంపై కంపెనీ 10 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ కేంద్రం ఇన్నోవేషన్ హబ్‌గా ఉంటుందంటూ ఈ భవనంలో 1500 మంది ఉద్యోగులు పని చేసే వసతి అందుబాటులో ఉందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్రిస్టఫర్ బోర్నర్ తెలిపారు. ఈ కొత్త కేంద్రం హైదరాబాద్‌లో ఔషధ అన్వేషణ రంగాన్ని వేగవంతం చేయడంతో పాటు తమ సామర్థ్యాలను పెంచుతుందని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న స్థానిక ప్రతిభను నియమించుకోవడం ద్వారా తమ సామర్థ్యాలు విస్తరించడం తమ లక్ష్యమని చెప్పారు.

పీపీబీఎల్ చైర్మన్ పదవికి విజయ్ శేఖర్ శర్మ రాజీనామా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) పార్ట్‌టైం నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవికి విజయ్ శేఖర్ శర్మ రాజీనామా చేశారు. అలాగే, బ్యాంక్ బోర్డునూ పునర్వ్యవస్థీకరించారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ శ్రీనివాస్ శ్రీధర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవేంద్రనాథ్ సారంగి, బ్యాంక్ ఆఫ్ బరోడా మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ కుమార్ గార్గ్, మాజీ ఐఏఎస్ అధికారి రజనీ సెఖ్రీ సిబల్‌తో కొత్త బోర్డు ఏర్పాటు చేసినట్లు వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. వీరంతా బోర్డులో ఈమధ్యనే స్వతంత్ర డైరెక్టర్లుగా చేరినట్లు తెలిపింది. విజయ్ శేఖర్ శర్మ వైదొలిగిన నేపథ్యంలో కొత్త చైర్మన్ నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు పీపీబీఎల్ విడిగా వెల్లడించింది. ఈనెల 29 తర్వాత నుంచి పీపీబీఎల్ తన ఖాతాదారుల అకౌంట్లు, వాలెట్ వంటి ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్స్‌లో డిపాజిట్లు, క్రెడిట్ లేదా టాప్-అప్ లావాదేవీలు నిర్వహించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. ఆ తర్వాత డెడ్‌లైన్‌ను మార్చి 15 వరకు పొడిగించింది.

పేటీఎంతో సలహా కమిటీ చర్చలు

వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌తో టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌పై తమ సలహా కమిటీ చర్చిస్తున్నదని కమిటీ అధ్యక్షుడు, సెబీ మాజీ చైర్మన్ ఎం దామోదరన్ తెలిపారు. పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో నియంత్రణ నియమావళి పాటించే విషయంలో కంపెనీని బలోపేతం చేసేందుకు వన్97 కమ్యూనికేషన్స్ ఈ సలహా కమిటీని ఏర్పాటు చేసింది.

అప్పర్ సర్క్యూట్‌ను తాకిన షేరు

సోమవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. 5 శాతం లాభంతో రూ.427.95కు చేరుకుంది. 'ఎట్ పేటీఎం' యూపీఐ హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న పీపీబీఎల్ కస్టమర్లను ఇతర బ్యాంక్‌లకు బదిలీ చేసే అవకాశాలను పరిశీలించాలని ఎన్‌పీసీఐని రిజర్వ్ బ్యాంక్ కోరిన నేపథ్యంలో కంపెనీ షేర్లు పుంజుకున్నాయి.

నేటి నుంచి ఆంధ్రా సిమెంట్స్ ఓఎఫ్‌ఎస్

హైదరాబాద్: ఆంధ్రా సిమెంట్స్ కంపెనీ మంగళ, బుధవారాల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా కంపెనీ ఈక్విటీలో ఐదు శాతం వాటాను విక్రయిస్తోంది. ఇందుకోసం రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరు ఫ్లోరు ధరను రూ.80 ప్రీమియంతో రూ.90గా నిర్ణయించింది. దివాలా ప్రక్రియలో ఉన్న జైపీ గ్రూపునకు చెందిన ఈ కంపెనీని జనవరిలో సాగర్ సిమెంట్స్ కొనుగోలు చేసింది. ఇపుడు సాగర్ సిమెంట్స్ కంపెనీ ఈక్విటీలో ఐదు శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తోంది.

టాటా గ్రూప్ నుంచి మెగా ఐపీఓ!

టాటా గ్రూప్ మరో మెగా ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ టాటా పాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ (టీపీఈఎంఎల్) 100 కోట్ల డాలర్ల నుంచి 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,300 కోట్ల నుంచి రూ.16,500 కోట్లు) ఐపీఓ జారీ చేయబోతున్నట్టు సమాచారం. అయితే ఈ మెగా ఐపీఓకు ఒకటి రెండేళ్ల సమయం పడుతుందని భావిస్తున్నారు. ఈవీ కార్ల మార్కెట్‌లో టీపీఈఎంఎల్ తయారు చేసే పంచ్ ఈవీ, టియాగో ఈవీలకు ప్రస్తుతం మార్కెట్‌లో 70 శాతం వాటా ఉంది. మరో రెండేళ్లలో కొత్తగా 10 ఈవీ కార్లను మార్కెట్‌లో విడుదల చేయడం ద్వారా వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష ఈవీ కార్ల లక్ష్యాన్ని చేరుకోవాలని యోచిస్తోంది.

లాభాల స్వీకారంతో కుంగిన మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. లాభాల స్వీకరణ అమ్మకాలతో సెన్సెక్స్ 352.67 పాయింట్ల నష్టంతో 72,790.13 వద్ద, నిఫ్టీ 90.65 పాయింట్ల నష్టంతో 22,122.05 వద్ద ముగిశాయి. ఐటీ, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్ గూడ్స్ కంపెనీల షేర్లు ఎక్కువగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 26 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి.

బైజూస్ తనిఖీ వేగవంతం

» అధికారులకు కార్పొరేట్ శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ: సంక్షోభంలోకి జారుకున్న ఎడ్యుటెక్ స్టార్టప్ బైజూస్ పద్దుల తనిఖీని వేగంతం చేసి, త్వరగా నివేదికను సమర్పించాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించిం ది. ప్రాంతీయ కార్యాలయం సమర్పించనున్న నివేదిక ఆధారంగా మంత్రిత్వ శాఖ సంస్థపై తదుపరి చర్యలు చేపట్టనుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బైజూస్ బ్రాండ్ యాజమాన్య సంస్థ థింక్ అండ్ లర్న్ పద్దుల్లో తనిఖీలు చేపట్టాలని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయాన్ని కార్పొరేట్ వ్యవహారాల శాఖ 2023 జూలైలో కోరింది. అయితే, ఏ కోణంలో తనిఖీలకు ఆదేశించిందన్న వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది. గత ఏడాది నుంచే బైజూస్‌లో లుకలుకలు మొదలయ్యాయి. కంపెనీ వార్షిక నివేదికలను సమర్పించడంలో తీవ్ర జాప్యం చేయడం, ఆడిటర్ల రాజీనామా నేపథ్యంలో కంపెనీలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు మంత్రిత్వ శాఖ తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీలో అధికారుల తనిఖీ కొనసాగుతోందని.. వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, పత్రాల కోసం అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటున్నట్లు బైజూస్ ప్రతినిధి తెలిపారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నామని, వారు కోరిన అన్ని పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

బిజినెస్

ఒకటి ఐదుగా..

కెనరా బ్యాంక్ షేర్ల విభజనకు బోర్డు ఆమోదం

ముంబై: ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ షేర్లను 1:5 నిష్పత్తిలో విభజిస్తున్నట్లు ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును ఒక్కోటి రూ.2 ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించనుంది. సోమవారం సమావేశమైన బ్యాంక్ బోర్డు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మార్కెట్లో బ్యాంక్ షేర్ల లభ్యతను పెంచడంతోపాటు చిన్న మదుపరులకు సైతం ధర అందుబాటులో ఉండేందుకే షేర్లను విభజిస్తున్నట్లు కెనరాబ్యాంక్ తెలిపింది. ఇందుకు ఆర్‌బీఐ అనుమతి తెలుపాల్సి ఉంటుందని, విభజన ప్రక్రియ పూర్తికి 2-3 నెలలు పట్టవచ్చని బ్యాంక్ వెల్లడించింది. బీఎస్ఈలో బ్యాంక్ షేరు ధర 1.24 శాతం నష్టపోయి రూ.572.80 వద్ద ముగిసింది.

సుభాష్ చంద్ర సహకరించడం లేదు: సెబీ

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ రూ.2,000 కోట్ల దారి మళ్లింపు కేసులో కంపెనీ గౌరవ చైర్మన్ సుభాష్ చంద్ర తమకు సహకరించడం లేదని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు (శాట్) సెబీ ఫిర్యాదు చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,840 ▲	57,600 ▲	76,400 ▲
ముంబై	62,220 ▲	57,000 ▲	69,450 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ		విజయవాడ	475
హైదరాబాద్	500	విశాఖపట్నం	500
27వ తేదీ		వరంగల్	502
చిత్తూరు	568		
గోదావరి	475	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

పులివెందులకు నీళ్లివ్వలేవు కానీ కుప్పంకు తెచ్చానని షో చేస్తావా..!

- దేశంలోనే మోడల్ నియోజకవర్గాన్ని నాశనం చేయాలని చూశావ్
- కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం ఏది?: బాబు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పులివెందులకు నీళ్ల ఇవ్వలేని జగన్ కుప్పంకు నీళ్ల తెచ్చానని షో చేశాడని టీడీపీ అధినేత చంద్రబాబు ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ.. 'కుప్పంలో అభివృద్ధి ముద్ర తెలుగుదేశానిది అయితే వైసీపీది రక్తపు మరక. దేశంలోనే కుప్పం ఒక మోడల్ నియోజకవర్గం. జగన్ దాన్ని నాశనం చేయాలని చూశారు. జగన్ సీఎం అయ్యాకనే ప్రశాంతమైన కుప్పంలో హింసా రాజకీయాలు, సహజ వనరుల దోపిడీ మొదలైంది. కుప్పంకు 672 కి.మీ. నుంచి కృష్ణా జలాలు తానే తెచ్చినట్లు చెప్పడం జగన్ అబద్ధాలకు పరాకాష్ఠ. 13 శాతం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తికి ఐదేళ్లు తీసుకున్న జగన్... తానో అపర భగీరథుడిని అనేలా డైలాగులు కొడుతున్నారు. ఎన్నికల ముందు డ్రామాలు చేస్తున్నారు. కాలువలో చెంబుడు నీళ్ల పెట్టి ఫొటోలు దిగేందుకు పడిన ప్రయాసతో జగన్ నవ్వుల పాలయ్యాడు. సాగునీటి రంగంపై జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. సొంత జిల్లాలో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే బాధితులను ఆదుకోని జగన్ కుప్పంను ఉద్ధరిస్తాడా? ఇప్పుడు రిజర్వాయర్లు కడతాను అని చెప్తున్న జగన్ ప్రాజెక్టులు కట్టి నీళ్లిస్తానంటే ప్రజలు నమ్ముతారా..? వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగానికి చేసిన ద్రోహానికి ఆ పార్టీకి సీమ ప్రజలే సమాధి కట్టబోతున్నారు. సొంత జిల్లాలో ఇసుక మాఫియాకు అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 42 మంది ప్రాణాలు కోల్పోయారు. పింఛా ప్రాజెక్టు దెబ్బతింది. అన్నమయ్య డ్యాం బాధితులకు జగన్ ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. బాబాయ్ వివేకా హత్య విషయంలో అయిదేళ్లుగా సమాధానం చెప్పలేని జగన్ హత్యా రాజకీయాల గురించి కుప్పం వెళ్లి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. టీడీపీ-జనసేన పొత్తుతో జగన్‌కు వణుకు, భయం మొదలయ్యాయి' అని చంద్రబాబు అన్నారు.

తెలుగు ప్రజల విజయం కోసమే ఈ పొత్తు: నాదెండ్ల

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు తెలుగు ప్రజల ఇబ్బందులను తొలగించి రాష్ట్రంలో సుభిక్ష పాలన అందించేందుకు నాందిగా ఈ నెల 28న నిర్వహించే సభకు 'తెలుగుజన విజయకేతనం జెండా' అని నామకరణం చేశామని జనసేన పీఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడులో ఈ నెల 28న నిర్వహించే టీడీపీ-జనసేన ఉమ్మడి సభా వేదిక వద్ద ఏర్పాట్లు సమీక్షించి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ సభలో భవిష్యత్ కార్యాచరణపై ఉపన్యాసాలు ఉంటాయి. రాష్ట్రంలో సుభిక్ష పాలన అందించేందుకే మేం కలిసి పనిచేస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తాం. జగన్ ప్రభుత్వ అరాచకానికి చరమగీతం పాడేందుకు ఈ సభ నాంది పలుకుతుంది' అని మనోహర్ తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. 'తాడేపల్లిగూడెంలో నిర్వహించే సభ కోసం రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఐదేళ్లుగా ఇబ్బందిపడుతున్న అన్ని వర్గాల వారికి ఈ సభ భరోసా ఇస్తుంది' అని అన్నారు.

రాష్ట్రంలో అరాచకం

- ఐదేళ్లలో అన్ని రంగాల్లోనూ వైఫల్యం: సత్యకుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో అరాచక పరిస్థితి నెలకొందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఆరోపించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో ఇటీవల వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ఐదేళ్లలో అన్ని రంగాలలో జగన్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన తరుణంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. హామీలు నెరవేర్చమని అడిగితే భౌతిక దాడులకు పాల్పడడం, అభివృద్ధి గురించి అడిగితే అవాకులు, చెవాకులు పేలడం, అసభ్యపదజాలం వాడడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. రంగిశెట్టి రామకృష్ణ ప్రజాపోరు పేరుతో చేస్తున్న కార్యక్రమంలో ప్రధాని మోదీ గురించి, అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటే వైసీపీ ఎంపీటీసీ వెంకటప్పారెడ్డి, జయభారత్‌రెడ్డి తదితరులు రౌడీమూకలను ఉసిగొల్పి అసభ్యపదజాలంతో దూషించి, వాహనంపై నుంచి కిందకు లాగి రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. బీజేపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి కోరినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. కేసు నమోదు చేయకపోతే పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని, అప్పటికీ పోలీసులు దిగిరాకపోతే ముఖ్యమంత్రి ఇంటిని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు.

'సిద్ధం' మెటీరియల్ మాకొద్దు..!

- లారీ వచ్చినా తీసుకోని కందుకూరు వైసీపీ నేతలు
- నేడు సీఎం జగన్‌ను కలవనున్న పెంచలయ్య

కందుకూరు, ఫిబ్రవరి 26: వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సిద్ధం బహిరంగసభ ప్రచార మెటీరియల్ తీసుకునేందుకు కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులెవరూ ముందుకురాలేదు. సోమవారం ఆ పార్టీ సిద్ధం సభ ప్రచార మెటీరియల్‌తో వచ్చిన లారీ, ఇక్కడ వాటిని తీసుకునే నాయకులెవరూ ముందుకు రాకపోవడంతో వెనక్కు వెళ్లిపోయింది. కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కఠారి అరవిందను వైసీపీ అధిష్ఠానం నియమించగా.. నేటివరకు ఆమె ఇక్కడ అడుగుపెట్టలేదు. ఈ తరుణంలో సోమవారం వచ్చిన ప్రచార సామగ్రి లారీ ఆ పార్టీకి చెందిన సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి కార్యాలయం వద్దకు చేరుకుంది. మెటీరియల్ దించుకునేందుకు కార్యాలయ సిబ్బంది విముఖత చూపారు. ఆ తర్వాత ఇతర నాయకులను ఎవరిని సంప్రదించినా లాభం లేకపోవడంతో మెటీరియల్‌తో సహా లారీని వెనక్కుతీసుకెళ్లారు. కాగా కఠారి అరవింద తండ్రి వంకి పెంచలయ్య మంగళవారం సీఎం జగన్మోహనరెడ్డిని కలవనున్నట్టు తెలిసింది. తన కుమార్తె పోటీచేసేందుకు ఇబ్బందులు ఉన్నాయని, తనకు అవకాశం ఇస్తే పోటీచేస్తానని చెప్పేందుకే ఆయన సీఎం జగన్ వద్దకు వెళ్తున్నట్టు సమాచారం. అయితే ఆయన అరవిందను కూడా వెంటబెట్టుకుని వెళ్లి పరిస్థితిని సీఎంకు వివరించనున్నట్టు తెలిసింది.

ఎమ్మెల్యే కిలారికి లీగల్ నోటీస్

- క్షమాపణ చెప్పి.. రూ.కోటి చెల్లించాలి: ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 26: గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య(వైసీపీ)కు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమవారం లీగల్ నోటీస్ పంపించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన సందర్భంలో నరేంద్ర కుమార్ కాపు సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వెల్లలూరు గ్రామంలో జరిగిన సభలో కిలారి రోశయ్య ఆరోపించారు. దీంతో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ నరేంద్ర న్యాయవాది ద్వారా ఆయనకు పరువు నష్టం నోటీసును పంపించారు. అవాస్తవాలతో కాపు కులస్తుల మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కిలారి ప్రయత్నించారని నోటీస్‌లో పేర్కొన్నారు. వారం రోజుల్లో బహిరంగ క్షమాపణ ప్రకటించి, కోటి రూపాయలు నష్టపరిహారంగా చెల్లించని పక్షంలో కోర్టులో కేసు దాఖలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో హెచ్చరించారు.

కడప సుబ్బారెడ్డి ఈ భూమి నాదన్నాడు!

- ఎవడ్రా నువ్వు.. ..మీద తంతానన్నా.. మంత్రి ధర్మాన వ్యాఖ్యలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): "కడప సుబ్బారెడ్డి.. శ్రీకాకుళంలో ఈ భూమి నాదన్నాడు. గు... మీద తంతానన్నా" అంటూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన ఓ సభలో మంత్రి ధర్మాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "శ్రీకాకుళంలో పది ఇళ్లుంటే అందులో అత్యధికం ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారే. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉండాలి. నేను ఎప్పుడూ బలహీన వర్గాల వారి వైపే ఉన్నా. ఆ మధ్య కడప సుబ్బారెడ్డి వచ్చి.. ఈ భూమి నాదేనన్నాడు. ఎవడ్రా నువ్వు? ..మీద తంతానన్నా. ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేయనని సీఎంకు చెప్పేశా. నేనో.. పార్టీ పనులు చూడడంతోపాటు పోటీ కూడా చేయాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. తప్పనిసరై అంగీకరించా. ఈ పరిస్థితుల్లో పోటీ చేస్తున్నా. నాకు కూడా శత్రువులు ఎక్కువగా ఉన్నారు. బలహీనులవైపు ఉంటా.. నిజాయితీగల అధికారులను తెచ్చుకుంటా" అని అన్నారు. అయితే, కడప సుబ్బారెడ్డి భూమి ఆక్రమణకు పాల్పడితే.. తంతానన్నానని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రే వెల్లడించడం చర్చనీయాంశమైంది. ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలు వైసీపీ నేతల భూకబ్జాలకు నిదర్శనమని టీడీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.




హంద్రీ నీవా కాలువపై బటన్ నొక్కి, నీటిని విడుదల చేస్తున్న సీఎం జగన్,

జగన్ ప్రసంగం సమయంలో వెళ్లిపోతున్న జనం



కుప్పానికి ఎన్నికల నీళ్లు!

- బాబు కంటే ఎక్కువ చేశానని సీఎం గొప్పలు

శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చామని గొప్పలు చెప్పుకొనేందుకు ముఖ్యమంత్రి జగన్ విఫలయత్నం చేశారు. విభజిత రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చాక కృష్ణాజలాలను హంద్రీనీవా ద్వారా కుప్పం నియోజకవర్గానికి తేవాలని టీడీపీ అధినేత చంద్రబాబు భావించారు. 2016లో కుప్పం బ్రాంచి కెనాల్ పనులను ప్రారంభించారు. 2019 నాటికి 80 శాతానికిపైగా పనులను పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మిగిలిన పనుల్ని పట్టించుకోనే లేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుప్పం నియోజకవర్గంలోని తొలి మండలమైన రామకుప్పం వరకు అతి కష్టం మీద నీళ్లను లిఫ్టు చేసుకుంటూ తెచ్చారు. జగన్ దానినే సోమవారం ప్రారంభించి.. ఆ ఘనతను జంకూగొంకూ లేకుండా తన ఖాతాలో వేసేసుకున్నారు. బ్రాంచి కెనాల్ అసలు లక్ష్యం మాత్రం తెలివిగా విస్మరించారు. ఈ కెనాల్‌ను కుప్పం నియోజకవర్గంలోని 110 చెరువుల్ని నింపి సాగునీటితో పాటు ప్రజలకు తాగునీటిని అందించేలా ప్లాన్ చేశారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న నీళ్లతో ఆ లక్ష్యం నెరవేరదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుప్పానికి నీళ్లిచ్చామని ఆర్భాటం చేయడానికి సోమవారం కుప్పంలో జగన్ పర్యటించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలను వదిలారు. అనంతరం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. "35 ఏళ్లుగా సొంత నియోజకవర్గం కుప్పానికి చంద్రబాబు చేసిన దానికంటే ఎక్కువగా 58 నెలల్లో నేను చేసి చూపించాను. కృష్ణాజలాలను కుప్పానికి తేవడంలో చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేయలేదు. అందుకే కుప్పానికి నేను నీళ్ల తెచ్చాను. రూ.500 కోట్లతో ఇక్కడ రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశాం. వచ్చే ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే వాటి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. చంద్రబాబుకు కుప్పానికి ఎమ్మెల్యే రాష్ట్రానికి సీఎం అయ్యే అర్హత లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఇంటికీ కిలో బంగారం, బెంజ్ కారు ఇస్తానని రంగురంగుల మేనిఫెస్టోతో మోసం చేసేందుకు సిద్ధమయ్యారు" అని విమర్శించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో, 14 ఏళ్ల సీఎం అనుభవంలో ఏదైనా మంచి చేసి ఉంటే, ఇప్పుడు పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏముందన్నారు. సభలో జగన్ సుమారు గంట సేపు మాట్లాడారు. ప్రసంగమంతా కుప్పం నియోజకవర్గంలో అమ్మఒడి, ఆసరా, చేయూత, ఇంటి పట్టాలు, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల అమలైన తీరు గురించే సాగింది. దీంతో హాజరైన వారిలో ఉత్సాహం కనిపించలేదు. ఎప్పటిలాగే.. కుప్పం వైసీపీ ఇన్‌చార్జి భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తానని చెప్పారు. ప్రసంగం చివర్లో ఎప్పటిలాగే చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ సీఎం ప్రసంగమంతా ఎన్నికల ప్రచారం తరహాలోనే సాగింది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పథకాలు, పెన్షన్లు ఇస్తున్నామని చెప్పుకున్నారు. టికెట్లను కోల్పోయిన చిత్తూరు, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, ఎంఎస్ బాబు సభకు హాజరుకాలేదు.

జనం సహనానికి జగన్ పరీక్ష

జగన్ సభకు చిత్తూరు జిల్లా నుంచే కాకుండా తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా జనాల్ని తరలించారు. ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు బస్సులను ముందే స్వాధీనం చేసుకున్నారు. దీంతో జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు సోమవారం పనిచేయలేదు. ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సభలో ప్రజలు ఆయన ప్రసంగాన్ని వినేందుకు ఆసక్తి చూపలేదు. ఎంతమంది ఎన్ని కోట్లు లబ్ధి పొందారో జగన్ సుదీర్ఘంగా వివరించడంతో ప్రజలు విసుగుచెందారు. వేదిక మీదున్న నాయకులు కూడా సెల్‌ఫోన్లు చూసుకుంటూ గడిపేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు చేసేదేమీలేక కూర్చున్నా, స్థానిక ప్రజలంతా బారికేడ్లు, పరదాలు, ముళ్ల చెట్లు దాటుకుని తప్పించుకుని వెళ్లిపోయారు. రామకుప్పంలో నీళ్లను వదిలిన చోట, శాంతిపురంలో సభ నిర్వహించిన చోట మద్యం ఏరులై పారింది.

ఆదినేపల్లె వద్ద ఆగిన నీళ్లు

లిఫ్ట్‌కు నీళ్లందకపోవడంతో పంపింగ్ ఆపివేత

రామకుప్పానికి నీరందించేందుకు అష్టకష్టాలు

వి.కోట, ఫిబ్రవరి 26: హంద్రీనీవా జలాలను కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా రామకుప్పానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసిన 2గంటల్లోనే కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. వి.కోట మండలం ఆదినేపల్లె వద్ద లిఫ్ట్‌కు నీరందకపోడంతో అధికారులు పంప్‌హౌస్ వద్ద పంపులను ఆపేశారు. దీంతో రాజుపేట వద్ద జగన్ నీటిని కిందకు విడుదల చేశాక కాల్వ ద్వారా నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఇదేంటని చూసేందుకు వెళ్లిన రైతులకు లిఫ్ట్ ద్వారా వచ్చే నీరు ఆగిపోవడం కనిపించింది. సీఎం అట్టహాసంగా కుప్పానికి నీరందించామనడంతో ఎంతో ఆనందపడ్డామని, తీరా కాల్వలో చూస్తే నీరు రాకపోవడంతో ఇది ఎన్నికల కోసం చేసిన హంగామాగా తేటతెల్లమైందని నివ్వెరపోయారు. పుంగనూరు నుంచి పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మీదుగా రామకుప్పానికి వచ్చిన జలాలు ఎక్కడా చెరువులకు వదలకపోవడంతో ఈ మాత్రమైనా చేరుకున్నాయి. అదే చెరువులకు నీరు నింపిఉన్నట్లైతే నీరు కుప్పానికి చేరేది కాదని అధికారులు గుసగుసలాడుతున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కుప్పానికి నీరందించామని చెప్పుకొనేందు వైసీపీ పెద్దలు తాపత్రయపడ్డారే తప్ప, చెరువులు నింపి నీటి కొరత తీర్చే ప్రయత్నం చేయలేదని స్థానిక రైతులు ప్రభుత్వ తీరును నిరసిస్తున్నారు. మొత్తానికి ఇరిగేషన్ అధికారులు రెండు నెలలు పడ్డ కష్టం రెండు గంటల్లోనే ఆవిరి కావడంతో అధికారులు అసంతృప్తికి లోనయ్యారు.

వైసీపీ శ్రేణులతో నేడు జగన్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం వైసీపీ శ్రేణులతో సమావేశం కానున్నారు. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని కీలక నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు 2 వేల మంది వరకు హాజరవుతారని వైసీపీ వర్గాలు తెలిపాయి. రెండోసారి పార్టీ విజయం సాధించడం అత్యావసరమని.. గెలిపించే బాధ్యత కేవలం అభ్యర్థులదే కాదని.. ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఇందుకు సంపూర్ణంగా సహకరించాలని జగన్ విజ్ఞప్తి చేస్తారని పేర్కొన్నాయి. వారి భవిష్యత్ తాను చూసుకుంటానని భరోసా కూడా ఇస్తారని తెలిపాయి. తాడేపల్లిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం జరుగనుంది. సిటింగ్ ఎమ్మెల్యేలు, వైసీపీ ఇన్‌చార్జులు కూడా పాల్గొననున్నారు.

మరో బరితెగింపు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి వైసీపీ మూకల యత్నం

- సీఎం కుప్పం సభలో జనం పారిపోతున్న ఫొటోలు తీస్తున్నారనే!
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన శివకుమార్
- వారి ముందే కెమేరా లాక్కుని ఫొటోలు డిలీట్ చేసిన వైసీపీ శ్రేణులు

చిత్తూరు, అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు కిరాతకంగా చేసిన దాడిని మరువకముందే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో మరో ఘటన చోటు చేసుకుంది. సోమవారం శాంతిపురంలో సీఎం జగన్ బహిరంగ సభ ఫొటోలు తీస్తున్న చిత్తూరు 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడికి వైసీపీ మూకలు ప్రయత్నించాయి. సభలో జగన్ ప్రసంగిస్తుండగా చాలామంది జనం బారికేడ్లు, పరదాలు దాటుకుని పరారవుతున్న దృశ్యాలను శివకుమార్ ఫొటోలు తీశారు. ముళ్ల చెట్లున్నా లెక్క చేయకుండా పలువురు ఆపసోపాలు పడి సభ నుంచి వెళ్లిపోతున్న ఫొటోలను తీస్తుండగా.. సుమారు 20 మంది వైసీపీ కార్యకర్తలు ఆయన్ను చుట్టుముట్టి దాడికి ప్రయత్నించారు. శివకుమార్ యుక్తితో సమీపంలో ఉన్న పోలీసుల వద్దకు వెళ్లిపోయారు. అయితే అక్కడ పోలీసుల సమక్షంలోనే వైసీపీ శ్రేణులు శివకుమార్ కెమెరా లాక్కుని ఫొటోలను డిలీట్ చేసేశారు. శివకుమార్ అక్కడి నుంచి తప్పించుకుని ఏదో వాహనమెక్కి సురక్షితంగా చిత్తూరు చేరుకున్నారు. ఈ ఘటనపై జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి. మీడియాపై వైసీపీ శ్రేణులు వరుసగా చేస్తున్న దాడులు బాధాకరమని, వీటిని అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని.. తమకు రక్షణ లేకుండా పోయిందని.. చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

ఓటమి భయంతోనే అరాచకాలు: అచ్చెన్న

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివపై దాడిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో ఖండించారు. ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం ఇలాంటి అరాచకాలకు తెగబడుతోందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పత్రికలకు, జర్నలిస్టులకు, మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ఆఖరుకు పోలీసులు కూడా అధికారపార్టీకి కొమ్ము కాస్తూ వైసీపీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారన్నారు.

అద్దె హెలికాప్టర్ తీసుకోవద్దు

సీఎస్‌కు అచ్చెన్న లేఖ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఎన్నికల ప్రచారం కోసం రెండు హెలికాప్టర్లను అద్దెకు తీసుకోవడాన్ని నిలుపుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఒక్కో హెలికాప్టర్‌కు నెలకు రూ.1.92 కోట్ల చొప్పున రెండింటికి రూ.3.84 కోట్లు ఖర్చు ప్రజాధనం వృథా చేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని, అధికారంలో ఉన్న ఆపద్ధర్మ ప్రభుత్వం దానిని నిబద్ధతతో అమలు పరచాలన్నారు. ఈ నేపథ్యంలో రెండు హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోవాలని జీఓలు జారీ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు.

చెల్లినని కూడా చూడకుండా..!

(మొదటి పేజీ తరువాయి)

కొన్న ఒక సైన్యాన్ని పెట్టి సోషల్ మీడియాతో ఇష్టం వచ్చినట్లు నా గురించి, తన భర్త గురించి, మా దగ్గర ఉన్న వ్యక్తుల గురించి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. 3,200 కిలో మీటర్లు పాదయాత్ర చేసి వైసీపీని నిలబెట్టింది ఈ చెల్లి కాదా? 'బై బై బాబు' అంటూ ప్రచారం చేసి చంద్రబాబును గద్దెదించింది ఈ చెల్లెలు కాదా? ఒకప్పుడు సమైక్యాంధ్ర ఉద్యమం చేసింది కూడా ఈ చెల్లెలే కదా! దేవుడు చూస్తున్నాడు. తాను భయపడేదాన్ని కాదు. నేను వైఎస్ బిడ్డను, నాలో ఉన్నది వైఎస్ రక్తం. పులి కడుపున పులేపుడుతుంది. నా గుండెల్లో నిజాయితీ ఉంది. పుట్టింటి వాళ్ల కోసం ఏపీ రాజకీయాల్లోకి అడుగు పెట్టా. ఏ పార్టీలో అయినా చేరే హక్కు ఎవరికైనా ఉంది. కాంగ్రెస్‌లో చేరానని నన్ను తిట్టిపోస్తారా? ఆంధ్రా ప్రజల హక్కులు నెరవేరే వరకు రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా నేను ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదు" అని అన్నారు. అనంతపురం జిల్లాలో పీసీసీ చీఫ్ షర్మిల నేతృత్వంలో సోమవారం సాయంత్రం 'న్యాయ సాధన సభ' నిర్వహించారు. ఈ సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. మాట తప్పిన.. మడమ తిప్పిన జగనన్న వైఎస్ వారసుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. "వైఎస్సార్ ఆశయాల సాధన కోసం పోరాడుతున్న నేనే నిజమైన వారసురాలిని" అని తేల్చి చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా రాజశేఖర్‌రెడ్డి పనిచేశారని, అలాంటి రాజశేఖర్‌రెడ్డి కుమారుడై ఉండి బీజేపీకి బానిసగా పనిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాలు అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నాయని, ఏపీ మాత్రం జగన్ పాలనలో పాతిక సంవత్సరాలు వెనుకబడి పోయిందని దుయ్యబట్టారు. ఏపీకి బీజేపీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదని షర్మిల అన్నారు. హక్కుల సాధన కోసం పోరాటం చేయలేదని, జగన్, చంద్రబాబు స్వప్రయోజనాల కోసమే మోదీకి రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారని మండిపడ్డారు. "ఒక్క రాజధాని కట్టలేని జగనన్న.. మూడు రాజధానులు కడతానని అన్నారు. ఒక్క రాజధానినైనా నిర్మించారా?. ఇది సిగ్గు చేటు కాదా? బీజేపీతో అక్రమ పొత్తులు ఎందుకు పెట్టుకున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి" అని జగన్‌ను డిమాండ్ చేశారు. జగన్ పాలనలో వ్యవసాయం అధ్వానంగా మారిందని, అప్పులేని రైతు లేడని, ఏ పంట చూసినా మద్దతు ధర లేదని, పంటనష్టపోతే పరిహారమైనా ఉందా అని ప్రశ్నించారు. వైఎస్ ఆశయాలు నిలబెట్టలేని జగనన్న ఆయనకు వారసుడు ఎలా అవుతారో సమాధానం చెప్పాలని నిలదీశారు.



అనంతపురంలో జరిగిన సభకు హాజరైన జనానికి షర్మిల అభివాదం

కుంభకర్ణుడిలా నిద్రపోయి..

"2019 ఎన్నికలకు ముందు మెనిఫెస్టోలో 2.30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ కేలెండర్ విడుదల చేస్తానన్నారు. 23 వేల టీచర్ ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ఇస్తానన్నారు. ఐదేళ్లు కుంభకర్ణుడిలా నిద్రపోయి.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆరు వేల పోస్టులతో దగా డీఎస్సీ పెట్టారు. ఇది ప్రజలను దగా చేసినట్లు కాదా?" అని సీఎం జగన్‌పైషర్మిల విరుచుకుపడ్డారు. దగా డీఎస్సీపై నిరసన వ్యక్తం చేస్తూ సెక్రటేరియట్‌కు వెళ్తున్న తనను మహిళ అని చూడకుండా జగన్ సర్కార్ గాయపరచి, ఈడ్చుకెళ్లి స్టేషన్‌లో వేసిందని అన్నారు. "ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేని మీరా వైఎస్ వారసులు. రాజశేఖర్‌రెడ్డి 54 ప్రాజెక్టులు తీసుకొచ్చారు. వాటిలో ఆయన హయాంలో 12 ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఆగిపోయిన 42 ప్రాజెక్టులను పూర్తి చేస్తానని జగనన్న హామీ ఇచ్చారు. ఇప్పటి దాకా ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారు?" అని షర్మిల నిలదీశారు.

జగనే మద్యం అమ్ముతున్నాడు!

"మద్య నిషేధం చేయకపోతే ఓట్లే అడగనని 2019 ఎన్నికలకు ముందు జగన్ చెప్పారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? నాసిరకం మద్యం విక్రయాల కారణంగా, మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో 25 శాతం మంది ఎక్కువగా లివర్ పాడై చనిపోతున్నారు" అని షర్మిల అన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నగదుకు మద్యం ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు. "మీరు కట్టాల్సిన స్టేట్, సెంట్రల్ ట్యాక్స్ కడుతున్నారో లేదో లెక్క ఎక్కడుంది? తప్పుల మీద తప్పులు చేస్తుంటే పుట్టింటి వారి హక్కుల కోసం కాంగ్రెస్‌లో చేరి కొట్లాడుతున్నా" అని అన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. అందుకే అనంతపురం జిల్లా నుంచే ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించామని అన్నారు.

పేద కుటుంబానికి నెలకు 5 వేలు!

- ఏపీలో అధికారంలోకి రాగానే అమలు
- ఇది కాంగ్రెస్ గ్యారెంటీ: ఖర్గే

అనంతపురం ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏపీలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికీ నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఇది కాంగ్రెస్ గ్యారెంటీ అని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హామీ ఇచ్చారు. అనంతపురంలో సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "పోరాడుదాం.. సాధిద్దాం.. నిర్మిద్దాం.. నినాదంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పునరంకితమైంది" అని తెలిపారు. ఇప్పటికే అధికారంలో ఉన్న కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, సీఎం జగన్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. "వారు మోదీకి జీ హుజూర్ అంటున్నారు. అందుకే మోదీకి అహంకారం పెరిగింది. ప్రతి దానికీ నేను.. నేను అంటున్నారు. 'నేను' అనేవాడు కావాలో.. 'మనం' అనే కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించాలి" అని పిలుపునిచ్చారు. ఏపీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇండియా కూటమికి మద్దతివ్వాలని కోరారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలు, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ఏపీకి హక్కులు ఇచ్చిందని, పదేళ్లుగా ఢిల్లీ నుంచి ఒక్కపైసా ఇవ్వలేదని విమర్శించారు. "మీ హక్కులను సాధించిపెట్టడమే కాంగ్రెస్ అజెండా" అని ఖర్గే తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, పోలవరం పూర్తి చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు పైసా నిధులు ఇవ్వకుండా.. తడిగుడ్డతో గొంతుకోస్తున్న మోదీకి ఊడిగం చేస్తున్నారెందుకని జగన్ సహా ఇతర పార్టీల నేతలపై ఖర్గే మండిపడ్డారు. సభలో మాణిక్కం ఠాగూర్, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, పల్లంరాజు, జేడీ శీలం, బాపిరాజు, గిడుగు రుద్రరాజు, శైలజానాథ్, సుంకర పద్మశ్రీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్, టీడీపీ నేతలు

టీడీపీలో చేరిన ఎమ్మెల్యే పార్థసారథి

- భవకుమార్, తుమ్మల చంద్రశేఖర్ కూడా

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి యాదవ్ సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనను రెండు రోజుల క్రితమే నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆయనకు పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. ఆయనతో పాటు విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ కూడా టీడీపీలో చేరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీలో చేరడానికి ముందుకొచ్చిన వీరిని లోకేశ్ అభినందించారు. వీరితోపాటు ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కంకిపాడు ఎంపీపీ నెరసు రాజ్యలక్ష్మి, కంకిపాడు వైఎస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మాదలి రామచంద్రరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోయ ప్రసాద్, సీతారాంపురం సర్పంచి లింగమనేని సత్యవేణి, తాడిగడప మాజీ ఎంపీటీసీ పోలవరపు బొబ్బి, విజయవాడ తూర్పు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తుపాకుల మహేశ్, సీనియర్ నేత పుప్పాల వెంకట సుబ్బారావు, పలువురు విజయవాడ నగర నేతలు టీడీపీలో చేరారు. కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల టీడీపీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణ, గన్ని వీరాంజనేయులు, నెట్టెం రఘురాం, పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

తంబళ్లపల్లి తమ్ముళ్ల నిరసన

మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కు టికెట్ నిరాకరించడంపై అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సోమవారం చంద్రబాబు నివాసం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ స్థానానికి దాసరిపల్లి జయచంద్రారెడ్డిని అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. దీనికి నిరసనగా శంకర్ యాదవ్ అనుచర వర్గం ఏడెనిమిది బస్సుల్లో తరలివచ్చారు. కొంతమంది పెట్రోలు సీసాలు పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేస్తామని బెదిరించడంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వారికి నచ్చజెప్పారు. అదే సమయానికి ఎమ్మెల్యే పార్థసారథి టీడీపీలో చేరుతున్న సందర్భంగా ఆయన అనుచరులు కూడా పెద్దసంఖ్యలో రావడంతో చంద్రబాబు నివాసం బయట ఉన్న ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తంబళ్లపల్లి నుంచి వచ్చినవారిలో నలుగురైదుగురు ముఖ్యులతో యువనేత లోకేశ్ మాట్లాడారు. టికెట్ ఇచ్చిన వ్యక్తి ఎవరో పార్టీలో ఎవరికీ తెలియదని, శంకర్ యాదవ్‌కే మళ్లీ టికెట్ ఇవ్వాలని వారంతా కోరారు. 'పార్టీలో నేతలంతా సమానమే. విజయావకాశాలు ఉన్నవారిని అభ్యర్థులుగా ఎంపిక చేస్తున్నాం. ఈసారి తంబళ్లపల్లి సీటు గెలుచుకోవాలని పార్టీ పట్టుదలగా ఉంది. మీరంతా సహకరించండి. శంకర్‌కు ఇతరత్రా మంచి అవకాశాలు ఇస్తాం' అని ఆయన నచ్చజెప్పారు.

జనసేనలో కొత్తపల్లి



అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న కొత్తపల్లి సుబ్బారాయుడు.. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు హయాంలో విద్యుత్ మంత్రిగా పని చేశారు. 1989, 94, 99, 2004ల్లో టీడీపీ తరఫున నరసాపురం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1996లో నరసాపురం లోక్‌సభ స్థానంలో గెలిచారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలోనూ కీలకంగా పని చేశారు. చిరంజీవి వెంట కాంగ్రెస్‌లో చేరారు. 2012లో జరిగిన నరసాపురం అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. 2014లో వైసీపీలో చేరి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం మళ్లీ టీడీపీలోకి వచ్చారు.. తిరిగి వైసీపీలో చేరి.. ఇటీవల జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు.



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకువెళుతున్న వైద్యులు

41 ఏళ్ల వ్యక్తికి 28 ఏళ్ల యువకుడి గుండె

- శ్రీకాకుళం నుంచి తిరుపతికి గుండె తరలింపు
- శ్రీకాకుళం నుంచి హెలికాప్టర్.. అక్కడి నుంచి విమానంలో.. గ్రీన్‌చానల్ ద్వారా తిరుపతిలోని శ్రీపద్మావతి ఆస్పత్రికి!

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26: బ్రెయిన్ డెడ్‌కు గురైన 28 ఏళ్ల శ్రీకాకుళం యువకుడి గుండెను ప్రత్యేక విమానంలో తిరుపతి తీసుకొచ్చి 41 ఏళ్ల వ్యక్తికి అమర్చే ప్రక్రియను తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు చేపట్టారు. శ్రీకాకుళానికి చెందిన ధర్మారావు(28) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురై, అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని ఆస్పత్రిలోని వైద్యులు నిర్ధారించి, ఆయన కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. విషయం తెలుసుకున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రత్యేక వైద్య బృందంతో శ్రీకాకుళం చేరుకున్నారు. అక్కడ ధర్మారావు నుంచి గుండెను సేకరించి, దానిని ప్రత్యేక హెలికాప్టర్‌లో విశాఖపట్నం తీసుకొచ్చారు. అక్కడి నుంచి రాత్రి 10.02 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి తీసుకొచ్చారు. విమానాశ్రయం నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్సులో రాత్రి 10.20 గంటలకు హృదయాలయానికి తీసుకొచ్చారు. ఈ గుండెను విశాఖపట్నంకు చెందిన శ్రీధర్(41) అనే వ్యక్తికి అమర్చనున్నట్లు వైద్యులు తెలిపారు. శ్రీధర్ కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతూ 15 రోజులుగా హృదయాలయంలో చికిత్స పొందుతున్నాడు. గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు సుమారు ఆరు గంటలు పడుతుందని వైద్యులు తెలిపారు.

28న పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 16వ విడత సొమ్మును ఈనెల 28న జమ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ కంప్యూటర్‌లో బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. ఒక్కో రైతుకు రూ.2 వేలు చొప్పున జమ కానున్నాయి. పీఎం కిసాన్ లబ్ధి కోసం రైతులు ఈ-కేవీసీ విధిగా నమోదు చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఓటీపీ ఆధారిత ఈ-కేవైసీ నమోదుకు అవకాశం కల్పించింది. పీఎం కిసాన్‌ను అనుసంధానం చేసుకున్న ఏపీ ప్రభుత్వం... రైతు భరోసా మూడో కిస్తీ ఎప్పుడు చెల్లిస్తుందో ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

48 కోడిగుడ్లు @ రూ.48 వేలు!

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): 48 కోడిగుడ్ల కోసం ఆశపడితే రూ.48 వేలు పోగొట్టుకున్న ఉదంతం ఇది. ఆన్‌లైన్ మోసాల్లో ఇదో సరికొత్త మోసం. కేవలం రూ.49 చెల్లిస్తే 48 కోడిగుడ్లు ఇస్తామంటూ ఓ మెయిల్ వచ్చింది. ఆ మెయిల్ లింక్‌ను క్లిక్ చేసిన కాసేపటికే బ్యాంకు ఖాతా నుంచి రూ.48,199 గల్లంతయ్యాయి. బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వసంతనగర్‌కు చెందిన మహిళ మెయిల్‌కు ఈనెల 17న ఆన్‌లైన్ కంపెనీ నుంచి సందేశం వచ్చింది. అందులో రూ.49కే 48 గుడ్లు వస్తాయంటూ ఒక ఆఫర్ కనిపించింది. డెలివరీ అడ్రసుతోపాటు మొబైల్ నంబరు, ఇతర వివరాలను ఇవ్వాలని, పేమెంట్ ఆప్షన్‌లో క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాలని అందులో సూచించారు. అందుకు అనుగుణంగానే క్రెడిట్‌కార్డు వివరాలు పొందుపరచి ఓటీపీ నంబర్ నమోదు చేసి రూ.49 చెల్లించారు. కొన్ని క్షణాలలోనే మహిళ బ్యాంకు ఖాతా నుంచి రూ.48,199 డ్రా అయినట్లు సందేశం వచ్చింది. వెంటనే తేరుకున్న ఆమె బ్యాంకుకు సమాచారం ఇచ్చి క్రెడిట్‌కార్డు లావాదేవీలను వెంటనే నిలిపివేయించారు. ఆ వెంటనే హైగ్రౌండ్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

జూన్ నుంచి మూడోస్సారి..!

బీజేపీకి 370 లోక్‌సభ స్థానాలు ఖాయం.. ఎన్డీయేకి 400 పైనే.. మోదీ ధీమా

- 2 వేల రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వీటి విలువ రూ.41 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: లోక్‌సభ ఎన్నికల అనంతరం వచ్చే జూన్ నుంచి తన ప్రభుత్వం వరుసగా మూడోసారి కూడా కొలువు తీరుతుందని ప్రధాని మోదీ అన్నారు. దేశం నాడిని తాను పసిగట్టగలనని.. 543 స్థానాల లోక్‌సభలో బీజేపీ సొంతంగా 370 సీట్లు సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయేకి 400కిపైగా స్థానాలు వస్తాయన్నారు. దేశవ్యాప్తంగా రూ.41 వేల కోట్ల విలువ చేసే 2 వేల రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన సోమవారం ఇక్కడి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చాక చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని.. వెయ్యేళ్ల భారతానికి పునాదులు వేస్తామని ప్రధాని ప్రకటించారు. గత పదేళ్లుగా నవభారత నిర్మాణాన్ని ప్రజలు తిలకిస్తున్నారని.. వందే భారత్ రైళ్ల ప్రారంభం సహా రైల్వే శాఖ రూపురేఖలే మారిపోయాయని.. శరవేగంతో ప్రాజెక్టులు నిర్మించడం అందరినీ విస్మయపరుస్తోందని తెలిపారు. యువత కలలను నెరవేర్చడమే తన సంకల్పమన్నారు. 'భారత్ ఇప్పుడు పెద్ద పెద్ద కలలు కంటోంది. తన కలలు నెరవేర్చుకోవడానికి రాత్రింబగళ్లూ శ్రమిస్తోంది. యువత కలలు.. కఠోర కృషి.. నా సంకల్పం.. వికసిత భారతానికి ఇదే గ్యారెంటీ' అని స్పష్టం చేశారు. గత రెండ్రోజుల్లో జమ్ము, గుజరాత్‌లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 12 ఐఐటీలు, ఐఐఎంలు, ఐదు ఎయిమ్స్‌లు జాతికి అంకితం చేశానన్నారు. రైల్వే శాఖ పూర్తిగా పరివర్తన చెందుతోంది. స్కూళ్లు కాలేజీల్లో చదివేవారికి, 35 ఏళ్ల లోపు వయస్కులకు ఇది లబ్ధి చేకూరుస్తుంది' అని చెప్పారు. 27 రాష్ట్రాలు, 300 జిల్లాల్లోని 554 రైల్వే స్టేషన్లను అమృత భారత్ స్టేషన్లుగా మలిచేందుకు ఆయన శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన పలు రైల్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జిలను ప్రారంభించారు. '2047: వికసిత్ భారత్ కీ రైల్వే' థీమ్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా చేపట్టిన పోటీల్లో పాల్గొన్న యువతను ఆయన అభినందించారు. 'ప్రజాధనం దోపిడీని నా ప్రభుత్వం అరికట్టింది, ప్రతి పైసాను రైల్వే సేవల విస్తరణకు ఉపయోగిస్తున్నాం. భారతీయ రైల్వే గతంలో రాజకీయాలకు బలైంది. ఇప్పుడు సౌకర్యవంతమైన ప్రయాణానికి, ఉపాధి కల్పనకు అతిపెద్ద వనరుగా మారింది. రాబోయే అమృత్ భారత్ స్టేషన్లు భారతీయ సంస్కృతికి, అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తాయి' అని తెలిపారు. కాగా.. ఈ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్టేషన్లలో ఫుట్-ఓవర్ బ్రిడ్జిలు, విశాల విశ్రాంతిస్థలాలు, రిసెప్షన్లు ఉంటాయి.



'భారత్ టెక్స్'లో చేనేత పనిని గమనిస్తున్న ప్రధాని మోదీ

'మధ్య తరగతి'లో జోక్యం ఇష్టపడను

ప్రభుత్వం అనేది ఎప్పుడూ పేద ప్రజల పక్షాన ఉండాలని.. మరీ ముఖ్యంగా మధ్య తరగతి వారి జీవనంలో జోక్యం చేసుకోవడం తనకు ఇష్టం ఉండదని ప్రధాని మోదీ అన్నారు. సర్కారు ప్రమేయం అత్యంత తక్కువ స్థాయిలో ఉండే సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని.. పదేళ్లుగా ఆ దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో భారత్ టెక్స్-24ను ఆయన ప్రారంభించారు. దేశంలోనే అతి పెద్దదైన ఈ టెక్స్‌టైల్ ప్రదర్శన నాలుగు రోజులు కొనసాగనుంది. వందకు పైగా దేశాలకు చెందిన 3 వేల మంది కొనుగోలుదారులు, 3,500 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వస్త్ర పరిశ్రమ రంగం అత్యంత కీలకమైనదని, దీనిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'కస్తూరి కాటన్' ప్రపంచ మార్కెట్లో భారత బ్రాండ్‌గా నిలిచిపోతుందన్నారు.

కోటి సలహాలతో బీజేపీ మ్యానిఫెస్టో

ప్రజల నుంచి కనీసం ఒక కోటి సలహాలు తీసుకొని ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందు కోసం 'వికసిత్ భారత్ మోదీ కీ గ్యారెంటీ' పేరుతో వీడియో వ్యాన్లను దేశ వ్యాప్తంగా ప్రజల వద్దకు పంపనుంది. ఈ వ్యాన్లను సోమవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు .నడ్డా జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ 'సంకల్ప్ పత్ర్ (మేనిఫెస్టో) కోసం దేశ వ్యాప్తంగా సలహాలు స్వీకరిస్తామని చెప్పారు.



జామా మసీదు షాహీ ఇమాం వారసుడిగా షాబాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీలోని ప్రఖ్యాత జామా మసీదు నిర్వహణ బాధ్యతలు చూసే షాహీ ఇమాం సయ్యద్ అహ్మద్ బుఖారీ తన వారసుడ్ని ప్రకటించారు. తన కుమారుడైన సయ్యద్ షాబాన్ బుఖారీ (29)కి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. తన మరణం తరువాత జామా మసీదుకు 14వ షాహీ ఇమాంగా వ్యవహరిస్తారని ప్రకటించారు. వారసత్వ ప్రకటనలో భాగంగా సోమవారం మసీదు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో షాబాన్‌బుఖారీకి 'దస్తర్ బందీ'(తలపాగా ధారణ) ఉత్సవాన్ని నిర్వహించారు.

రైలెక్కాలంటే సూటే కావాలా?

మెట్రోలో రైతుకు అవమానంపై నెటిజన్ల ఫైర్



బెంగళూరు, ఫిబ్రవరి 26: ఈయన ఓ వృద్ధ రైతు. ప్రయాణం నిమిత్తం నమ్మ మెట్రోకు అనుబంధమైన బెంగళూరు రాజాజీనగర్ మెట్రోస్టేషన్‌కు సోమవారం వచ్చాడు. అయితే, అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి ఈయన వేషధారణ నచ్చలేదు. మాసిపోయిన దుస్తులు వేసుకుని వచ్చాడని స్టేషన్‌లోకి వెళ్లేందుకు అనుమతించకుండా అడ్డుకుని అవమానించారు. ఈ దృశ్యాలను ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. మెట్రో అధికారులపై నెటిజన్లు విరుచుకుపడ్డారు. వీఐపీలు, సూటు బూటుతో వచ్చేవారే మెట్రోలో ప్రయాణించాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన అరగంటలోనే విషయం పాకిపోవడంతో వెంటనే మెట్రో ఉన్నతాధికారులు స్పందించారు. రాజాజీనగర్ మెట్రోస్టేషన్ సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు.

అగ్నిపథ్‌ను రద్దు చేస్తాం

- మేం గెలిస్తే పాత పద్ధతిలోనే జవాన్ల భర్తీ
- అగ్నిపథ్‌తో యువత భవిష్యత్తు అంధకారం
- కాంగ్రెస్ పార్టీ ప్రకటన.. రాష్ట్రపతికి ఖర్గే లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి రాగానే అగ్నిపథ్ విధానాన్ని రద్దుచేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అగ్నిపథ్ వల్ల సైన్యంలో చేరాలనుకున్న యువత భవిష్యత్తు అంధకారం అవుతోందని విమర్శించింది. అగ్నిపథ్‌పై యువత ఆవేదనను పట్టించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరింది. ఈ మేరకు ఆ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సోమవారం రాష్ట్రపతికి లేఖ రాశారు. గతంలో జవాన్లను శాశ్వత ప్రాతిపదికన నియమించేవారు. ఈ విధానానికి మోదీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం స్వస్తి పలికింది. అగ్నిపథ్ విధానంలో సర్వీసులో చేరేవారు కేవలం నాలుగేళ్ల మాత్రమే సేవలు అందిస్తారు. ఆ తర్వాత వారిలో అత్యధిక మంది కాంట్రాక్టు ముగుస్తుంది. ఎక్కువమందిని సైన్యంలోకి తీసుకోవడానికి వీలుగా అగ్నిపథ్‌కు కేంద్రం రూపకల్పన చేసింది. ఖర్గే లేఖ రాసిన కొద్ది గంటల్లోనే కాంగ్రెస్ యువ నేతలు సచిన్ పైలట్, దీపేందర్ హుడా కూడా దీనిపై ప్రకటన చేశారు. అగ్నిపథ్.. రాజకీయ స్వార్థంతో కేవలం జవాన్లపై పెడుతున్న ఖర్చును మిగుల్చుకోడానికి తెచ్చిన పథకమని సచిన్ పైలట్ విమర్శించారు. సైన్యాన్ని బలహీనపరిచే పథకం ఇదన్నారు. "ప్రభుత్వం రూ.4,100 కోట్లు జీ-20 సదస్సు కోసం ఖర్చుపెట్టింది. ప్రధాన మంత్రి విమానంపై రూ.4,800 కోట్లు వ్యయం చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టు (కొత్త పార్లమెంటు భవనం) కోసం రూ.20వేల కోట్లు, వాణిజ్య ప్రకటనలపై రూ.6500 కోట్లు ఖర్చుచేశారు. మరోవైపు డబ్బులు మిగుల్చుకోవడం కోసం మొత్తంగా సైనిక భర్తీనే గందరగోళంలోకి నెట్టారు. దేశ రక్షణను సమస్యల్లో పడేశారు" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 60 నుంచి 65వేలమంది దాకా సైన్యంలో భర్తీ అయ్యేవారని, అగ్నిపథ్ అమల్లోకి వచ్చాక గత ఏడాది కేవలం 45వేలమంది మాత్రమే భర్తీ అయ్యారన్నారు. ఇప్పటికైనా పాత పద్ధతిలోకి మారకపోతే రాబోయే పదేళ్లలో సైన్యం పరిమాణం 14 లక్షల నుంచి 8 లక్షలకు పడిపోతుందని హుడా తెలిపారు. 'ఒక ర్యాంకు- ఒక పెన్షన్' హామీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. చివరకు 'నో ర్యాంకు-నో పెన్షన్' అన్నట్టు పరిస్థితి మార్చివేసిందని విమర్శించారు. నాలుగేళ్ల సర్వీసు తర్వాత అగ్నివీరులు ఎక్కడకు వెళ్లాలని, పెన్షన్ లేకుండా వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. కాంట్రాక్టు ముగియగానే అగ్నివీరులను బీజేపీ కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులుగా పెట్టుకుంటామని బీజేపీ నేత కైలాస్ విజయ్‌వర్గీయ చేసిన వ్యాఖ్యలను హుడా ఖండించారు. కాగా, అగ్నిపథ్‌తో 2లక్షల మంది యువతీ, యువకుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని రాష్ట్రపతికి రాసిన లేఖలో ఖర్గే తెలిపారు. 2019-22 మధ్యకాలంలో వీరంతా సాయుధ దళాల్లో ప్రవేశానికి కావాల్సిన అన్ని పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారన్నారు. అగ్నిపథ్ స్కీంతో వీరి కలలు చెదిరిపోయాయని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎట్టకేలకు 'అనర్హత'

(మొదటి పేజీ తరువాయి)

వెలువడ్డాయి. టీడీపీ ఫిర్యాదు మేరకు వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరి, కరణం బలరాం, వల్లభనేని వంశీపై... వైసీపీ ఫిర్యాదు మేరకు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్యేలుగా అనర్హులని తెలిపారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పార్టీ విప్‌ను ధిక్కరించి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు ఓటేశారని, పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ స్పీకర్‌కు తెలుగుదేశం విప్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, వైసీపీ తరపున ప్రభుత్వ చీఫ్‌విప్ ఎం.ప్రసాదరాజు గతంలో ఫిర్యాదు చేశారు. సదరు ఎమ్మెల్యేలకు వ్యక్తిగతంగా స్పీకర్ సీతారాం నోటీసులు జారీ చేశారు. వైసీపీ శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి రెండుసార్లు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఒక దఫా స్పీకర్ ముందు హాజరయ్యారు. నోటీసుకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కరణం బలరాం ఒక దఫా స్పీకర్ తమ్మినేని సీతారాం ముందు వ్యక్తిగతంగా హాజరయ్యారు. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్, వల్లభనేని వంశీ, మద్దాలి గిరి స్పీకర్ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కాలేదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఇరు పార్టీలు బలమైన సాక్ష్యాధారాలు సమర్పించాయని, న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్న అనంతరం తన నిర్ణయం వెలువరిస్తానని స్పీకర్ గతంలో తెలిపారు. మొత్తం 8 మందిపై అనర్హత వేటు వేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజ్యసభ ఎన్నికల ముందు 'కదలిక'


తమ పార్టీ తరపున గెలిచి వైసీపీలో చేరిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎప్పుడో స్పీకర్‌ను కోరింది. ఆ తర్వాత నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు జగన్ వైఖరి నచ్చక తిరుగుబాటు జెండా ఎగరేశారు. అయితే... ఇరు పార్టీల నుంచి ఫిర్యాదులు అందినా చాలారోజులపాటు వీటిని పెండింగ్‌లో పెట్టారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని నిలబెడుతుందనే అనుమానంతోనే 'అనర్హత పిటిషన్ల'లో కదలిక వచ్చిందనే విమర్శలు వచ్చాయి. కానీ... అభ్యర్థిని నిలపాలనే ఆలోచనను టీడీపీ విరమించుకుంది. కానీ... అప్పటికే కొంత కసరత్తు జరిగిన తర్వాత విషయాన్ని వదిలేస్తే బాగుండదు. అలాగని, వైసీపీ రెబల్స్‌పై మాత్రమే చర్యలు తీసుకుంటే విమర్శలు తప్పవు. ఎలాగూ... త్వరలో ఎన్నికల షెడ్యూలు వెలువడనుంది. ఇప్పుడు 'అనర్హత వేటు' వేసినా పెద్దగా ఆ నేతలపై ప్రభావం పడే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో... 'సమ న్యాయం' పాటించామన్నట్లుగా రెండు పార్టీల రెబల్స్‌పై అనర్హత వేటు వేసినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.



డొంకూరు తీరానికి 2 టన్నుల చేప!

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26: శ్రీకాకుళం జిల్లా డొంకూరు సముద్ర తీరానికి సోమవారం భారీచేప కొట్టుకుని వచ్చింది. దాని పేరు పులి బుగ్గ సొర్ర అని మత్స్యకారులు చెబుతున్నారు. దాని పొడవు 15 అడుగులు, వెడల్పు 6 అడుగులు, బరువు సుమారు 2 టన్నులు ఉంటుందని అంటున్నారు.

జ్ఞానవాపిలో పూజలు కొనసాగించుకోవచ్చు



ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 26: ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీలో ఉన్న జ్ఞానవాపి మసీదు దక్షిణ సెల్లార్‌లోని హిందూ దేవతా విగ్రహాలకు పూజలు కొనసాగించుకోవచ్చని అలహాబాద్ హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. జనవరి 31న వారాణసీ జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ దాఖలు చేసిన రెండు పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ తీర్పు వెలువరించారు. కాశీ విశ్వనాథుని ఆలయం పక్కనే ఉన్న మసీదులోని వ్యాస్ తెహ్ఖానాలో పూజలు కొనసాగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని అంజుమన్ ఇంతెజామియా మస్జిద్ జాయింట్ సెక్రటరీ మహమ్మద్ యాసిన్ తెలిపారు. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై తమ న్యాయవాదులు అధ్యయనం చేసిన దరిమిలా పిటిషన్ వేయనున్నట్టు పేర్కొన్నారు.

చంద్రుడిపై నిద్ర లేచిన స్లిమ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: 'సూర్యుడు ఉదయించే భూమి'గా జపాన్‌కు పేరుంది. ఇప్పుడు ఆ సూర్యుడే చంద్రుడిపైనా ఆ దేశానికి సహకరించాడు. నిద్రావస్థలోకి వెళ్లిపోయి.. ఇక పనిచేస్తుందో లేదో తెలియని స్థితిలో ఉన్న మూన్ ల్యాండర్ 'స్లిమ్'పై తనకిరణాలను ప్రసరింపచేసి దాన్ని మేల్కొలిపాడు. దీంతో ఇటీవల చంద్రుడిపైకి పంపిన తమ 'స్లిమ్' జాబిల్లిపై రెండు వారాలపాటు కఠినమైన చంద్రరాత్రిని తట్టుకుని తిరిగి ప్రాణం పోసుకుందని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) తెలిపింది. ఆదివారం రాత్రి స్లిమ్‌కు తాము ఒక కమాండ్‌ను పంపితే దానికి స్పందన వచ్చిందని సోమవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. గత నెల 19న చంద్రుడిపై దిగే క్రమంలో సాంకేతిక సమస్యల వల్ల స్లిమ్ యాంగిల్ మారింది. దీంతో దానిలోని సోలార్ ప్యానెల్స్ సూర్యకిరణాలను అందుకోలేకపోయాయి. ఆ తర్వాత సూర్యుడి కోణం మారడంతో రెండు రోజులపాటు జీవం పోసుకున్న స్లిమ్ తన హై-స్పైక్ కెమెరాను ఉపయోగించి కొన్ని ఫొటోలు తీసి భూమికి చేరవేసింది. కానీ, ఆ తర్వాత చంద్రరాత్రి మొదలు కావడంతో.. నిద్రాణస్థితిలోకి జారుకుంది. కాగా, సూర్యకిరణాలు పడే యాంగిల్ మారి.. స్లిమ్‌లోని బ్యాటరీ మళ్లీ చార్జ్ అవడం వల్లే ల్యాండర్ తిరిగి మేలుకొని అద్భుతం జరిగిందని జాక్సా తెలిపింది.

కృత్రిమ మేధతో పిండం వయసు నిర్ధారణ

- ఏఐ నమూనాను అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: గర్భిణీ స్త్రీల కడుపులోని పిండం వయస్సును కచ్చితంగా నిర్ధారించే కృత్రిమ మేధ నమూనాను ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. భారత్ తరఫున ఈ తరహా ఏఐ మోడల్‌ను రూపొందించడం ఇదే తొలిసారి. గర్భిణుల సంరక్షణకు, ప్రసవ తేదీలను కచ్చితంగా నిర్ణయించడానికి సరైన 'గర్భధారణ వయస్సు' (గెస్టేషనల్ ఏజ్) అవసరం. 'గర్భిణి-జీఏ2'గా పిలిచే ఈ ఏఐ నమూనాను భారత జనాభా డేటాను ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఇది పిండం వయస్సును కచ్చితంగా అంచనా వేస్తుందని, దీనివల్ల తప్పులు జరిగే అవకాశాలు మూడు రెట్లు తగ్గుతాయని అధికారులు తెలిపారు. అలాగే ఈ జీఏ2 మోడల్‌తో ప్రసూతి వైద్యులు మెరుగైన సంరక్షణ అందించేందుకు వీలవుతుందని.. తద్వారా భారత్‌లో మాతా శిశు మరణాల రేటు తగ్గుతుందని చెప్పారు.

పాలస్తీనా ప్రధాని రాజీనామా



మహమ్మద్ షెతెయె

జెరూసలేం, ఫిబ్రవరి 26: వెస్ట్‌బ్యాంక్ నుంచి పాలన సాగిస్తున్న పాలస్తీనా అథారిటీ ప్రధాన మంత్రి మహమ్మద్ షెతెయె సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు సమర్పించారు. అయితే.. దీనిపై అధ్యక్షుడు ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాలస్తీనాకు కొత్త అథారిటీ ఏర్పాటయ్యేదాకా షెతెయెను ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగేలా అధ్యక్షుడు కోరే అవకాశాలున్నాయి. పాలస్తీనా ప్రభుత్వ రాజీనామాకు అమెరికా రెండు నెలలుగా చేస్తున్న ఒత్తిడి ఫలించడంతో.. విభిన్న రాజకీయపక్షాలతో కొత్త అథారిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సిన్వర్ సహా.. హమాస్ అగ్రనేతలు కూడా ఇదివరకే గాజాలో పాలస్తీనా అథారిటీ పాలనకు అంగీకారం తెలిపిన నేపథ్యంలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపు పలికే అవకాశాలున్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. రంజాన్ ప్రారంభం(మార్చి 11)లోగా యుద్ధానికి ముగింపు పలకాలని ఈజిప్ట్, ఖతార్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. అయితే.. పాలస్తీనా అథారిటీ చేతికి గాజా పగ్గాల ప్రతిపాదనను ఇజ్రాయెల్ ముందు నుంచి వ్యతిరేకిస్తోంది.

రష్యా సైన్యం నుంచి భారత హెల్పర్లు తిరిగిరాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రష్యా సైన్యంలో 'సెక్యూరిటీ హెల్పర్లు'గా పని చేస్తున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం తిప్పిపంపింది. భారత ప్రభుత్వ డిమాండును మన్నించి వారిని వెంటనే ఆర్మీ నుంచి పంపించివేసిందని సోమవారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. భారత్‌కు చెందిన కొందరు వ్యక్తులు రష్యా సైన్యంలో సహాయ సిబ్బందిగా నియమితులయ్యారు. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనాలని ఒత్తిడి చేయడంతో వారిలో ఆందోళన మొదలైంది. తమను ఆదుకోవాలని రష్యాలోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు. విదేశీ వ్యవహారాల శాఖ చేసిన కృషి ప్రయత్నంగా రష్యా ప్రభుత్వం వారిని తిప్పి పంపించడానికి సిద్ధమయింది. వారిలో కొందరు ఇప్పటికే స్వదేశానికి పయనమయ్యారు.

కఠిన ప్రశ్నలు.. 'నిష్పత్తి' కుస్తీలు!

- నిరుద్యోగులతో ఏపీపీఎస్సీ ఆటలు
- ఐదేళ్లలో ఒకే ఒక్క గ్రూప్-2
- అది కూడా ఎన్నికలకు ముందు
- ఇప్పుడు మెయిన్స్‌కు నిష్పత్తిపై డ్రామా
- 1:100కు అభ్యర్థుల విన్నపాలు
- ప్రిలిమ్స్ ప్రాథమిక 'కీ' విడుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగులతో జగన్ ప్రభుత్వం ఆడుకుంటోంది. సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఎన్నికల ముందు ఆగమేఘాలపై భర్తీ ప్రక్రియను ప్రారంభించింది. ఐదేళ్లపాటు నిరుద్యోగులను అయోమయంలోకి నెట్టి, సరిగ్గా ఎన్నికల వేళ గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం.. పరీక్షకు సిద్ధమయ్యేందుకు సరిపడ సమయం ఇవ్వకుండా ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించింది. దీనిపై అభ్యర్థుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. సన్నద్ధతకు సమయం ఇవ్వకుండా అత్యంత కఠినంగా ప్రశ్నపత్రం రూపొందించడాన్ని అభ్యర్థులు తప్పుబడుతున్నారు. అభ్యర్థుల్లో ఆందోళనను గుర్తించిన ఏపీపీఎస్సీ ఇప్పుడు మెయిన్స్‌కు నిష్పత్తిపై మరో డ్రామాకు తెరతీసింది. తొలుత 1:50 నిష్పత్తి అని ప్రకటించిన ఏపీపీఎస్సీ, ఇప్పుడు అభ్యర్థుల వినతిని పరిగణనలోకి తీసుకుంటామంటూ మరో వాదన తీసుకొచ్చింది. కాగా, నిష్పత్తిపై అభ్యర్థుల్లో రకరకాల డిమాండ్లు వస్తున్నాయి. 1:70 అని కొందరు, 1:100 తీయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. కాగా, అభ్యర్థులకు తగిన సమయం ఇచ్చి ఉంటే ఈ గందరగోళం ఏర్పడి ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆగమేఘాలపై ప్రిలిమ్స్

సాధారణంగా పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రం కఠినంగా ఉన్నా, సులభంగా ఉన్నా అందరికీ ఒకే విధానం ఉంటుంది. దీనిపై అభ్యర్థుల్లో పెద్దగా వ్యతిరేకత రాదు. అయితే ఐదేళ్లపాటు మౌనం వహించి చివర్లో పరీక్షలు నిర్వహించడంపైనే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోటీ పరీక్షలకు నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కనీసం 90 రోజుల సమయం ఇచ్చేవారు. ఇప్పుడు ఏపీపీఎస్సీ కేవలం 79 రోజుల్లోనే ప్రిలిమ్స్ నిర్వహించింది. ఇంకొంత సమయం ఇవ్వాలని అభ్యర్థులు గగ్గోలు పెట్టినా ఏపీపీఎస్సీ వినిపించుకోలేదు. ఇక ఆదివారం జరిగిన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష అభ్యర్థులకు చుక్కలు చూపించింది. సివిల్స్ స్థాయిలో ప్రశ్నపత్రం రూపొందించారని అభ్యర్థులు అంటున్నారు. ఈసారి గ్రూప్-2 పేపరు స్వరూపాన్ని మార్చిన ఏపీపీఎస్సీ, 'ఇండియన్ సొసైటీ' అంశాన్ని కొత్తగా చేర్చింది. దీనిలో కఠినమైన ప్రశ్నలు వచ్చాయని అభ్యర్థులు తెలిపారు. ఇతర విభాగాల్లో కూడా కఠినమైన ప్రశ్నలే ఇచ్చారు. పరీక్ష రాసిన తర్వాత దీనిపై అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

1:100కు అభ్యర్థుల వినతి

ప్రిలిమ్స్ రాసిన వారి నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేసే సంఖ్యపై ఏపీపీఎస్సీ సభ్యుడు పరిగె సుధీర్ 1:50(ఒక పోస్టుకు 50 మంది) చొప్పున అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రశ్నపత్రం సివిల్స్ స్థాయిలో ఉందని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందని, 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని కోరాడు. దీనిపై స్పందించిన సుధీర్.. ఈ విషయాన్ని ఏపీపీఎస్సీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కాగా, గ్రూప్-2 ప్రిలిమ్స్ ప్రాథమిక 'కీ'ని ఏపీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. గురువారంలోగా అభ్యంతరాలు తెలపవచ్చు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎయిర్‌పోర్టు మినీ ఫ్లై ఓవర్ రెడీ!



● పక్షం రోజుల్లో ప్రారంభించటానికి సిద్ధం చేస్తున్న ఎన్‌హెచ్ అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి అభిముఖంగా 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై తలపెట్టిన మినీ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. మరో పక్షం రోజుల్లో ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు సిద్ధం చేస్తున్నారు. రూ.67 కోట్ల వ్యయంతో ట్రాంజెట్ ఇన్ఫ్రా సంస్థ ఈ మినీ ఫ్లై ఓవర్ పనులను చేపట్టింది. దీన్ని పిల్లర్లు లేకుండా వార్ స్ట్రక్చర్‌లోనే నిర్మించారు. అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌కు వెళ్లటానికి వీలుగా మినీ ఫ్లై ఓవర్‌కు వెంట్ ఇచ్చారు. ఈ వెంట్‌కు ఎయిర్‌పోర్టులో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ రహదారి అనుసంధానమౌతుంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కనకదుర్గ వారధి వరకు ఎన్‌హెచ్-16 వీఐపీ కారిడార్‌గా ఉంది. విమానాశ్రయానికి ప్రధాని, సీఎంతో పాటు, కేంద్ర మంత్రులు, సెలబ్రిటీలు, విదేశాంగ ప్రతినిధుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో వీఐపీ కారిడార్‌గా ఉంది. దీంతో కాన్వాయ్‌ల రాకపోకల కారణంగా ఎన్‌హెచ్-16పై తరచూ ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలను నిలుపుదల చేయాల్సి వస్తోంది. హైవేపై వాహనాలను నిలుపుదల చేయటం అంతో ట్రాఫిక్ సమస్యలతో కూడుకుంది. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు ఎయిర్‌పోర్టు ప్రధాన ద్వారం మీదుగా లోనికి ప్రవేశించే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ మినీ ఫ్లై ఓవర్‌ను ఎన్‌హెచ్ అధికారులు తలపెట్టారు. ఈ మినీ ఫ్లై ఓవర్‌కు మధ్యలో ఇచ్చిన వెంట్ నుంచి విజయవాడ మీదుగా వచ్చే వాహనాలు ఎయిర్‌పోర్టులోకి ప్రవేశిస్తాయి. అలాగే ఎయిర్‌పోర్టులో నుంచి వచ్చే వీఐపీ వాహనాలు ఈ వెంట్ నుంచి వెళ్లిపోతాయి. ఏలూరు నుంచి వచ్చే వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా వెళతాయి. దీంతో హైవేపై ట్రాఫిక్ సమస్యలనేవి ఉత్పన్నం కావు. ఎయిర్‌పోర్టు మినీ ఫ్లై ఓవర్‌కు లైటింగ్, సౌండ్ ప్రూఫ్ వంటి పనులు చేపట్టారు. మినీ ఫ్లై ఓవర్‌కు ముందు భాగంలో సైనేజీ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా వెంట్ నుంచి రాకపోకలకు మరి కొంతకాలం పట్టే అవకాశాలున్నాయి. ఎందుకంటే వెంట్‌కు అనుసంధానంగా ఎయిర్‌పోర్టులోకి ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇవి అయ్యేవరకు వెంట్ వినియోగం సాధ్యం కాదు.

టిడ్కో ఇళ్లు ఇంకెప్పుడిస్తారు?

● వేదికపైనే మంత్రి జోగి రమేశ్‌ను నిలదీసిన లబ్ధిదారులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 26: ఇళ్లకోసం డబ్బులు కట్టి ఐదేళ్లయింది. తీసుకున్న లోనుకు బ్యాంకుల వారు కిస్తీలు, వడ్డీ కట్టమని నోటీసులు పంపుతున్నారు. ఖాతాలో డబ్బులు అప్పులకు జమవేసుకుంటున్నారు. మీరు ఇళ్లు పూర్తిచేసి ఇవ్వరు, బ్యాంకువాళ్లు అప్పుకట్టమని వేధిస్తున్నారు, ఇళ్లివ్వకుండా అప్పు ఎలా కట్టాలని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు మంత్రి జోగి రమేశ్‌ను నిలదీశారు. ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో జెమినీ స్కూల్ సమీపాన నిర్మాణం అసంపూర్తి ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో సోమవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మహిళా లబ్ధిదారులు మాట్లాడుతూ పక్కాఇల్లు కట్టించి ఇస్తారని టీడీపీ అధికారంలో ఉండగా అప్పులుచేసి డబ్బులు కట్టాం, ఐదేళ్లు దాటినా ఇళ్లు అప్పగించలేదు. ఇంకెప్పుడిస్తారని పండ్రాజు లక్ష్మి, ఇతర లబ్ధిదారులు ప్రశ్నల వర్షం కురిపించారు. మీ ప్రభుత్వం వచ్చాక అనర్హులమని జాబితా నుంచి మా పేర్లు తొలగించారు. కట్టిన డబ్బులు తిరిగివ్వలేదు. అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారు. మాడబ్బు ఎప్పుడిస్తారని మరికొందరు నిలదీశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కొన్ని చోట్ల టిడ్కో ఇళ్లు అప్పగించామని, ఇక్కడ ఆలస్యం అవ్వడానికి స్థానిక ఎమ్మెల్యే కారణమన్నారు. అనర్హులకు పదిరోజుల్లో డబ్బు వాపసు చేస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి జూలైలో లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. అప్పటి వరకు అప్పుకట్టమని బ్యాంకుల వారిని అప్పు చెల్లించమని అడగవద్దని చెబుతామని మంత్రి సర్దిచెప్పారు. టిడ్కో ఎండీ శ్రీధర్, కలెక్టర్ రాజాబాబు, నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓట్ల కోసం ఖబరిస్తాన్ గుర్తొచ్చిందా: బాబూరావు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 26: అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పేరుతో సమాధులను మిషన్లతో తొలగిస్తూ, మైనార్టీల మనోభావాలను అధికార వైసీపీ దెబ్బతీసిందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ నగరకార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. వాంబేకాలనీలోని శ్మశానవాటికను ఇండియా వేదిక కుటమిలోని నేతలతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖబరిస్తాన్, శ్మశానవాటికలను అభివృద్ధి చేయడం ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. ఎన్నికల ముందు హడావిడిగా రాజకీయ లబ్ధికోసం, ఓట్ల కోసం మైనార్టీల మనోభావాలు దెబ్బతీసేలా ఇలాంటి చర్యలకు పూనుకోవడం అభ్యంతరకరమన్నారు. గడచిన ఐదేళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న కొద్దిరోజుల్లో ఇవన్నీ గుర్తుకొచ్చాయా.. హడావిడిగా, బుల్డోజర్స్ మిషన్లతో సమాధులపై పనిచేయడం, అభివృద్ధి పనులను రాజకీయ లబ్ధికి వాడుకుంటూ వివాదానికి గురిచేయడం సమంజసం కాదన్నారు. దీనికి వైసీపీ నేతలే బాధ్యత వహించాలన్నారు. గతంలో ఖబరిస్తాన్ అభివృద్ధిపై ప్రజలతో చర్చించి వారి మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇండియా వేదికగా ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మైనార్టీల మనోభావాలు దెబ్బతినకుండా అభివృద్ధి చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ నగర నేతలు కె.వి. భాస్కరరావు, ఎంసీపీఐ నేతలు ఖాదర్, బి.రమణారావు, కె.దుర్గారావు, శ్రీనివాసరావు, రసూల్, ఏస్కే రషీద్ పాల్గొన్నారు.

నాసిరకం మద్యం, గంజాయితో యువత నిర్వీర్యం

● టీడీపీ నేత బొండా ఉమా

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 26: జగన్‌రెడ్డి పాలనలో నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ బారినపడి యువత నిర్వీర్యమవుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. అజిత్‌సింగ్ నగర్ సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యనిషేధం చేసి ఓట్లడుగుతానన్న హామీపై జగన్ మాటతప్పి మడమ తిప్పాడన్నారు. మద్యం ధరలను మూడు రెట్లు పెంచి సుమారు రూ.2లక్షల కోట్ల ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలస్‌కు తీసుకెళ్లాడని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగిన వారిలో దాదాపు 35లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని అనారోగ్యంతో ఆసుపత్రిపాలయ్యారన్నారు. అందులో 30వేల మంది ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని దీనికెవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో 4లక్షల బెల్టుషాపులు, మొబైల్ షాపులు పెట్టించి రక్తమాంసాలతో మద్యం వ్యాపారం చేస్తున్నారన్నారు. రాబోయే 15ఏళ్ల పాటు మద్యం ఆదాయం తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నాడన్నారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే ఎందుకు చేస్తున్నారు? డిజిటల్ లావాదేవీలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందని మద్యం మహమ్మారికి వీరే బాధ్యులన్నారు. నాసిరకం మద్యం పోవాలంటే జగన్ పోవాలి, చంద్రన్నే రావాలన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌సీసీఐ జిల్లా కమిటీ సమావేశం

ధర్నాచౌక్, ఫిబ్రవరి 26: ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ సభ్యుల సమావేశం గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవన్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. ఏపీఎఫ్‌సీసీఐ అభివృద్ధి, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేయడం, జీఎస్టీలో ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలపై చర్చించారు. మద్దుల గిరీష్, కొక్కు అనిల్ కుమార్ అధ్యక్ష, కార్యదర్శులుగా మరో 10మంది సభ్యులతో కృష్ణా జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

సంస్థ బలోపేతానికి, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి పీఎస్ఎల్ఎన్ వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాలయ రామకృష్ణ, బొప్పూడి రామకృష్ణ, జిల్లాలోని వివిధ రకాల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంగా చూడటమే లక్ష్యం

● టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఫిబ్రవరి 26: చంద్రబాబును 2024లో ముఖ్యమంత్రిగా చూడటమే నా ప్రధాన లక్ష్యమని టీడీపీ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రసాదంపాడులోని విజయవాడ రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో అష్టద్రవ్య మహాగణపతి, రాజ్యలక్ష్మి సుదర్శన లక్ష్మి నరసింహ యాగం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. 30 మంది రుత్వికుల వేదమంత్రోచ్చారణల మధ్య గణపతి పూజతో హోమపూజలు ప్రారంభించారు. పుణ్యాహవాచనం, గణపతి ఆవాహన పూజల అనంతరం సహస్ర నామార్చన తదుపరి అష్టద్రవ్య మహాగణపతి హోమం చేశారు. తరవాత భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో యాగం తలపెట్టినట్టు చెప్పారు. అభివృద్ధిపరంగా వెనుకబడిన ఏపీకి తిరిగి పూర్వవైభవం రావాలంటే అనుభవజ్ఞుడైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యపడుతుందని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజా సంకల్పానికి దైవబలం తోడుండాలని ఆకాంక్షిస్తూ ఈ యాగం చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ నేతలు గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, తాతినేని రవికుమార్, దయాల రాజేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, గూడపాటి తులసిమోహన్, మండవ రమ్య, శుభాషిణి, పరుచూరి నరేశ్, కోనేరు సందీప్, కొళ్ల ఆనంద్, అద్దేపల్లి సాంబు, పట్టపు చంటి పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి వెంకట్రావు దంపతులు



పతకాలు సాధించిన కరాటే క్రీడాకారులతో కొడాలి రవిబాబు

కరాటేలో ఏపీ క్రీడాకారులకు స్వర్ణాలు

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 26: గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన రెండో సౌత్ ఇండియా కరాటే చాం పియన్‌షిప్‌లో నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలతో సత్తా చాటారని జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబా బు, జోనల్ చీఫ్ లేడీ ఇన్‌స్ట్రక్టర్ సాగరిక తెలిపారు. అండర్-12 బాలుర బ్రౌన్ బెల్ట్ కటాలో అర్జున్ పొట్లూరి స్వర్ణం, బాలికల గ్రీన్‌బెల్ట్ కటాలో చాగంటి స్నేహిత స్వర్ణం, అండర్-12 బాలుర ఆరెంజ్ బెల్ట్ కటాలో వం గర నాగ వెంకటేష్ స్వర్ణం, అండర్-10 ఆరెంజ్ బెల్ట్ కటాలో ఆర్‌టీ రి యాన్ స్వర్ణం సాధించారు. క్రీడాకారులను ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఓంకార్ దత్తు, తల్లిదండ్రులు అభినందించారు.



ఎంపికైన సీనియర్ కబడ్డీ టీమ్ ప్రాబబుల్స్

సీనియర్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి కృష్ణా టీమ్

రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల జట్టును నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో సోమవారం ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ (చెడుగుడు) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నత్తా యోనారాజు తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎంపికలు జరగ్గా 50 మంది క్రీడాకారులు తలపడ్డారన్నారు. ఇందులో 18 మంది ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశామని, వీరికి శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. నెల్లూరు జిల్లా కోవూరులో మార్చి 8 నుంచి 10 వరకు 70వ అంతరాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు జరుగుతాయని, అక్కడకు టీమ్‌ను పంపుతామన్నారు.

అబాకస్‌లో ఉత్తమ పాఠశాలలకు అవార్డులు



భవానీపురం, ఫిబ్రవరి 26: అంతర్జాతీయ గుర్తింపు కలిగిన సిప్ అబాకస్ (సోషల్ ఇంటలెక్చువల్ ప్రోగ్రెసివ్) రాష్ట్రస్థాయి పోటీల్లో28 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఐదింటికి ఉత్తమ అవార్డులు రాగా, ఇందులో నగరానికి అట్కిన్‌సన్ స్కూల్, (వన్‌టౌన్), జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్ (గొల్లపూడి) ఉత్తమ పాఠశాలలుగా నిలిచాయి. అటిన్‌స్కన్ హైయర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ అంత్ మేరి, జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ జె.అరుణరెడ్డికి సీనియర్ అబాకస్ రాష్ట్ర ఇన్‌చార్జి ఎం.గోపాలకృష్ణ, భవానీపురం/వన్‌టౌన్ బ్రాంచి అధిపతి మధుసూదనరావు విద్యార్థులకు నగదు బహుమతులు, ట్రోఫీలను సోమవారం ఇచ్చారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ఎన్నికల విధుల్లో పూర్తిస్థాయి అవగాహన, నిబద్ధత ముఖ్యం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు

పటమట, ఫిబ్రవరి 26: ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అవగాహన, నిబద్ధత ముఖ్యమని, ప్రతి దశలోను అప్రమత్తత అవసరమని కలెక్టర్ ఎస్.దిల్లీరావు పేర్కొన్నారు. నగరంలోని మేరిస్ స్టెల్లా కాలేజ్ సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్‌వో)లకు సర్టిఫికేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఏఆర్‌వోలకు ఐదు రోజుల శిక్షణలో జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనర్లు వేద ప్రకాష్, ఆర్‌బీ జ్ఞానవేలు, కలెక్టర్ ఎస్.దిల్లీరావు, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ ఇప్పటికి రెండు దశల్లో శిక్షణా శిబిరాలు నిర్వహించామని, 3వ దశ శిక్షణ ఫిబ్రవరి 26 నుంచి అయిదు రోజులపాటు జరుగుతుందన్నారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, శ్రీ ఎస్‌పీఎస్ నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతరపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించి 118 మంది ఏఆర్‌వోలకు జరిగే శిక్షణలో జాతీయ మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల అర్హత, అనర్హత, నామినేషన్ల పరిశీలన, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం-వీవీప్యాట్, అడ్మినిస్ట్రేషన్, కౌంటింగ్-డిక్లరేషన్ ప్రాసెస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ, ఎన్నికల నైతిక నియమావళి (ఎంసీసీ) వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో పనిచేయడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాను అగ్రభాగంలో ఉంచాలి

వన్‌టౌన్: స్త్రీ, శిశు సంక్షేమ పథకాల అమలులో జిల్లాను అగ్రభాగంలో ఉంచాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు పేర్కొన్నారు. ఈ శాఖలో కొత్తగా నియామకమైన 33 మందికి సోమవారం నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఆయా విభాగాల్లో ఉద్యోగాలు పొందినవారి వివరాలను తెలిపి నియామకపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిత్తశుద్ధి, అంకిత భావంతో కొత్తగా నియామకమైన ఉద్యోగస్తులు పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పూర్తిస్థాయిలో ఫలితాలను పొందేలా చూడాలన్నారు. నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మెరుగైన పనితీరును కనబరచాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి జి.ఉమాదేవి, సీడీపీవోలు జీ.మంగమ్మ, ఏ నాగమణి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం మధ్యలో అలిగి వెళ్లిన వైసీపీ నేతలు

బ్యానర్‌పై జగన్ ఫొటో లేదంటూ విమర్శ



హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 26: కోడూరుపాడు వద్ద రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్‌పాస్ ప్రారంభోత్సవంలో తమ అధినేత, సీఎం జగన్ ఫొటో లేదని వైసీపీ నేతలతో పాటు ఎంపీపీ అలిగి మధ్యలో వేదిక దిగి వెళ్లిపోవడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. ప్రారంభంలో వేదికపై ఉన్న ఎంపీపీ నగేష్, జడ్పీటీసీ గంగాభవానీ, వైస్ ఎంపీపీ రమాదేవి బహుమతి ప్రదానం చేయగా వేదిక ఎక్కనని భీష్మించిన వైసీపీ మండలాధ్యక్షుడు నక్కా గాంధీ సూచనతో వారు కూడా వేదిక దిగి వెళ్లిపోయారు. దీంతో అవాక్కయిన రైల్వే అధికారులు తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులను, పార్టీ నేతను ఆహ్వానించామని, రైల్వేశాఖ ప్రొటోకాల్ ప్రకారమే ఉంటుందని వివరణ ఇచ్చారు. బ్యానర్లు, ఇతర సామగ్రి కేంద్ర రైల్వేశాఖ నుంచి వచ్చాయని, ఏర్పాటు చేయడమే తమపని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రి ఫొటో కూడా బ్యానర్లలో లేదని, రాష్ట్రప్రభుత్వానికి సంబంధం లేదని వారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తమ బాధ్యతని అన్నారు. దీనిపై ప్రజల్లోనూ మిశ్రమ స్పందన వ్యక్తమైంది. తదనంతరం యథావిధిగా మధ్యాహ్నం అండర్‌పాస్‌ను ప్రజల సమక్షంలో జాతికి అంకితం చేశారు.

దివ్యాంగుల జాబ్‌మేళాలో ఉద్యోగాలు



వన్‌టౌన్, ఫిబ్రవరి 26: గ్రో (జీఆర్‌వో డబ్ల్యు) సంస్థ సోమవారం మాచవరంలోని తమ కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగుల జాబ్ మేళాలో పలువురికి ఉద్యోగాలు లభించాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చేసిన 18 నుంచి 34ఏళ్ల వయసుండి, అర్హత కలిగిన దివ్యాంగులకు పలు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. లెమన్ ట్రీలో 12, రిలయన్స్ 27, బిగ్‌బాస్కెట్ 11, బీజెడ్ ఫిన్‌సర్వ్ 9, టెక్నో టాస్క్ 28, ఇన్నోవ్‌సోర్స్ 18, రెడ్‌ఫాక్స్ హోటల్ 8, టాటా స్త్రైవ్ 6, హెచ్‌వన్‌హెచ్‌ఆర్ సొల్యూషన్స్ 8, ఫ్లిప్ కార్ట్ 21, ఎక్సెలెంట్ కోచింగ్ సెంటర్ 7, విప్రో మ్యాన్ పవర్ సొల్యూషన్ 15, రిలయన్స్ ట్రెండ్స్ 8, కేఎఫ్‌సీ 8 చొప్పున దివ్యాంగులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పించారు.

తెలుగు పద్యానికి కీర్తిపతాకం నాగఫణిశర్మ

ఘనంగా ప్రారంభమైన మహా శతావధానం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 26: తెలుగు భాషలోని సౌందర్యాన్ని పూర్తిగా తన పద్యాల్లో నింపి ప్రపంచమంతా తెలుగు పద్యవైభవాన్ని చాటిన ఏకైక అవధాని బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అని పలువురు వక్తలు కొనియాడారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న శ్రీ దుర్గా సౌందర్య లహరీ మహాశతావధానం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలుగువారికి మాత్రమే సొంతమైన ప్రక్రియ అవధానమని, అలాంటి అవధాన విద్యకు నాగఫణిశర్మ కీర్తి పతాకంగా నిలుస్తున్నారని కొనియాడారు. కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ నాగఫణిశర్మ పద్యాలు తేనెల వాన కురిపిస్తాయన్నారు. కేవలం సాహితీ విన్యాసంగా కాకుండా యువతరానికి వ్యక్తిత్వ వికాస సాధనంగా అవధానం ఉపయోగిస్తుందన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పాత్రికేయుడు శర్మ పాల్గొన్నారు. అనంతరం ప్రారంభమైన అవధానంలో 30 మంది పృచ్ఛకులు అడిగితన దత్తపదులు, 15 మంది సమస్యలకు అవధాని అద్భుతమైన పూరణలు ఇచ్చారు.

అవధానంలో హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్

శ్రీ దుర్గా సౌందర్యలహరి మహా శతావధానంతో అమ్మవారి కీర్తిని దేవస్థానం మరింతగా ప్రస్ఫుటింపజేశారని, సాహిత్యం, సంస్కృతి, భాషా వికాసానికి దేవాలయాలు కేంద్ర బిందువుగా నిలవాలని ఈ విశిష్ట కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ అన్నారు. అనంతరం అవధాని మాడుగుల నాగఫణిశర్మ ఆశీస్సులు అందుకున్నారు. పాలపర్తి, మను శర్మ, లక్ష్మీనారాయణ, సౌజన్యలక్ష్మి, జొన్నవిత్తుల, నాగరాజు, జ్యోతి, విజయ్‌కుమార్‌శర్మ ప్రచ్ఛకులుగా పాల్గొన్నారు.



నాగఫణిశర్మను సత్కరిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

7న ఏపీ భవన్ విభజనపై హోంశాఖ సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్చి 7న ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించనున్నట్టు ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశానికి హాజరుకావాలని రెండు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఏపీ భవన్ విభజనపై ఇప్పటికే రెండు రాష్ట్రాలు దాదాపు అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు ఏపీ ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.50 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. 19.781 ఎకరాల్లో భవన్ ఆస్తులు, భవనాలు ఉన్నాయి. ఏపీ భవన్ కింద ఉన్న మొత్తం 19.781 ఎకరాల్లో గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌ను ఆనుకొని ఉన్న దుకాణాలు, దుకాణాల మధ్య ఉన్న రహదారి 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్‌లో ఉన్న 3.359 ఎకరాలు, పటౌడి హౌజ్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా.. అలాగే శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడి హౌజ్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదనలు చేసింది.

పరిశ్రమల రంగంలో యువతకు ఉపాధి: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని అభివృద్ధి ద్వారా చేయడం యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అమరావతి సచివాలయంలో పరిశ్రమల శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఈ రంగంలో అనేక వినూత్న ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈ-క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమం కింద రాష్ట్రంలో 100 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లస్టర్లు(ఐడీ) ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటికే 57 క్లస్టర్లను గుర్తించగా 8 క్లస్టర్లు పూర్తయ్యాయన్ని సీఎస్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం రిజిస్ట్రేషన్ల విషయంలో దేశంలో కర్ణాటక తర్వాత మన రాష్ట్రం ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. మొదటి దశలో ఎంపికైన అనంతపురం, నెల్లూరు, తిరుపతి, పశ్చిమగోదావరి, కడప జిల్లాల్లో ఇప్పటికే 18 వేల మంది వివిధ చేతివృత్తుల్లో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోగా మరో 3 వేల మంది శిక్షణలో ఉన్నారని తెలిపారు.

జగన్‌ను ఓడించడానికి ప్రజలూ సిద్ధమే: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, ఓడించడానికి ప్రజలు కూడా సిద్ధంగానే ఉన్నారని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'ఏపీలో ప్రతి కుటుంబాన్ని జగన్ సర్కారు ఆర్థికంగా దోచుకుంది. ధనిక, పేద అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారినీ అతి దారుణంగా మోసగించి ఇప్పుడు సిద్ధం... సిద్ధం అంటూ ఎన్నికలకు జగన్ సిద్ధమయ్యారు. జనసేనకు అతి తక్కువగా 24 స్థానాలు మాత్రమే కేటాయిస్తారా? అంటూ జగన్ పత్రిక రెండు పార్టీల కేడర్ మధ్య గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తోంది. టీడీపీ కూటమి విజయం ఏపీకి నేటి అవసరం' అని ఎంపీ అన్నారు.

నియంత పాలనలో నోరు విప్పినా నేరమే: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నియంత పాలనలో నోరు విప్పడం కూడా నేరమవుతుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 'తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలను బయటపెట్టిన ఆలయ ప్రధానార్చకుడు రమణ దీక్షితులపై వేటు వేయడం దారుణం. కొండపై వైసీపీ నేతలు, కొంత మంది అధికారులు కలిసి చేస్తున్న దారుణాల గురించి ఆ కలియుగ దైవమే రమణ దీక్షితుల నోటి నుంచి భక్తులకు తెలిసేలా చేసింది. చేసిన తప్పులు, పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సింది పోయి రమణ దీక్షితులుపై కేసు పెట్టడం, అరెస్టు చేయాలని చూడటం జగన్ అహంకారానికి నిదర్శనం. దేవుడి జోలికి వెళ్లిన వారెవరూ బాగుపడినట్లు చరిత్రలో లేదు. దైవంతో ఆటలొద్దు' అన్నారు.

ఆ ప్రాజెక్టులు విధ్వంసం ఇసుక మాఫియా పనే

» కుప్పంలో జగన్ తిప్పలు ఎన్నికల స్టంట్: దేవినేని ఉమా

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల స్టంట్‌లో భాగంగానే కుప్పం సభలో జగన్ నానా తిప్పలు పడ్డారని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఎద్దేవా చేశారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను టీడీపీ ప్రభుత్వం 87 శాతం పూర్తి చేస్తే మిగిలిన పనులు పూర్తి చేయడానికి జగన్‌కు 57 నెలల సమయం పట్టిందా? అని ప్రశ్నించారు. రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం టీడీపీ ఐదేళ్లలో రూ.12 వేల కోట్ల ఖర్చు చేస్తే జగన్ కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కుప్పంలో జగన్ అబద్ధాలతో బడాయి ప్రకటనలు చేశారన్నారు. ఒక్క కొత్త కాలువ కూడా జగన్ తవ్వలేదని, ఒక ఇరిగేషన్ మంత్రి బుల్లెట్ దిగుద్దని, మరో ఇరిగేషన్ మంత్రి సంబరాల రాంబాబు పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో మాకేం తెలుసు, దేవుడికి తెలుసని తప్పించుకున్నారన్నారు.

మద్యంలో లక్ష కోట్లు స్వాహా చేసిన జగన్: నల్లమిల్లి

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మద్య నిషేధం మాట తప్పిన జగన్ నాసిరకం మద్యం తీసుకొచ్చి రూ.లక్ష కోట్లు జేబులో వేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఐదేళ్లలో మద్యం రేట్లు మూడు సార్లు పెంచారని, రూ.2 లక్షల కోట్ల నాసిరకం మద్యం అమ్మి రూ.లక్ష కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నాడన్నారు. ఐదేళ్ల పాలనలో 35 లక్షల మంది కిడ్నీ, లివర్ సమస్యలతో ఆసుపత్రుల పాలయ్యారన్నారు. మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలోనే జరుగుతోందని ఆరోపించారు.

చంద్రబాబును కలిసిన ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. అందులోని అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలని చంద్రబాబును కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్, సంక్షేమ నిధి పునరుద్ధరణ, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై, మీడియా సంస్థలపై దాడులు అరికట్టడానికి మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టం వంటి సుమారు 15 అంశాలతో కూడిన మెమోరాండం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు రద్దు చేసిన పథకాలు మళ్లీ ప్రవేశపెడతామని, జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, చావా రవి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజల విశ్వాసం కోల్పోయారు: గురుమూర్తి

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జగన్‌పై రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, టీడీపీ-జనసేన ఉమ్మడి తొలి జాబితా చూసి వైసీపీ నాయకులు భయపడుతున్నారని టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓడిపోతున్నామన్న భయంతో జగన్ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. పవన్‌కల్యాణ్ పొత్తు ధర్మం పాటిస్తున్నారని, అంబటి, పేర్ని వంటి వైసీపీ కాపు నేతలు మాత్రం పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారన్నారు.

ట్రైకార్ చైర్మన్‌గా గుండా సురేంద్ర

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏపీ షెడ్యూల్డ్ తెగల కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ట్రైకార్) సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్రను నియమించారు. ఆ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

కుప్పంలో వైసీపీది రక్త చరిత్ర: నల్లారి కిశోర్

కలికిరి, ఫిబ్రవరి 26: కుప్పంలో ఈ నాలుగేళ్లు వైసీపీది రక్త చరిత్ర కాగా చంద్రబాబు పాలనలో వేసింది అభివృద్ధి ముద్ర అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. చంద్రబాబును విమర్శించే నైతిక అర్హత సీఎం జగన్‌కు ఏమాత్రం లేదని ఆయన ధ్వజమెత్తారు. కుప్పంలో జగన్ చేసిన విమర్శలను ఘటుగా తిప్పికొట్టారు.

యూపీ రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఆర్‌ఎల్‌డీ ఓటు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం రాజ్యసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మొత్తం పది స్థానాలకుగానూ ఎనిమిదింటిని అధికార బీజేపీ దక్కించుకునే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ 8వ అభ్యర్థికి ఓటు వేసేందుకు రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌ఎల్‌డీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. బీజేపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి ఏడుగురు అభ్యర్థులే సునాయాసంగా గెలిచేందుకు అవకాశం ఉంది.



ఆకట్టుకున్న నౌకాదళ విన్యాసాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బహు పాక్షిక నౌకాదళ విన్యాసాలు (మిలాన్)-24లో భాగంగా సోమవారం బంగాళాఖాతంలో నౌకా దళాలు విన్యాసాలు చేశాయి. ఆకాశంలో దూసుకువెళుతున్న లక్ష్యాలపైకి గురిపెట్టి కాల్చడం, సబ్‌మెరైన్లను వెంటాడడం, ఒక నౌక నుంచి మరో నౌకపైకి వెళ్లడం, యుద్ధ నౌకలపై హెలికాప్టర్లు దిగడం వంటి ప్రదర్శనలు చేశారు. అరేబియా సముద్రంలోని ఈడెన్ జలసంధిలో తీర ప్రాంత రక్షణ కోసం మెరైన్ కమెండోలను ప్రత్యేక దళం.. సీ-130 యుద్ధ విమానం ద్వారా కిందికి దించడం, సముద్రపు దొంగలను పట్టుకోవడం వంటి ప్రదర్శనలు చేశారు.



డబ్బుల్లేక.. ధాన్యం కొనలేక..

చేతులెత్తేసిన సర్కార్!

» ఇప్పటికే రూ.50 కోట్ల అప్పుల్లో సివిల్ సప్లైస్ కార్పొరేషన్

» కొత్తగా అప్పులు పుట్టక.. రైతులకు బకాయిలు పెట్టేసిన సంస్థ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

లక్ష్యం 37 లక్షల టన్నులు.. కొన్నది 29 లక్షలే



అప్పులతో రోజులు వెళ్లదీస్తున్న వైసీపీ ప్రభుత్వం.. చివరికి డబ్బుల్లేక రైతుల నుంచి ధాన్యం కూడా కొనలేకపోయింది. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది 82,57,174 టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించగా.. చివరి సంవత్సరమైన 2023-24లో కేవలం 29,70,345 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించింది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా రైతులు దాదాపు 15 లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తుండగా.. 85 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తోంది. అందులో ప్రజా పంపిణీ అవసరాల కోసం ప్రభుత్వం కనీసం 50 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో ధాన్యం సేకరణకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న పౌరసరఫరాల సంస్థ ప్రతి సీజన్‌లో 30 నుంచి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో అయితే కేవలం 29 లక్షల టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేసింది. ఆర్థిక ఇబ్బందులే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఏటా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటే రూ.65 నుంచి 70 వేల కోట్లు అవసరం. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. ప్రజాపంపిణీ అవసరాలకు సరిపడా బియ్యం కోసం బయట అప్పులు చేస్తూ ధాన్యాన్ని సేకరిస్తోంది. దీంతో అప్పుల భారం రూ.50 వేల కోట్లకు చేరుకున్నాయని కార్పొరేషన్ వర్గాలే చెబుతున్నాయి. దీంతో గత కొంతకాలంగా రైతులకు ఎప్పటికప్పుడు ధాన్యం డబ్బులు చెల్లించకుండా బకాయిలు పెడుతోంది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు అవసరమైన స్థాయిలో అప్పులు పుట్టే పరిస్థితి కూడా కనిపించలేదు. దీంతో ఎందుకొచ్చిన గొడవని ధాన్యం సేకరణ లక్ష్యాన్ని క్రమంగా కుదించేసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లక్ష్యంగా నిర్దేశించి.. జిల్లాల వారీగా ఈమేరకు టార్గెట్లు ఇచ్చింది. పండించిన ధాన్యంలో ఇది చాలా తక్కువ లక్ష్యం అయినా.. ఆ మాత్రం కూడా కొనుగోలు చేయలేదు. కేవలం 29 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి చేతులెత్తేసింది.

వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ ఇలా..

సంవత్సరం	ధాన్యం సేకరణ (టన్నుల్లో)
2019-20	82,57,174
2020-21	84,56,200
2021-22	66,54,039
2022-23	49,48,901

స్నేహితుడి కోసం కట్టుకున్నోడినే కడతేర్చింది!

» నెల్లూరులో హత్యకేసు ఛేదించిన పోలీసులు

» ఏడుగురి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 26: స్నేహితుడితో కలిసి భర్తను భార్య దారుణంగా హత్య చేయించిన ఘటన నెల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...నెల్లూరు రామచంద్రాపురం రామాలయం వీధికి చెందిన పెంచల ప్రసాద్ (35)కు తన పెద్ద అక్క ప్రసన్న కుమార్తె సుహితతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. ట్రక్కు ఆటో నడుపుతూ ప్రసాద్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పది రోజుల క్రితం ప్రసన్న దంపతులు తమ చిన్న మనమడు విహాంత్‌ను వెంటబెట్టుకుని కలువాయి మండలం తోపుగుంట గ్రామంలో సత్తమ్మ తల్లికి పొంగళ్లు పెట్టుకునేందుకు వెళ్లారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ప్రసాద్ హత్యకు గురయ్యాడు.

అడ్డుతొలగించుకోవాలని...

తన బావ పెంచల ప్రసాద్‌ను పెళ్లి చేసుకోవడం సుహితకు ఇష్టం లేదు. అయిష్టంగానే ఇద్దరూ సంసారం చేస్తూ నిత్యం గొడవలు పడుతుండే వారు. కాగా, ఆ ప్రాంతంలోనే ఉంటున్న పెంచల వరప్రసాద్ తరచూ ప్రసాద్ ఇంటికి వస్తుండేవాడు. సుహితతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్లో చాటింగ్ చేసుకునేవారు. ఈ విషయం ప్రసాద్‌కు తెలియడంతో వరప్రసాద్‌ను కొట్టి తన భార్యతో దూరంగా ఉండాలని బెదిరించాడు. దీంతో ప్రసాద్‌పై వరప్రసాద్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా తన భర్తను అడ్డు తొలగించుకోవాలని సుహిత కూడా నిర్ణయించుకుని వరప్రసాద్‌కు చెప్పింది. అతడు తన స్నేహితులు ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన దుర్గా సాగర్, అల్లిపురానికి చెందిన ఇనుకుర్తి వెంకటసాయి, రామచంద్రాపురానికి చెందిన పడినాకర్ మనోహర్ అలియాస్ మనో, వేలు లివింగ్‌స్టన్, బొగ్గవరపు నాగేంద్రబాబు అలియాస్ చింగ్‌చాంగ్, నిరీక్షణ్, వసుపులేటి పెంచలయ్య అలియాస్ పవన్‌కుమార్‌ల సహాయం తీసుకున్నాడు. 18వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ ఉండరని వరప్రసాద్‌కు ముందుగా సుహిత ఫోన్ ద్వారా తెలియజేసింది. వెంటనే తన స్నేహితులతో వరప్రసాద్ ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న ప్రసాద్‌ను కత్తులతో పొడిచాడు. ఆ తర్వాత మృతుడి మొబైల్ తీసుకొని పరారయ్యారు. పోలీసులు తొలుత మృతుడి భార్య సుహితను ప్రశ్నించారు. ఆమె చెబుతున్న విషయాలు, ఆమె ప్రవర్తన అనుమానం రేకెత్తించాయని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి నుంచి కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కేసులో మృతుడి భార్యతోపాటు ఆరుగురిని అరెస్ట్ చేశారు.

ఉద్యోగానికి గర్భం అడ్డంకి కాదు

ఉత్తరాఖండ్ హైకోర్టు సంచలన తీర్పు

డెహ్రాడూన్, ఫిబ్రవరి 26: గర్భవతి అయినంత మాత్రాన ఒక మహిళను ఉద్యోగంలో చేరకుండా నిరోధించలేమని ఉత్తరాఖండ్ హైకోర్టు స్పష్టం చేసింది. తల్లి కావడమనేది గొప్ప వరం అని, దానివల్ల మహిళలకు ఉపాధిని నిరాకరించడం సరికాదని వ్యాఖ్యానించింది. గర్భం దాల్చిన కారణంగా బి.డి. పాండే జిల్లా ఆసుపత్రిలో తనకు నర్సింగ్ అధికారి పోస్టును నిరాకరించారని ఆరోపిస్తూ నైనిటాల్‌కు చెందిన మిషా ఉపాధ్యాయ్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా... గర్భం ధరించి 12వారాలు దాటిన మహిళ ప్రసవించే వరకూ తాత్కాలిక అనర్హురాలిగా గెజిట్ ఆఫ్ ఇండియా(అసాధారణం)లో ప్రకటించడంపై జస్టిస్ పంకజ్ పురోహిత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిటిషనర్ విషయంలో అధికారుల తీరు లింగ వివక్షకు సమానమని, మహిళల పట్ల సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

సహకార శాఖలో పదోన్నతుల రగడ

ప్రామాణికాలకు తిలోదకాలు

సీనియారిటీ, మెరిట్‌ని పక్కనపెట్టి.. డేట్ ఆఫ్ జాయినింగ్‌తో జాబితా తయారీ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖలో పదోన్నతుల వ్యవహారం వివాదాలకు దారితీస్తోంది. ప్రామాణికాలకు తిలోదకాలిచ్చి, నిబంధనలకు పాతరేసి, పదోన్నతులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేయడం వివాదానికి కారణమవుతోంది. సివిల్ సర్వీసెస్ మార్గదర్శకాల ప్రకారం భర్తీ చేయాల్సిన స్టేట్ కేడర్ పోస్టులను రోస్టర్ పాయింట్లు, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, గ్రీవెన్స్, కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం డేట్ ఆఫ్ జాయినింగ్‌ని అనుసరించి పదోన్నతులివ్వాలని చూస్తున్నారు. దీనిలో భాగంగా సహకార శాఖలోని డిప్యూటీ రిజిస్ట్రార్లకు స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. కేడర్ స్ట్రెంత్ ప్రకారం 16ఏళ్లుగా సీనియారిటీ జాబితా తయారు చేయకుండా, కనీసం మెరిట్, సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా డేట్ ఆఫ్ జాయినింగ్‌ను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని, 1:2 నిష్పత్తిలో సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు. వాస్తవంగా సహకార శాఖ హెచ్‌వోడీ, సహకార ట్రిబ్యునల్‌లో 4 స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులున్నాయి. కానీ ఈ పోస్టుల్లో వ్యక్తులెవరూ లేరు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ముందు జిల్లాస్థాయిలో జాయింట్ రిజిస్ట్రార్ పోస్టులు 13 ఉండగా, అందులో 9 ఖాళీగా ఉన్నాయి. కొత్త 13 జిల్లాలకు మాత్రం స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు మంజూరు చేశారు. ఇప్పుడు శాఖలో మొత్తం 114 డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఉన్నాయి. ఖాళీగా ఉన్న 9 జాయింట్ రిజిస్ట్రార్లు, 17 స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులను తాత్కాలిక పదోన్నతులతో భర్తీ చేసేందుకు డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం ఇటీవల 52 మందితో 2023-24 ప్యానల్ సంవత్సరానికి సీనియారిటీ జాబితాను రూపొందించారు. దీనికి డీపీసీ ఆమోదం తీసుకుని, పదోన్నతులు ఇవ్వడానికి పావులు కదుపుతున్నారు. ఇందుకోసం ఒకటి రెండు రోజుల్లో డీపీసీ భేటీ కానున్నట్లు తెలిసింది. అయితే సీనియారిటీ జాబితా లోపభూయిష్టంగా ఉందని ఉద్యోగుల నుంచి అభ్యంతరం వ్యక్తమౌతోంది. అన్ని అర్హతలున్నా.. పదోన్నతుల జాబితాలోకి రాని కొందరు ఉద్యోగులు సీనియారిటీ జాబితాను వ్యతిరేకిస్తున్నారు. 1995లో ఏపీపీఎస్సీ ద్వారా డిప్యూటీ తహసీల్దార్లుగా ఎంపికైన కొందరు రెవెన్యూ శాఖలో ఖాళీలు లేక సహకార శాఖలో చేరారు. అప్పటికే కొందరు నేరుగా సహకార శాఖకు ఎంపికైన వారూ చేరారు. కానీ టీడీలకు మెరిట్ ఉన్నా, నేరుగా సహకార శాఖలో చేరిన వారికే 2007లో పదోన్నతులు కల్పించారు. దానిపై కోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అప్పటి నుంచి కోర్టు కేసులు, జోనల్ సమస్యలు పరిష్కారం కాక చాలామంది డిప్యూటీ రిజిస్ట్రార్‌లుగానే ఉండిపోయారు. అందువల్ల డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రాతిపదికన కాకుండా, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని సీనియారిటీ జాబితా తయారు చేసి పదోన్నతులు ఇవ్వాలన్న వాదనను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళుతున్నారు.

ఏడోసారీ ఈడీ సమన్లు బేఖాతరు!

» విచారణకు హాజరు కాని కేజ్రీవాల్

» ఒత్తిడి తెచ్చేందుకే వరుస సమన్లు..

» కాంగ్రెస్‌తో పొత్తు వీడం: ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీ ముఖ్యమంత్రి, 'ఆప్' కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఏడోసారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లను బేఖాతరు చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ అంశంపై కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఈడీ వరుసగా సమన్లు జారీ చేస్తోంది. తాజాగా సోమవారం తమ ముందు హాజరు కావాలని కోరగా కేజ్రీవాల్ వెళ్లలేదు. కోర్టు ఆదేశిస్తే ఈడీ ముందు హాజరవుతానని తెలిపారు. ఏ విషయం కోర్టు నిర్ణయించే దాకా ఆగలేరా అని ఈడీని ప్రశ్నించారు. తనపై ఒత్తిడి తెచ్చి, ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చేలా చేసేందుకే పదే పదే సమన్లు జారీ చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో పొత్తును తెంచుకునేది లేదని స్పష్టం చేశారు. ఇరు పార్టీల మధ్య ఢిల్లీ, హరియాణా, గుజరాత్‌లో లోక్‌సభ స్థానాల పంపకంపై ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసి ఏడాది అయిన సందర్భంగా కేజ్రీవాల్, మంత్రులు, ఆప్ ఎమ్మెల్యేలు సోమవారం రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. ఢిల్లీ విద్యా రంగంలో గొప్ప మార్పులు తెచ్చి, నాణ్యమైన విద్యకు బాటలు వేసిన సిసోడియాపై కేంద్రం బోగస్ కేసు బనాయించి, జైలుకు పంపిందని కేజ్రీవాల్ మండిపడ్డారు.

షేక్ షాజహాన్ అరెస్టుపై స్టే లేదు

» కలకత్తా హైకోర్టు స్పష్టత

» 7 రోజుల్లో అరెస్టు చేస్తాం: టీఎంసీ

కోల్‌కతా, ఫిబ్రవరి 26: సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక వేధింపులు, భూములు లాక్కున్న వ్యవహారంలో తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ అరెస్టుపై తాము ఎలాంటి స్టే ఇవ్వలేదని కలకత్తా హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. కేసులో అతడు నిందితుడైనందున వెంటనే అరెస్టు చేయాలని అధికారులకు సూచించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల కారణంగానే షాజహాన్‌ను అరెస్టు చేయడం లేదని టీఎంసీ జనరల్ సెక్రెటరీ అభిషేక్ బెనర్జీ ఇటీవల చెప్పారు. ఈ నేపథ్యంలోనే కోర్టు సోమవారం స్పష్టతనిచ్చింది. సందేశ్‌ఖాలీ వ్యవహారాన్ని కలకత్తా హైకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. కాగా, షేక్ షాజహాన్‌ను 7 రోజుల్లోగా అరెస్టు చేస్తామని టీఎంసీ సీనియర్ నేత కునాల్ ఘోష్ చెప్పారు. సోమవారం హైకోర్టు అరెస్టుపై స్పష్టత ఇచ్చిన వెంటనే ఆయన ఈ ప్రకటన చేశారు. మరోవైపు, భూములు లాక్కున్నారన్న ఆరోపణలతోనే పశ్చిమ బెంగాల్ పోలీసులు సోమవారం మరో టీఎంసీ నేత అజిత్ మైతీని అరెస్టు చేశారు. అజిత్ షాజహాన్‌కు అత్యంత సన్నిహితుడు. సందేశ్‌ఖాలీలో బాధితుల నిరసనలు ఆగడం లేదు. సోమవారం వారు స్థానిక టీఎంసీ నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. పలువురి ఆస్తులను ధ్వంసం చేశారు. తమ కుటుంబసభ్యులపై నిరసనకారులు దాడులకు పాల్పడ్డారని స్థానిక టీఎంసీ నేతలు ఆరోపించారు.

బతికున్నంత వరకు బాల్య వివాహాలు జరగనివ్వను

» ముస్లిం ఆడపిల్లలకు కాంగ్రెస్ అన్యాయం: అసోం సీఎం హిమంత

గువాహటి, ఫిబ్రవరి 26: తాను బతికున్నంత కాలం అసోంలో బాల్య వివాహాలు జరగనివ్వబోనని సీఎం హిమంత బిస్వా శర్మ వ్యాఖ్యానించారు. ముస్లిం ఆడపిల్లల జీవితాలను కాంగ్రెస్సే నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. 2026లోపు బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలిస్తామని సోమవారం అసెంబ్లీలో శపథం చేశారు. బ్రిటిష్ కాలం నాటి అసోం ముస్లిం వివాహాలు, విడాకుల నమోదు చట్టాన్ని రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపడంపై మండిపడుతూ కాంగ్రెస్, ఆలిండియా డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై హిమంత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నేను బతికున్నంత వరకు అసోంలో బాల్య వివాహాలు జరగనివ్వను. ముస్లిం ఆడపిల్లల జీవితాలను నాశనం చేయడానికి మీరు (కాంగ్రెస్) తెరిచిన దుకాణాన్ని పూర్తిగా మూసివేసే వరకు శాంతించేది లేదు. బ్రిటిష్ కాలం నాటి ఆ చట్టం రద్దుతో హింస, దోపిడీ నుంచి ముస్లిం తల్లులకు ఉపశమనం దొరుకుతుంది. 18 ఏళ్ల లోపు అమ్మాయికి పెళ్లి చేయలేరు. అలాగే తలాక్ చెప్పడం కూడా అంత సులువు కాదు. ముస్లింలకు మేం వ్యతిరేకమని కొందరు అంటున్నారు.. అయితే ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వం, బాల్య వివాహాలకు స్వస్తి పలికి ముస్లిం మహిళా సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయనంత మేలును చేశాం..' అని చెప్పారు.

డెక్కన్ కిచెన్ వివాదంలో నందకుమార్‌కు జైలు

» రూ.2వేల జరిమానా.. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు నిర్ధారణ

» దగ్గుబాటి కుటుంబ సభ్యుల కేసులో హైకోర్టు తీర్పు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో దగ్గుబాటి వెంకటేశ్, నిర్మాత సురేశ్‌బాబు కుటుంబానికి.. అప్పట్లో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడిగా ఉన్న కోరె నందకుమార్‌కు మధ్య లీజుకు సంబంధించి నెలకొన్న వివాదంలో సోమవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. హైకోర్టు స్టేటస్ కో విధించినా ఆ ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినందున నందకుమార్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు గుర్తించింది. నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. డబ్ల్యూ 3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ నందకుమార్‌కు చెందిన డెక్కన్ కిచెన్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందున కూల్చేస్తామని పేర్కొంటూ 2021లో జీహెచ్ఎంసీ కమిషనర్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ నోటీసు జారీచేశారు. ఈ నోటీసును సవాల్ చేస్తూ నందకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో దగ్గుబాటి కుటుంబ సభ్యులను సైతం ప్రతివాదులుగా చేర్చారు. నందకుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సంచలనం అయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్పటికే కూల్చివేతలు చేపట్టారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. అసలు వివాదం ఏంటో పూర్తిగా పరిశీలన జరిపే వరకు అటు పిటిషనర్, ఇటు ప్రతివాదులు యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఇరుపక్షాలు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేసింది. హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను నందకుమార్ ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ దగ్గుబాటి వెంకటేశ్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని తనిఖీ చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. స్టేటస్ కో ఆదేశాలను ధిక్కరించి అక్కడ తెల్లవారుజామున నిర్మాణాలు చేపట్టినట్లు ఫొటోలు, ఇతర ఆధారాలను జీహెచ్ఎంసీ అధికారులు హైకోర్టుకు సమర్పించారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు ఆధారాలతో సహా తేలడంతో నందకుమార్‌కు జైలు శిక్ష, జరిమానాను విధించింది. అయితే అప్పీలు చేయడానికి వీలుగా వీటి అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తున్నట్టు పేర్కొంది.

మీకు చేతకాకపోతే.. మేమే చేస్తాం

» కోస్ట్‌గార్డ్ కేసులో కేంద్రానికి సుప్రీం అల్టిమేటం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: మహిళా కోస్ట్‌గార్డ్ అధికారులకు శాశ్వత కమిషన్ మంజూరు చేసే అంశంపై కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం ఇచ్చింది. మహిళలపై నిర్లక్ష్యం తగదని, మీరు చేయకుంటే తామే చేస్తామని స్పష్టం చేసింది. ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని కేంద్రం తరపు న్యాయవాదికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. అఫిడవిట్ దాఖలు చేయాలని కోస్ట్‌గార్డ్‌ను కోరతామని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి చెప్పడంతో తదుపరి విచారణను మార్చి 1వ తేదీకి వాయిదా వేశారు. షార్ట్ సర్వీస్ కమిషన్ కింద కోస్ట్‌గార్డ్‌లో చేరే అర్హులైన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ కోరుతూ ఐసీజీ అధికారి ప్రియాంక త్యాగి పిటిషన్ దాఖలు చేశారు.

కృత్రిమ మేధతో పిండం వయసు నిర్ధారణ

ఏఐ నమూనాను అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాస్ పరిశోధకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: గర్భిణీ స్త్రీల కడుపులోని పిండం వయస్సును కచ్చితంగా నిర్ధారించే కృత్రిమ మేధ నమూనాను ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. భారత్ తరఫున ఈ తరహా ఏఐ మోడల్‌ను రూపొందించడం ఇదే తొలిసారి. గర్భిణుల సంరక్షణకు, ప్రసవ తేదీలను కచ్చితంగా నిర్ణయించడానికి సరైన 'గర్భధారణ వయస్సు' (గెస్టేషనల్ ఏజ్) అవసరం. 'గర్భిణి-జీఏ2'గా పిలిచే ఈ ఏఐ నమూనాను భారత జనాభా డేటాను ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఇది పిండం వయస్సును కచ్చితంగా అంచనా వేస్తుందని, దీనివల్ల తప్పులు జరిగే అవకాశాలు మూడు రెట్లు తగ్గుతాయని అధికారులు తెలిపారు. అలాగే ఈ జీఏ2 మోడల్‌తో ప్రసూతి వైద్యులు మెరుగైన సంరక్షణ అందించేందుకు వీలవుతుందని.. తద్వారా భారత్‌లో మాతా శిశు మరణాల రేటు తగ్గుతుందని చెప్పారు. ఐఐటీ మద్రాస్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ హిమాన్షు సిన్హా నేతృత్వంలో పరిశోధనలు సాగించిన బృందం 'గర్భిణి-జీఏ2'ను అభివృద్ధి చేసింది. ఈ వివరాలు ప్రఖ్యాత లాన్సెట్ రీజినల్ హెల్త్ ఆగ్నేయాసియా జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 27 ఫిబ్రవరి 2024

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. లైఫ్ సైన్సెస్, మోడ్రన్ బయోటెక్నాలజీ అంశాలకు సంబంధించిన ల్యాబొరేటరీ ట్రెయినింగ్‌తో కోర్సును రూపొందించారు. మొదటి ఏడాది ల్యాబొరేటరీ ప్రయోగాలతోపాటు క్లాస్ రూమ్ టీచింగ్ ఉంటుంది. రెండో ఏడాది రీసెర్చ్ ల్యాబొరేటరీలో వర్క్ చేయాల్సి ఉంటుంది. మాస్టర్స్ డిజర్టేషన్ కూడా సబ్మిట్ చేయాలి. అభ్యర్థి ప్రతిభను పరిశీలించి పీహెచ్‌డీ థీసిస్ వర్క్, రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. మొదటి రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గ్యాట్ బీ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశాల్లో అభ్యర్థి అవగాహన, ఆసక్తి, అచీవ్‌మెంట్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులందరికీ ఆర్‌సీబీ రామచంద్రన్ డీబీటీ ఫెలోషిప్ ఇస్తారు. దీని కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000 చెల్లిస్తారు. తరవాత అభ్యర్థులు సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/డీబీటీ నుంచి జూనియర్/సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందాల్సి ఉంటుంది. వీరికి జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.37,000; ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. విదేశీ అభ్యర్థులకు మాత్రం నిబంధనల ప్రకారం ఆర్‌సీబీ-డీబీటీ ఇంటర్నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in



ఇన్సూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతోపాటు జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, రీ-ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్‌ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

వెయిటేజీ: పదోతరగతి మార్కులకు 2 శాతం, ఇంటర్ మార్కులకు 3 శాతం, డిగ్రీ మార్కులకు 5 శాతం, జాతీయ పరీక్ష స్కోర్‌కు 50 శాతం, జీడీ స్కోర్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, ఏడాదికి మించిన అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ సెంటర్లు:** పుణె, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రధాన నగరాలు
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.



1. ఓసీటీటీ-మెటలర్జీ: **57 పోస్టులు**
2. ఓసీటీటీ - ఎలక్ట్రికల్: **64 పోస్టులు**
3. ఓసీటీటీ- మెకానికల్: **100 పోస్టులు**
4. ఓసీటీటీ-సివిల్: **22 పోస్టులు**
5. ఓసీటీటీ-కెమికల్: **18 పోస్టులు**

మొత్తం ఖాళీలు: 324

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు మెటలర్జీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, కెమికల్, సిరామిక్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు సంబంధించి ఏదో ఒక దానిలో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్స్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక విధానం: రాత పరీక్ష ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఫీజు: రూ.500, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.200.
పరీక్ష కేంద్రాలు: దేశంలోని ప్రధాన నగరాల్లో
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18
వెబ్‌సైట్: https://sail.co.in/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఇండియన్ నేవీ దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ - జనవరి 25


బ్రాంచి వివరాలు

1. జనరల్ సర్వీస్: **50 పోస్టులు**
2. పైలెట్: **20 పోస్టులు**
3. నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: **18 పోస్టులు**
4. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: **8 పోస్టులు**
5. లాజిస్టిక్స్: **30 పోస్టులు**
6. నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: **10 పోస్టులు**
7. ఎడ్యుకేషన్: **18 పోస్టులు**
8. ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **30 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): **50 పోస్టులు**
10. నావల్ కన్‌స్ట్రక్టర్: **20 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100, ఇతర అలవెన్సులు
ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

లిటిల్స్



జరిగేది మంచికే

అనగనగా ఒక రాజు. మంచివాడు. దృఢ సంకల్పం ఉన్నవాడు. అయితే అతనికి యుద్ధ విద్యలు రావు. దీంతో అతని మీద అతనికే తక్కువ అంచనా ఉండేది. అయితే అతని రాజ్యం సంపదల కొలువు. ప్రజలంతా సుభిక్షంగా ఉండేవారు. మంచి, చెప్పినా చెడు చెప్పినా ఒకటే విధంగా తీసుకుంటాడు. అందుకే చాలా మంది ఆయన్ని భజన చేసేవారు. అంతా అద్భుతం అనేవారు. ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడేవారు కాదు. తనకు జవాబుగా చెబితే జైల్లో పెట్టించేవాడు. అడ్డం మాట్లాడితే అంతే సంగతులు. అందుకే రాజుగారికి అసలు విషయం అసలే తెలిసేది కాదు.

ఒక రోజు రాజుగారు సాయంత్రం పూట చల్లని గాలికి కోటలో కూర్చుని ఉన్నారు. విపరీతమైన గాలి వచ్చింది. ఆ గాలిని తలుపులు వేగంగా కొట్టుకున్నాయి. తన మందిరంలోకి ఎవరూ రావద్దనేది రాజుగారి ఆదేశం కాబట్టి ఎవరూ వెళ్లలేదు. ఒక వాకిలి గాలికి వేగంగా కొట్టుకుంటే వేయబోయాడు. పొరబాటున ఆ తలుపు మధ్యలో పడి మూడో వేలు విరిగిపోయింది. వెంటనే విలవిలలాడిపోయాడు రాజుగారు. గట్టిగా అరిచాడు. వెంటనే రాజ వైద్యుడు వచ్చి ఆ వేలుకు కట్టు కట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఇక ఈ వేలు ఇంతే రాజావారు అన్నారు వైద్యుడు.




'జరిగింది మంచికే రాజా.. ఏం చేస్తాం' అన్నాడు మంత్రి. ఏమాత్రం ఆలోచించకుండా 'ఇతన్ని చెరసాలలో వేయండి' అన్నాడు. వెంటనే ఆ మంత్రిగారు ఖైదీ అయ్యారు. 'నాకు జరిగింది మంచిదే' అంటాడా అని కోప్పడ్డాడు. ఎవరూ అడ్డు చెప్పలేదు. మంత్రిగారు ఖైదీగా తిండి తింటున్నారు.


ఒక రోజు రాజుగారు వేటకు వెళ్లారు. ఆ వేటలో సింహాన్ని వేటాడాలని అనుకున్నాడు. సింహం దొరకలేదు. కోయలు ఏనుగుల కోసం వేసిన గుంతలో పడబోయిన గుర్రం తప్పించుకుంది. రాజుగారు పడిపోయారు. దూరంగా సైన్యం. క్షణాల్లో కోయలు ఆ రాజుగారిని పట్టుకెళ్లారు. అసలే అడవి జనాలు. అడవిలో ఓ భూత వైద్యుడు 'ఆరోగ్యవంతమైన రాజుగారిని బలి ఇస్తే మీకు మంచి జరుగుతుంది' అని చెప్పాడట. అందుకే రాజుగారిని బలి ఇవ్వాలని అడవి వాళ్లు పట్టుకెళ్లారు. తీరా మాట్లాడుతుంటే విరిగిన వేలు కనపడింది. 'అపశకునం' అని ఆ రాజుగారిని వదిలేశారు.. ఆ అడవి జనాలు.

రాజుగారు చచ్చిబతికి దూరంగా పారిపోయాడు. భటులు చూశారు. రాజ్యానికి తీసుకెళ్లారు. హుటాహుటిన మంత్రిగారిని వదిలేయండి అన్నారు. మంత్రిగారికి అర్థం కాలేదు. 'మీరు మంచి చేశారు. మీలాంటి యోగులు మా రాజ్యంలో ఉండటం అదృష్టం. దయచేసి ఇక మీద తప్పు చేయను. మీరే మా సలహాదారులు. ఈ రోజు నుంచి నాకు నిజాలు చెప్పండి. అబద్ధాలు చెప్పకండి. భజనలు వద్దు. విషయం చెప్పండి' అంటూ రాజుగారు అన్నారు. 'ఇదీ మంచిదే' అన్నాడు మంత్రి. రాజుగారు నవ్వారు గట్టిగా.

5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 240

		7						
9	4					1		
			5		4		9	
				7	9		8	4
		3				2		
4	8		1	6				
	1		8		3			
		8					3	2
						6		

సుడోకు - 239 సమాధానం

6	5	8	7	2	9	1	4	3
9	4	2	3	5	1	6	8	7
3	1	7	4	6	8	5	2	9
2	6	1	5	7	3	4	9	8
7	9	4	8	1	6	2	3	5
8	3	5	9	4	2	7	1	6
4	8	6	2	9	7	3	5	1
5	7	9	1	3	4	8	6	2
1	2	3	6	8	5	9	7	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ హిస్టరీ

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలంలోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేథ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావాదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగభద్ర రాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరిస్ (గ్రీకు రాజైన అంటియోకిడాన్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే... పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారతదేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేధయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేధయాగాలు చేసినట్లు రాసి ఉంది.

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు...

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సార్‌నాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్తూపంపై అజాతశత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్‌ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్దమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.

జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం...దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.